ఆదివారం
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
హైదరాబాద్ : fb.com/vaartha Digital
Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
8-10-2026 గురువారం సంపుటి: 32 సంచిక: 249 పేజీలు: 10+4 వెల: 6.50

గణిత శాస్త్రవేత్త మహేష్ కాక్డేకు రామానుజన్ అవార్డు 5
మోడీ జీవితంలో చిరస్మరణీయం అక్టోబరు 7



## అణు రహస్యాలు అరచేతిలోకి

**ఫ్రెంచ్ సైంటిస్ట్ హెన్రీ కాగన్, జపనీస్ శాస్త్రవేత్త కెన్సో సోయ్‌కి కెమిస్ట్రీలో నోబెల్**

**'అసిమెట్రిక్ ఆర్గానిక్ సింథసిస్‌లో నాన్‌లీనియర్ ఎఫెక్ట్స్, ఆటోకెటాలసిస్స్ ఆవిష్కరణకు గుర్తింపు**

**స్టాక్‌హోమ్, అక్టోబరు 7:** కొన్ని అణువుల దర్పణప్రతిబింబ రూపాలలో కేవలం ఒక రకం మాత్రమే ప్రకృతిలో ఎందుకు కనిపిస్తుందనే రహస్యాన్ని ఛేదిం చినందుకు ఫ్రాన్స్‌కు చెందిన హెన్రీ కాగన్, జపాన్‌కు చెందిన కెన్సో సోయ్ బుధవారం రసాయన శాస్త్ర నోబెల్ బహుమతిని గెలుచుకు న్నారు. ఔషధాల అభివృద్ధికి ఈ ఆవిష్కరణ చాలా కీలకమైనది. "అసిమె ట్రిక్ ఆర్గానిక్ సింథసిస్‌లో నాన్‌లీనియర్ ఎఫెక్ట్స్, ఆటోకెటా లసిస్ ఆవిష్కరణక్ను గాను ఈ ద్వయాన్ని సత్కరించినట్లు >>2



## వుయ్ విల్ డూ ఇట్..



**'పాలనా రజతోత్సవం' వేళ ప్రధాని మోడీ కొత్త నినాదం**

**వికసిత్ భారత్ సంకల్ప సభలో ఆత్మనిర్భర్ భారత్ సాధనకు పిఎం ప్రతిజ్ఞ**

**న్యూఢిల్లీ,అక్టోబరు 7:** ప్రభుత్వ అధినేతగా పాతికేళ్ల ప్రయాణాన్ని పూర్తి చేసు కున్న వేళ ప్రధాని మోడీ దేశప్రజలకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఓ కొత్త నినాదాన్ని ప్రజల ముందుకు తెచ్చా రు. 2047 నాటికి భారత్‌ను సంపూర్ణంగా వికసిత భారత్‌గా, >>2



**దసరా కానుకగా**

## 2 డిఎలు మంజూరు

**ఉద్యోగులకు అక్టోబరు జీతంతో కలిపి చెల్లింపు**

**హైదరాబాద్,అక్టోబరు7,ప్రభాతవార్త:** దసరా పండుగ వేళ తెలంగాణ ప్రభు త్వ ఉద్యోగులు,పెన్షనర్లకు రాష్ట్ర ప్రభు త్వం గుడ్‌న్యూస్ చెప్పింది. పెండిం గ్‌లో ఉన్న రెండు డియర్‌నెస్ అల వెన్స్(డీఏ)లను మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.2024 జనవరి, జూలై నుంచి పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలని ఇటీవల జరిగిన రాష్ట్ర కేబి నెట్‌సమావేశంలో నిర్ణయించిన విష యం తెలిసిందే.తాజాగా ఆ నిర్ణయా నికి అనుగుణంగా ప్రభుత్వం జీవో జారీ చేసింది. రెండు డీఏలను కలిపితే ఉద్యోగుల డీఏలో మొత్తం 6.27 శాతం మేర >>2

# ఢిల్లీలో హోరాహోరీ



బుధవారం న్యూఢిల్లీలో రోడ్డుమీద పడుకొని ఆందోళన చేస్తున్న ఎంపి ప్రియాంక గాంధీ. చిత్రంలో రాహుల్ తదితర నేతలు

**రెండో రోజున కొనసాగిన 'ఇండీ' భారీ ఆందోళనలు**

**నేతలు జంతర్‌మంతర్ వద్దకు వెళ్లకుండా అడ్డుకొన్న పోలీసులు, లాఠీఛార్జి**

**ఖమ్మం ఎంపి రఘురామిరెడ్డి, రేణుకాచౌదరి సహా పలువురికి గాయాలు**

**ఎంపీలతో కలిసి రోడ్డుపైనే పడుకున్న ప్రియాంక గాంధీ**

**రాహుల్ సహా పలువురు నేతలను అరెస్టు చేసిన పోలీసులు**

**జ్ఞానేశ్‌తో పాటు ప్రధాని, అమిత్‌షా కూడా రాజీనామా చేయాలని నేతల డిమాండ్**

**న్యూఢిల్లీ:** ఓటర్ల జాబితా సవరణను వ్యతిరేకిస్తూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ ఇండియా కూటమి నేతలు చేపట్టిన నిరసన ఉద్రిక్తంగా మారిం ది. వరుసగా రెండో రోజు కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ సహా ఇండియా కూటమి కీలక నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిరసనలో పాల్గొన్న ఇతర నాయ కులు, కార్యకర్తలను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అదేవిధంగా పలువురు ఎంపిలకు కూడా లాఠీఛార్జి చేయడంతో గాయాలయ్యాయి. మహిళా ఎంపిలని కూడా >>2

45 కాదు 100 ఎఫ్‌ఐఆర్‌లు నమోదుచేసినా తగ్గేదిలేదు!
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ 5



**జ్ఞానేశ్ రాజీనామా దాకా**

## పోరాడుతాం

**అక్రమ అరెస్టులకు బెదరం: సిఎం రేవంత్**

**రాహుల్‌ను కలిసేందుకు యత్నించిన సిఎంను అడ్డుకొన్న పోలీసులు**

**హైదరాబాద్,అక్టోబరు7,ప్రభాతవార్త:** ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సహా ఇతర విపక్ష నాయకులను పోలీసులు >>2



**కరవు మండలాలు**

## 320

**18 జిల్లాల్లో కరవు తీవ్రత అధికం**

**తీవ్ర వర్షాభావ ఏరియాలకు అత్యవసర ప్యాకేజీ**

**హైదరాబాద్, అక్టోబరు 7, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం మంగళవారం రాష్ట్రంలోని 18జిల్లాల్లోని 320 మండ లాలను కరవు పీడిత ప్రాంతాలుగా గుర్తించింది. అయితే, అక్టోబర్ నెలాఖ రులోగా కరవు పరిస్థితులపై సమగ్ర నివేదికను సిద్ధం చేయనున్నట్లు, తీవ్ర వర్షపాత కొరతను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ఒక అత్యవసర ప్యాకేజీని ప్రకటించనున్నట్లు తెలిపింది. వర్షా భావం కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా 17 శాతం లోటు వర్షపాతం నమోదైనట్లు ప్రభుత్వం వెల్లడించింది. గ్రామాల్లో నెలకొన్న పరిస్థితులపై రాష్ట్ర రెవెన్యూ (విపత్తు నిర్వహణ) నివేదిక సమర్పిం చిన తర్వాత కరవు ప్రభా విత మండలాల సంఖ్యను >>2



## హైదరాబాద్‌లో అమెరికా వర్సిటీ క్యాంపస్

**యుజిసి గ్రీన్ సిగ్నల్, 2027లో తొలి బ్యాచ్**

**హైదరాబాద్,అక్టోబరు7,ప్రభాతవార్త:** తెలంగాణ విద్యా రంగంలో మరో కీలక ముందడుగు పడింది. ఎన్నో అంతర్జాతీయ సంస్థలు అడుగుపెట్టిన హైద రాబాద్ నగరానికి అమెరికా యూనివర్సిటీ రానుంది. అమెరికాకు చెందిన యూనివర్సిటీ ఆఫ్ కొలరాడో డెన్వర్ (సీయూ డెన్వర్).. హైదరాబాద్‌లో డిగ్రీలు అందించే క్యాంపస్‌ను ఏర్పాటు చేసేందుకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నుంచి లెటర్ ఆఫ్ ఇంటెంట్ (ఎల్‌ఓఐ) పొందింది. దీంతో భారత్‌లో డిగ్రీ ప్రదానం చేసే క్యాంపస్ ఏర్పాటు చేయడానికి ఎల్‌ఓఐ పొందిన తొలి అమెరికన్ పబ్లిక్ యూనివర్సిటీగా సీయూ డెన్వర్ నిలవనుంది. తెలంగాణలో క్యాంపస్‌ఏర్పాటు చేయనున్న తొలి విదేశీ యూనివర్సిటీ కూడా ఇదే కానుండటం గమనార్హం,హైదరాబాద్ క్యాంప స్‌లో తొలి విద్యార్థుల బ్యాచ్‌ను 2027 ఆగస్టులో చేర్చుకోవాలని సీయూ డెన్వర్ టార్గెట్‌గా పెట్టుకుంది. అయితే ఇందుకు అవసరమైన అన్ని అను మతి ప్రక్రియలు పూర్తికావాల్సి ఉంటుంది. ప్రస్తుతం సంబంధిత సంస్థలతో ఆ యూనివర్సిటీ సంప్రదింపులు కొనసాగిస్తోంది. మొదటి దశలో విద్యా ర్థులకు డిమాండ్ ఉన్న పలు రంగాల్లో కోర్సులను అందించాలని ప్రతిపాదించింది. ముఖ్యంగా బిజినెస్, కంప్యూటింగ్, >>2

# విద్యుత్ పై 'వేటు' లేదు



బుధవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతున్న డి.సిఎం భట్టి

**రాష్ట్రంలో అనూహ్యంగా విద్యుత్ డిమాండ్**

**యాదాద్రి పవర్ ప్లాంట్ జాప్యం గత ప్రభుత్వ పాపమే: డి.సిఎం భట్టి**

**హైదరాబాద్, అక్టోబరు 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణ ప్రశక్తే లేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. రాష్ట్రంలోని విద్యుత్ పంపిణీ సంస్థలు, ట్రాన్స్‌కో, జెన్కోలను ప్రైవేటీ కరించబోతున్నారని ప్రచారంలో వాస్తవం లేదని తెలిపారు. తమ ప్రభుత్వం పబ్లిక్ సెక్టార్ అండర్‌టేకింగ్స్‌ను పూర్తిగా విశ్వసిస్తుందన్నారు. నెహ్రూవియన్ ఆర్థిక విధానం, మిశ్రమ ఆర్థిక వ్యవస్థ, బలమైన ప్రభుత్వ రంగ సంస్థలే తమ ప్రభుత్వ విధానమని తేల్చిచెప్పారు. హైదరాబాద్‌లో బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ పవర్ సెక్టార్‌ను అమ్మేయాలన్న ఆలోచన, చర్చ అసలు లేదని చెప్పారు. యాదాద్రి పవర్ ప్లాంట్‌కు అవస రమైన బొగ్గు కేటాయింపులు, సరఫరా లింకేజీలను ముందుగానే నిర్ధారిం చకుండా గత ప్రభుత్వం ప్లాంట్ నిర్మాణం చేపట్టిందని ఆరోపించారు. థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణానికి స్థలం, డీపీఆర్, సాంకేతిక అంశాలతో పాటు బొగ్గు లింకేజీ అత్యంత కీలకమని చెప్పారు. అవసరమైన బొగ్గు లభ్యత, పరిమాణం, నాణ్యత, సరఫరా సామర్థ్యం వంటి అంశాలపై స్పష్టమైన ప్రణాళిక లేకుండా యాదాద్రి ప్లాంట్‌ను నిర్మించారని విమర్శించారు. రాష్ట్రం లో విద్యుత్ డిమాండ్ చరిత్రలోనే అత్యధిక స్థాయికి చేరిందన్నారు. ఎల్‌నినో ప్రభావం ఉన్నప్పటికీ రాష్ట్రంలో పీక్ విద్యుత్ డిమాండ్ 19,892 మెగావా ట్లకు చేరిందని తెలిపారు. దాదాపు 20 వేల మెగావాట్లకు డిమాండ్ పెరిగి నప్పటికీ విద్యుత్ కోతలు లేకుండా సరఫరా కొనసాగిస్తున్నామని వెల్లడిం చారు. థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణానికి స్థలం, డీపీఆర్‌తో పాటు అత్యంత కీలకమైన అంశం బొగ్గు కేటాయింపు, సరఫరా >>2

నేటి నుంచి హైదరాబాద్‌లో ఆర్చరీ ప్రీమియర్ లీగ్ 3



## విద్యుత్ భారంపై ప్రజాపోరాటం

**కోతలు లేకుంటే రైతులు ధర్నా ఎందుకు చేస్తారు: హరీష్‌రావు**

**హైదరాబాద్,అక్టోబరు7,ప్రభాతవార్త:** మంత్రి భట్టి విక్రమార్క వ్యాఖ్యల పట్ల బుధవారం సాయంత్రం మాజీ మంత్రి, బిఆర్‌ఎస్‌ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ధ్వజమెత్తారు. విద్యుత్ వినియోగదారులపై ట్రూప్ అప్ చార్జీల పేరిట రూ.5,420 కోట్ల భారం మోపడం గురించి ప్రశ్నిస్తే ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం సరికాదని, ప్రజలపై మోపిన భారాన్ని ఉపసం హరించుకొని పండుగ పూట శుభవార్త చెబుతారనుకుంటే ఉసూరుమనిపిం చారని పేర్కొన్నారు. ఇప్పటికైనా కళ్లు తెరిచి కరెంట్ కోతలు లేకుండా చూడాలని, ట్రూ అప్ చార్జీల పేరిట ప్రజలపై వేసిన రూ.5,420 కోట్ల విద్యుత్ భారాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం. లేదంటే బిఆర్‌ఎస్ ప్రజా పోరాటానికి సిద్ధం అవుతుందని మరోసారి స్పష్టం చేస్తు న్నామని చెప్పారు. రైతులు రోడ్ల మీదకు వచ్చి కరెంట్ కోసం ధర్నాలు చేస్తుంటే, కోతలే లేవు అని చెప్పడం మీకే చెల్లింది, మీరు సక్ర మంగా కరెంట్ సరఫరా చేస్తే రైతులు ఎందుకు సబ్ స్టేషన్ల >>2

## రంగు రుచి వాసన కల్తీ

**హైదరాబాద్ హోటళ్లలో తింటే.. శాల్తీ గల్లంతు**

ప్రభాతవార్త / న్యూస్‌నెట్‌వర్క్



**హెచ్ ఫాస్ట్ అధికారుల బృందం దాడుల్లో విస్తుపోయే నిజాలు**

**నూనెలు, నెయ్యి, మసాలా, చికెన్, పనీర్ టచ్ చేస్తే కల్తీ కాటు**

**గుండె జబ్బులు, కేన్సర్, లంగ్స్ వ్యాధులు సంక్రమించే అవకాశం**

కుటుంబంతో సరదాగా గడపాలనో, చిన్న చిన్న శుభకార్యాలు జరుపు కోవడానికో హోటళ్లకు వెళితే అనారోగ్యం కొని తెచ్చుకున్నట్లు అవు తోంది. భాగ్యనగరంలో హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో ఆహార పదార్థాలు భుజిస్తే ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొని ఉంది. బయట నుంచి చూస్తే స్టార్ హోటళ్లను తలపించే మాదిరిగా కళ్లు జిగేలుమనే విద్యుత్‌దీపాలతో ఆకర్శిస్తారు. మెనూలో రకరకాల నోరూరించే ఆహార పదార్థాల వివరాలు ఉం టాయి. అయితే ఒక్కసారి వంట చేసే ప్రాంతానికి >>7





## 5 ఎకరాల వరి చేను బూడిద

**సాగు నీరు లేక పంటకు నిప్పు పెట్టిన రైతు**

**హైదరాబాద్, అక్టోబరు 7, ప్రభాతవార్త:** ఎల్‌నినో కారణంగా ఏర్పడిన వర్షాభావ పరిస్థితులు రైతు లను అతలాకుతలం చేస్తున్నాయి. పెట్టుబడులు పెట్టి కంటికి రెప్పలా చూసుకుంటున్న పంటలకు సాగు నీరు అందక ఎండిపోతుండటాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో పట్టిపీడిస్తున్న తీవ్ర నీటి కొరతతో పంటలు ఎండిపోతుండటాన్ని వివిధ రూపాల్లో రైతులు తెలియచేస్తున్నారు. ఇందులో భాగంగా నిజామాబాద్ జిల్లాలో తగినంత నీటిపారుదల సౌకర్యం కల్పించుకోలేకపోయిన ఒక రైతు, తన ఐదు ఎకరాల విస్తీర్ణంలో ఎండిపోయిన వరి పంటకు నిప్పంటించాడు. వర్ణి మండలం, పైడిపల్లి గ్రామానికి చెందిన రైతు కండి రాములు, గణనీయమైన శ్రమ, పెట్టుబడి పెట్టి ఐదు ఎకరాల్లో వరి సాగు చేశారు. అయితే, >>2



బుధవారం న్యూఢిల్లీలో బిజెపి అగ్రనేత అద్వానీ ఆశీస్సులు తీసుకొంటున్న ప్రధాని మోడీ

## అద్వానీ ఆశీస్సులు తీసుకున్న ప్రధాని

**న్యూఢిల్లీ,అక్టోబరు 7:** బీజేపీ సీనియర్ నాయకుడు ఎల్‌కే.అద్వానీని ప్రధాని మోడీ కలిశారు. ఆయన నివాసంలో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆరోగ్య విషయాలపై ఆరా తీశారు. అనంతరం అద్వానీ దగ్గర ఆశీర్వాదం తీసుకున్నారు. ప్రభుత్వాధినేతగా మోడీ 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ భేటీ జరిగినట్లుగా తెలుస్తోంది. అద్వానీని మోడీ పరామర్శించిన ఫొటో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. మోడీ ముఖ్యమంత్రిగా ప్రధానిగా బాధ్యతలు చేపట్టి 25 ఏళ్లు పూర్తైంది. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ 2001 అక్టోబర్ 7న గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినప్పుడు తాను ఈ స్థాయికి చేరుకుంటానని ఎప్పుడూ అనుకోలేదన్నారు. ఈ విజయం ఆత్మస్తుతికి సందర్భం కాదని.. కృతజ్ఞతలు తెలియజేయాల్సిన తరుణమని ప్రధాని మోడీ అన్నారు.

## అణు రహస్యాలు అరచేతిలోకి

>> జ్యూరీ పేర్కొంది. చేతుల వలె, అన్ని అమైనో ఆమ్లాలు రెండు దర్పణప్రతిబింబ రకాలుగా ఉంటాయి, కానీ వాటిలో ఒకటి మాత్రమే శరీర కణాలలోని ప్రోటీన్లలో కనిపిస్తుంది. రెండవది ప్రకృతిలో చాలా అరుదుగా కనిపిస్తుంది, ఈ దృగ్విషయాన్ని "హోమోకిరాలిటీ" అని పిలుస్తారని రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ వివరించింది. ఆ ప్రక్రియ ఎలా జరుగుతుందో రసాయన శాస్త్రవేత్తలు చాలా కాలంగా ఆలోచిస్తున్నారు, ఈ ఇద్దరు నోబెల్ గ్రహీతల ఆవిష్కరణలు "హోమోచిరాలిటీకి దారితీసే రసాయన చర్యలను నడిపించడానికి రసాయన శాస్త్రవేత్తలకు వీలు కల్పించాయి" అని జ్యూరీ పేర్కొంది. "శతాబ్దానికి పైగా ఉన్న ఒక రసాయన రహస్యానికి హెన్రీ కాగన్, కెన్సో సోయ్ ఒక పరిష్కారాన్ని అందించారు. హోమోచిరాలిటీ దానంతట అదే ఎలా ఆవిర్భవిస్తుంది. వారు అభివృద్ధి చేసిన రసాయన చర్యలు అద్భుతమైనవి" అని రసాయన శాస్త్ర నోబెల్ కమిటీ ఛైర్మన్ హైనర్ లింకే అన్నారు. "ఔషధాల తయారీ కోసం చర్యలను రూపొందించే రసాయన శాస్త్రవేత్తలకు వారి ఆవిష్కరణలు నిర్ణయాత్మకమైనవి" అని జ్యూరీ పేర్కొంది.

## కరవు మండలాలు 320

>> పెంచుతారు. ప్రాథమిక అంచనాల ప్రకారం 320 మండలాల్లో తీవ్ర కరవు పరిస్థితులు నెలకొని ఉన్నాయని, సెప్టెంబర్‌లో అక్కడ తాగునీటి సంక్షోభం మరింత తీవ్రమవుతుందని తేలింది. రాష్ట్ర ప్రణాళిక, రెవెన్యూ, భూగర్భ జలం, వ్యవసాయం, పంచాయతీ రాజ్ మరియు గ్రామీణ నీటి సరఫరా శాఖలు ప్రతి మండలంలో స్థానిక పరిస్థితులకు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేస్తాయి. తాజాగా జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో, కరవు నివేదిక తయారీ సమయంలో కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన 12 ప్రామాణిక పారామితులను పరిగణనలోకి తీసుకోవాలని ప్రధాన కార్యదర్శి సంజయ్ జజు అధికారులను ఆదేశించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కరవు సహాయం కోసం కేంద్ర ప్రభుత్వ సహాయం కోరడానికి ఈ నివేదిక కీలకం. మండలాలను కరవు పీడిత ప్రాంతాలుగా ప్రకటించడానికి నైరుతి రుతుపవన కాలంలో (జూన్ నుండి సెప్టెంబర్ వరకు) నమోదైన వర్షపాతం మొదటి ప్రధాన అంశం. ఎల్ నినో ప్రభావంపై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం నేపథ్యంలో, ఆ సమావేశానికి అవసరమైన అన్ని వివరాలతో కూడిన సమగ్ర నివేదికను సిద్ధం చేయాలని ప్రధాన కార్యదర్శి అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి వచ్చే వారం కరవు పరిస్థితులు, సహాయక చర్యలపై రెవెన్యూ అధికారులతో సమావేశం కానున్నారు.

## 5 ఎకరాల వరి చేను బూడిద

>> గత కొన్ని వారాలుగా నెలకొన్న తీవ్రమైన నీటి కొరత కారణంగా, పంట చివరి దశకు చేరుకుంటున్న తరుణంలో వేగంగా వాడిపోయింది. రాములు ప్రకారం, పూర్తి పంట దిగుబడి రావడానికి పంటకు మరో రెండు దఫాలుగా నీరు పెట్టడం (తడులు) మాత్రమే అవసరం ఉన్నా ఎన్ని ప్రయత్నాలు చేసినా అందలేదు. 'పంటకు మరో రెండు దఫాలుగా నీరు అంది ఉంటే, అది కోతకు సిద్ధంగా ఉండేదని, అయితే నీరు లేక ఎండిపోయి నెలల తరబడి పడిన శ్రమ నా కళ్ల ముందే వృధా అవ్వడం భరించలేకపోయాను' అని అతను తీవ్ర ఆవేదన చెందారు. చివరకు నష్టాన్ని జీర్ణించుకోలేక, రాములు స్వయంగా ఎండిపోయిన పంటకు నిప్పు పెట్టాడు. తన పొలాలకు నీళ్లు పెట్టడానికి నీటి కొరతను ఎదుర్కొంటున్నది కేవలం రాములు కథ మాత్రమే కాదు. తక్కువ వర్షపాతం, ఎల్ నినో పరిస్థితులు, వేగంగా తగ్గిపోతున్న జలాశయాలు, భూగర్భ జలమట్టాల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా రైతులు ఇదే నీటి సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు.

## విద్యుత్ భారంపై ప్రజాపోరాటం

>> ముందు వస్తారు? ఎందుకు రోడ్లపై ధర్నాలు చేస్తారు? అని ప్రశ్నించారు. భారత ప్రభుత్వ బొగ్గు మంత్రిత్వ శాఖ 15.02.2018 నాటి ఎఫ్.నెం. 23014/1/2018సిఎల్‌డి ప్రకారం, ఎస్సీసీఎల్ గనుల నుండి 14 ఎంటిపిఏ జి-9 గ్రేడ్ బొగ్గును యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌కు కేటాయించింది. మరి కేటాయింపు లేదు అని ఉప ముఖ్యమంత్రి స్థాయిలో ఉండి ఎందుకు సత్య దూరపు మాటలు మాట్లాడారు? అని ప్రశ్నించారు. ఎల్ నినో సాకు చెబుతూ యాదాద్రిలో 3000 మెగావాట్లు, భద్రాద్రిలో 540 మెగావాట్లు, కేటిపిఎస్‌లో 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ఆగిన మాట నిజం కాదా? ఇది మీ పరిపాలన వైఫల్యం కాకుంటే మరేమిటి? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో మొత్తంగా 140 మిలియన్ యూనిట్ల కెపాసిటీ ఉంటే 89 మిలియన్ యూనిట్లు మాత్రమే ఉత్పత్తి చేస్తున్నట్లు మీరే చెప్పారు కదా. ఇది మీ వైల్యం కాదా? అని ప్రశ్నించారు. బొగ్గు ఉన్న దగ్గరే విద్యుత్ ప్లాంట్ ఉండాలె అని చెబుతున్న మీరు, నాటి కాంగ్రెస్ ప్రభుత్వం రాయలసీమలో నీళ్ళు, బొగ్గు లేని చోట థర్మల్ ప్లాంట్ పెట్టింది నిజం కాదా? ఆనాడు ఎందుకు మౌనంగా ఉన్నారు? అని ప్రశ్నించారు. సింగరేణిలో సైట్ విజిట్ సర్టిఫెట్ అనే నిబంధన పెట్టి అధిక ధరలకు టెండర్లు కట్టబెట్టి, అనుయాయులు లబ్ధి చేకూర్చింది మీ ప్రభుత్వం కాదా?అని ప్రశ్నించారు. ఇప్పటికీ ఆ టెండర్లు రద్దు చేయనిది, విచారణ జరపంది నిజం కాదా? అని ప్రశ్నించారు. మన రాష్ట్ర విద్యుత్ అవసరాలు పక్కన పెట్టి, సింగరేణి నిర్మిస్తున్న 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్‌ను రాజస్తాన్ రాష్ట్రానికి ఇవ్వాలని మీరు ఒప్పందం చేసుకున్నది స్వయంగా మీరు కాదా? ఇది రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బ తీసే నిర్ణయం కాక మరేమిటి? అని ప్రశ్నించారు.

## 2 డిఏలు మంజూరు

>> పెరుగుదల ఉండనుంది. పెంచిన డీఏను 2026 అక్టోబర్ నెల వేతనంతో కలిపి చెల్లించనున్నారు. అంటే నవంబర్ 1వ తేదీన ఉద్యోగుల ఖాతాల్లో పెరిగిన డీఏతో కూడిన జీతం జమ కానుంది. ఈ నిర్ణయం వల్ల రాష్ట్ర ప్రభుత్వంపై ఏటా సుమారు రూ.2,500 కోట్ల అదనపు ఆర్థిక భారం పడుతుందని రేవంత్ రెడ్డి ప్రభుత్వం అంచనా వేసింది. రివైజ్డ్ పే స్కేల్2020 కింద పనిచేస్తున్న ఉద్యోగులకు 2024 జనవరి నుంచి డీఏను 33.67 శాతం నుంచి 37.31 శాతానికి పెంచారు. అలాగే 2024 జూలై నుంచి డీఏను 37.31 శాతం నుంచి 40.04 శాతానికి పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 2015 పే స్కేల్ ఉద్యోగులకు కూడా రెండు దశల్లో డీఏ పెంపు వర్తిస్తుంది. 2024 జనవరి నుంచి డీఏను 73.344 శాతం నుంచి 78.06 శాతానికి.. 2024 జూలై నుంచి 78.06 శాతం నుంచి 81.728 శాతానికి పెంచారు. అదేవిధంగా యూజీసీ, ఏఐసీటీఈ పే స్కేల్ 2016 ఉద్యోగులకు డీఏను 46 శాతం నుంచి 50 శాతానికి.. ఆ తర్వాత 2024 జూలై నుంచి 53 శాతానికి పెంచారు. యూజీసీ, ఏఐసీటీఈ పే స్కేల్2006 ఉద్యోగులకు డీఏ 230 శాతం నుంచి 239 శాతానికి.. 2024 జూలై నుంచి 246 శాతానికి పెంచుతూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. కాగా, పెంచిన డీఏను అక్టోబర్ 2026 జీతంతో కలిపి ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించనుంది. 2024 జనవరి నుంచి 2026 సెప్టెంబర్ వరకు ఉన్న డీఏ బకాయిలను 33 వాయిదాల్లో చెల్లించనున్నట్లు తాజా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అదే విధంగా 2024 జూలై నుంచి 2026 సెప్టెంబర్ వరకు ఉన్న రెండో డీఏ బకాయిలను 27 వాయిదాల్లో చెల్లించనున్నారు. ఈ బకాయిలను ఉద్యోగుల జీపీఎఫ్ ఖాతాల్లో జమ చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. సీపీఎస్ పరిధిలోని ఉద్యోగులకు కూడా వాయిదాల పద్ధతిలో బకాయిల చెల్లింపు చేపట్టనున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో పాటు పెన్షనర్లకు కూడా ఈ నిర్ణయం ద్వారా ప్రయోజనం కలగనుంది. ఉద్యోగులకు డీఏ, పెన్షనర్లకు డియర్‌నెస్ రిలీఫ్ (డీఆర్) మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఉద్యోగ సంఘాలతో జరిగిన చర్చల్లో ఇచ్చిన హామీ మేరకు రెండు డీఏలను విడుదల చేసినట్లు ప్రభుత్వం తెలిపింది. ఇక పార్ట్‌టైమ్ అసిస్టెంట్లు, గ్రామ రెవెన్యూ అసిస్టెంట్లకు కూడా ప్రభుత్వం ఊరటనిచ్చింది. వారికి నెలకు అదనంగా రూ.100 చొప్పున పెంచుతున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది.

### వారం - వర్జ్యం

**08-10-2026, గురువారం,**
**శ్రీ పరాభవ నామ సంవత్సరం,**
**భాద్రపద మాసం, దక్షిణాయణం,**
**వర్ష ఋతువు, కృష్ణపక్షం, హస్త కార్తె,**
తి.త్రయోదశి రా.10.18,
న. పూర్వఫల్గుణి రా .9.22,
వ.తె 4.35 -ఉ.6.10,
దు.ఉ.9.56-ఉ.10.44, 2)మ.2.41- మ.3.29,
రాహు.మ.1.30- మ.3.00,
శుభ. స.ఉ.8.00-ఉ.9.00.

### వార్తాఫలం

**మేషం :** ప్రతి విషయాన్ని సూక్ష్మదృష్టితో పరిశీలిస్తారు. విజ్ఞానపరమైన ఆలోచనలు చోటు చేసుకుంటాయి.

**వృషభం :** మీ పై ప్రచారంలో ఉన్న అపవాదులను రూపుమాపుకునే ప్రయత్నాలకు గాను శ్రీకారం చుడతారు.

**మిథునం :** జీవిత భాగస్వామితో స్వల్పమైన వాగ్వివాదాలు చోటు చేసుకుంటాయి. తగినంత ధనాన్ని సమకూర్చుకోగలుగుతారు.

**కర్కాటకం :** నూతన వ్యక్తితో పరచయం మిత్రత్వానికి దారి తీస్తుంది. ఉద్యోగ యత్నాలు నత్తనడక సాగుతాయి.

**సింహం :** మీపై పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్న వారిని గుర్తించి వారికి దూరంగా ఉంటారు.

**కన్య :** సెల్ఫ్ డ్రైవింగ్ విషయంలో జాగ్రత్తలు. ఎదుటి వారికి మీరు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటారు. ఋణాలు లభిస్తుంది.

**తుల :** మీ హోదాను పెంచే విధంగా సంతానం అభివృద్ధిపథంలో పయనిస్తారు. ఋణాలు తీరి ఊరట చెందుతారు.

**వృశ్చికం:** ప్రజా సంబంధాలు వృద్ధి చేసుకోవడానికి ప్రాముఖ్యతనిస్తారు. ఇందుకు గాను ధనాన్ని అధిక మొత్తంలో ఖర్చు చేస్తారు.

**ధనుస్సు :** మీ మిత్రవర్గంలోని ఒకరితో అభిప్రాయ భేదాలు చోటు చేసుకుంటాయి. సంఘంలో విశేష ఆదరణ లభిస్తుంది.

**మకరం:** స్థిరాస్తి కొనుగోలు సానుకూల పడుతుంది. సాంప్రదాయాలకు విలువనిచ్చి ఆధునిక పోకడలకు దూరంగా ఉంటారు.

**కుంభం :** ఋణాలకు సంబంధించిన విషయాలు పరిష్కార దశకు చేరుకుంటాయి. ఇతరుల మాటను లెక్క పెట్టరు.

**మీనం :** అధికారుల వలన ఇబ్బందులు ఏర్పడే సూచనలున్నాయి. వివాహ యత్నాలు ఫలిస్తాయి.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఢిల్లీలో హోరాహోరీ

>> చూడకుండా పోలీసులు అమానుషంగా వ్యవహరించారని నేతలు ఆరోపించారు. ఒకదశలో ప్రియాంక గాంధీ తోటి మహిళా నేతలు,ఎంపిలతో కలిసి రోడ్డుపైనే పడుకుని తన నిరసన ప్రకటించారు. సోదరికి తోడుగా రాహుల్ గాంధీసైతం అక్కడే నిలుచుండిపోయారు. అయితే ఉద్రిక్తతలు మరింతపెరగడంతో పోలీసులు లాఠీఛార్జిచేసి అక్కడినుంచి పంపించే యత్నంచేసారు. మరికొందరిని బలవంతంగా బస్సుల్లోకి ఎక్కించి అక్కడి నుంచి తరలించారు. ఈ క్రమంలో నిరసనకారులు ఒక బస్సు టైర్‌ను పంక్చర్ చేసినట్లు పోలీసులు తెలిపారు.ఖమ్మం ఎంపి రఘురామిరెడ్డి, రేణుకాచౌదరి మరికొందరు విపక్ష ఎంపిలకు లాఠీఛార్జి కారణంగా గాయాలయ్యాయి. నిరసనను నియంత్రించేందుకు రాహుల్ గాంధీని మరో బస్సులోకి మార్చి బారాఖంబా రోడ్‌లోని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కొన్ని గంటల తర్వాత ఆయనను విడుదల చేశారు. ముందురోజు కూడా రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ సహా పలువురు ప్రతిపక్ష ఎంపీలు అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. ఎన్నికల సంఘం కార్యాలయానికి వెళ్లేందుకు అనుమతి నిరాకరించడంతో వారు ఆకాశవాణి భవన్ వద్ద అనూహ్యంగా బైఠాయించి నిరసన చేపట్టారు.బుధవారం మాత్రం నిరసనకు అధికారికంగా కేటాయించిన జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేపట్టేందుకు ఇండియా కూటమి నేతలు ప్రయత్నించారు. అయితే ముందస్తు అనుమతి తీసుకోలేదని పేర్కొంటూ ఢిల్లీ పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఢిల్లీలోని ఓ రెస్టారెంట్‌లో వ్యూహాత్మక భేటీ అనంతరం ఎంపీలు జంతర్ మంతర్‌కు బయలుదేరారు. అయితే మార్గమధ్యలోనే పోలీసులు వారి వాహనాలను నిలిపివేశారు. మొదట రాహుల్ గాంధీ సహా పలువురు నేతలను బస్సులో కూర్చోబెట్టారు. అనంతరం ఇతర నాయకులను అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు ప్రయత్నించగా, ఇండియాకూటమి నేతలు బస్సుల నుంచి దిగి రోడ్డుపై తిరిగి బైఠాయించారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ రోడ్డుపైనే కూర్చొని, అక్కడి నుంచి వెళ్లాలన్న పోలీసుల విజ్ఞప్తిని తిరస్కరించారు. ప్రియాంక గాంధీ రోడ్డుపై పడుకుని తనను ఎవరు తరలిస్తారో



బుధవారం న్యూఢిల్లీలో రాహుల్‌ను వ్యానులో తరలిస్తున్న పోలీసులు

చూద్దామన్నట్లుగా వ్యవహరించారు.
ఎంపీలతో ఇలావ్యవహరిస్తారా? ఇది ఎన్నడూ జరగని విషయం. మేము ఇక్కడి నుంచి కదలబోమని ప్రియాంక గాంధీ వ్యాఖ్యానించారు. చివరకు పోలీసులు రాహుల్, ప్రియాంక గాంధీలను బలవంతంగా అక్కడి నుంచి తరలించి బస్సులోకి ఎక్కించారు. తదుపరి కార్యాచరణపై చర్చించేందుకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆహ్వానం మేరకుఇండియాకూటమి నేతలు ఢిల్లీలోని జన్‌పథ్‌లో ఉన్న సాగర్ రత్న రెస్టారెంట్‌లో సమావేశమయ్యారు. ఓటు చోరీ" అంశంపై పోరాటాన్ని మరింత ఉధృతం చేయడం, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలన్న డిమాండ్‌ను ముందుకు తీసుకెళ్లడంపై సమావేశంలో చర్చించారు. దేశంలో ప్రజాస్వామ్యం ధ్వంసమవుతోందని ఆరోపించిన ఖర్గే ఓటు చోరీ అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తామని చెప్పారు. మధ్యాహ్న భోజనం అనంతరం ఎంపీలు బస్సుల్లో జంతర్ మంతర్‌కు బయలుదేరారు. అయితే జంతర్ మంతర్‌కు వెళ్లే అన్ని మార్గాల్లో పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. ప్రతిపక్ష ఎంపీలను తీసుకెళ్తున్న బస్సులను మార్గమధ్యంలోనే పోలీసులు అడ్డుకున్నారు. జంతర్ మంతర్‌లో ఎలాంటి నిరసన చేపట్టాలన్నా ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఢిల్లీ పోలీసులు తెలిపారు. ప్రతిపాదిత కార్యక్రమానికి కనీసం 10 రోజుల ముందు న్యూఢిల్లీ జిల్లా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్‌కు అనుమతి కోసం దరఖాస్తు చేయాల్సి ఉంటుందని వెల్లడించారు. భోజనం అనంతరం రాహుల్ గాంధీ మాట్లాడుతూ ప్రతిపక్ష ఎంపీలు జంతర్ మంతర్‌లో నిరసన చేపడతారని తెలిపారు. ముందురోజు తాను చెప్పినట్లుగానే సుమారు 300 మంది ఎంపీలు ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను కలవాలనుకున్నారు. కానీ అక్కడ నిరసన చేపట్టేందుకు అనుమతి లేదని చెప్పారు. అందుకే ఈరోజు కేటాయించిన నిరసన స్థలం జంతర్ మంతర్‌కు వెళ్లి మరోసారి అందరం కలిసి కూర్చుంటాం. దేశానికి ఒక విషయం చెబుతాం. మా దృష్టిలో జ్ఞానేశ్ కుమార్ దేశానికి చట్టబద్ధమైన ఎన్నికల కమిషనర్ కాదు" అని రాహుల్ గాంధీ అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్, జ్ఞానేశ్ కుమార్ కలిసి దేశ ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేశారని ఆయన ఆరోపించారు. మంగళవారం చేపట్టిన ధర్నాపై తనపై నమోదైన ఎఫ్‌ఐఆర్‌ను ప్రస్తావిస్తూ రాహుల్ గాంధీ వ్యంగ్యంగా స్పందించారు. నాపై 45 ఎఫ్‌ఐఆర్‌లు ఉన్నాయి. నా లక్ష్యం 100. నాపై మరో 100 ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేయండని ఆయన అన్నారు. మంగళవారం అనుమతి లేకుండా ఆకాశవాణి భవన్‌లోకి ప్రవేశించి సుమారు ఆరు గంటల పాటు నిరసన చేపట్టినందుకు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలపై బుధవారం కేసులు నమోదు చేశారు.
గాంధీపై నమోదైన ఎఫ్‌ఐఆర్‌ల గురించి మేము పట్టించుకోము. దేశవ్యాప్తంగా ఇలాంటి వందలాది కేసులు నమోదయ్యాయని కాంగ్రెస్ సంస్థాగత ప్రధాన కార్యదర్శి కె.సి. వేణుగోపాల్ అన్నారు. కాంగ్రెస్ ఎంపీ జోతిమణి మాట్లాడుతూ మేము ఇక్కడ భోజనం కోసం వచ్చాం. నిరసనలు కొనసాగుతాయి. లోక్‌సభ ప్రతిపక్ష నేతను నేరస్థుడిలా ఈడ్చుకెళ్లడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఎఫ్‌ఐఆర్‌లకు మేము భయపడబోమని అన్నారు.

## వుయ్ విల్ డూ ఇట్..

>> ఆత్మనిర్భర భారత్‌గా మార్చడమే మన ప్రధాన లక్ష్యమని, దీనిని మనం సాధించి తీరుతామని ప్రధాని మోడీ ఎంతో నమ్మకంతో పునరుద్ఘాటించారు. మనం చేసి తీరుతాం. వుయ్‌విల్ డూ ఇట్ అని ఆయన పిలుపునివ్వగా, సభలో పాల్గొన్న ప్రజలంతా అంతే ఉత్సాహంతో ఆ నినాదాన్ని అందుకున్నారు. వికసిత భారత్ సంకల్ప సభలో మాట్లాడిన ప్రధాని మోడీ, తన ప్రయాణాన్ని గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. 2001 అక్టోబర్ 7న తొలిసారిగా గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినప్పుడు, ఒక ప్రభుత్వ అధినేతగా వరుసగా 25 ఏళ్లు సేవ చేసే అవకాశం వస్తుందని తాను ఏనాడూ ఊహించలేదని అన్నారు. ఈ మైలురాయిని చేరుకోవడానికి ప్రజల నిరంతర ఆశీస్సులే కారణమని, ఆ క్రెడిట్ అంతా ప్రజలకే దక్కుతుందని వినమ్రంగా చెప్పారు. తన ఈ పాతికేళ్ల ప్రయాణంలో ఎదురైన ప్రతీ అనుభవం నుంచి ఎంతో నేర్చుకున్నానని మోడీ తెలిపారు. జీవితంలో జరిగిన ఏ సంఘటనా వృథా పోలేదని, విజయం వచ్చినప్పుడు అది తనను వినమ్రంగా ఉండటం నేర్పితే, వైఫల్యాలు లేదా పతనాలు మళ్లీ ఎలా గెలిచి నిలబడాలో నేర్పాయని పేర్కొన్నారు. అలాగే శుభాకాంక్షలు తెలిపిన శ్రేయోభిలాషులు తనలో ఉత్సాహాన్ని నింపితే, విమర్శకులు తనను తాను సమీక్షించుకునేలా చేశారన్నారు. ప్రతీ సంక్షోభం తన ఓర్పుకు పరీక్షగా నిలిచిందని, లభించిన ప్రతీ విజయం బాధ్యతను పెంచుతూ, అంతకంటే పెద్ద లక్ష్యాల వైపు అడుగులు వేసే ధైర్యాన్ని ఇచ్చిందని వెల్లడించారు. గడిచిన 25 ఏళ్లలో ఎన్నో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు వచ్చాయని, అన్నింట్లోనూ ప్రజలు తనపై నమ్మకంతో నిరంతరం సేవ చేసే అవకాశాన్ని ఇచ్చారని ప్రధాని మోడీ గుర్తుచేసుకున్నారు. బీజేపీ, ఎన్డీయే కూటమి నాయకులకు, సహచర మంత్రులకు, ప్రజాస్వామ్యాన్ని విశ్వసించే రాజకీయ భాగస్వాములందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాస్వామ్యానికి, దేశ రాజ్యాంగానికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నానన్నారు. ఈ సందర్భంగా సేవా జ్యోతి యాత్రలో పాల్గొన్న ప్రతి ఒక్కరినీ అభినందిస్తూ, ప్రజల అపారమైన నమ్మకం వల్లే ఈ సుదీర్ఘ ప్రయాణం సాధ్యమైందని చెప్పారు.అంతకుముందు రోజు ఉదయమే తాను ఢిల్లీలోని శ్రీ వినాయక ఆలయానికి వెళ్లినట్లు ప్రధాని తెలిపారు. అక్కడ 140 కోట్లకు పైగా ఉన్న భారతీయ ప్రజలందరి సంక్షేమం కోసం ప్రార్థించానని, దేవుడిని ఒక్కటే కోరుకున్నానని చెప్పారు. మరింత శక్తితో, రెట్టింపు ఉత్సాహంతో దేశం కోసం పనిచేసే సామర్థ్యాన్ని, రేయింబవళ్లు ప్రజలకు సేవ చేసే భాగ్యాన్ని ప్రసాదించమని వేడుకున్నట్లు తెలిపారు. ఈ 25 ఏళ్ల ప్రయాణం తనకు ఎంతో సంతృప్తిని, కృతజ్ఞతా భావాన్ని ఇచ్చిందని, అయితే తన దృష్టి ఎప్పుడూ భవిష్యత్తుపైనే ఉందని స్పష్టం చేశారు. భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా, స్వయం సమృద్ధి కలిగిన దేశంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని, ఆ లక్ష్య సాధన కోసం వియ్‌విల్‌డూ ఇట్ అనే దృఢ సంకల్పంతో ముందడుగు వేద్దామని పిలుపునిచ్చారు.

## జ్ఞానేశ్ రాజీనామా దాకా పోరాడుతాం

>> అదుపులోకి తీసుకోవడంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ చర్యలను అప్రజాస్వామికమని ఆయన మండిపడ్డారు. కేంద్ర ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ తన పదవికి రాజీనామా చేసే వరకు తమ పోరాటం ఆగదని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. బుధవారం ఢిల్లీలో నిర్వహించిన నిరసన ప్రదర్శనలో రాహుల్ గాంధీ,ప్రియాంకగాంధీలను నిర్బంధించిన అనంతరం, వారిని పరామర్శించేందుకు సాయంత్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేరళ ముఖ్యమంత్రి వీడీ సతీశన్‌తో కలిసి పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. అయితే, వారిని పోలీసులు లోపలికి వెళ్లకుండా అడ్డుకోవడంతో పోలీసుల తీరుపై రేవంత్ రెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. శాంతియుతంగా నిరసన తెలిపే ప్రాథమిక హక్కును కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వం నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. ఎన్నికల కమిషన్ (ఈసీ) ఎస్సీ, ఎస్టీ, ఆదివాసీ, మైనారిటీ వర్గాల ఓటు హక్కును లక్ష్యంగా చేసుకుని వివక్షా పూరితంగా వ్యవహరిస్తోందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. సర్ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలి, ప్రజల ఓటు హక్కును ఈసీ హరిస్తోందని పేర్కొన్నారు. "గతంలో ఈడీ, సీబీఐ వంటి దర్యాప్తు సంస్థలను అడ్డం పెట్టుకుని ఎన్నికల్లో లబ్ధి పొందిన వారు, ఇప్పుడు ఏకంగా ఎన్నికల కమిషన్‌నే పావుగా వాడుకుంటున్నారు"అని ఆయన ధ్వజమెత్తారు.అక్రమ అరెస్టులు, పోలీసుల నిర్బంధాలకు విపక్షాలు భయపడవని రేవంత్ రెడ్డి తేల్చిచెప్పారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని, పౌరుల ఓటు హక్కును కాపాడేందుకు రాహుల్ నాయకత్వంలో తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని ఆయన పునరుద్ఘాటించారు.

## హైదరాబాద్‌లో అమెరికా వర్సిటీ క్యాంపస్

>> ఇంజినీరింగ్, అనలిటిక్స్ విభాగాలకు ప్రాధాన్యం ఇవ్వనుంది. కేవలం తరగతి గది బోధనకే పరిమితం కాకుండా ప్రాక్టికల్ లెర్నింగ్, కంపెనీలతో అనుసంధానం, ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలపై దృష్టి పెట్టనున్నట్లు యూనివర్సిటీ తెలిపింది. హైదరాబాద్ క్యాంపస్‌లో ప్రారంభంలో అందించే కోర్సుల జాబితా ఇదే తుది జాబితా కాదని సీయూ డెన్వర్ స్పష్టం చేసింది. క్యాంపస్ కార్యకలాపాలు ప్రారంభమైన రెండో సంవత్సరం నుంచి మరిన్ని ప్రోగ్రామ్‌లను యూజీసీ అనుమతి కోసం ప్రతిపాదించనున్నట్లు వెల్లడించింది. ఈ క్యాంపస్‌లో చదివే విద్యార్థులకు డెన్వర్‌లోని మెయిన్ క్యాంపస్‌తో విద్యాపరమైన సంబంధాలు కొనసాగేలా కూడా ఏర్పాట్లు చేయనున్నారు. అంతర్జాతీయ స్థాయి విద్యతో పాటు స్థానిక పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు సీయూ డెన్వర్ యూనివర్సిటీ పేర్కొంది.హైదరాబాద్‌లో క్యాంపస్ ఏర్పాటుపై సీయూ డెన్వర్ ఛాన్సలర్ కెన్నెత్ టీ. క్రిస్టెన్సన్ స్పందించారు. భారతీయ విద్యార్థులతో తమ యూనివర్సిటీకి దశాబ్దాలుగా అనుబంధం ఉందని తెలిపారు. భారత్‌లోనే విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్య, కెరీర్‌కు ఉపయోగపడే నైపుణ్యాలు అందించే అవకాశం ఇప్పుడు లభించిందని పేర్కొన్నారు. అప్లైడ్ లెర్నింగ్, ఇంటర్‌డిసిప్లినరీ ఎడ్యుకేషన్, కెరీర్ రెడీనెస్‌కు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు యూనివర్సిటీ వెల్లడించింది. విద్యార్థులు నేర్చుకున్న అంశాలను వాస్తవ జీవిత సమస్యలకు అన్వయించేలా విద్యా విధానాన్ని రూపొందించనుంది. భారత్‌లో హైదరాబాద్ క్యాంపస్ ఏర్పాటుకు గ్లోబల్ ఎడ్యుకేషన్ కంపెనీ ఎమెరిటస్ వ్యూహాత్మక జాయింట్ వెంచర్ భాగస్వామిగా వ్యవహరించనుంది. క్యాంపస్ ఏర్పాటుతో పాటు ముఖ్యంగా నాన్ అకడమిక్ కార్యకలాపాల్లో సీయూ డెన్వర్ యూనివర్సిటీకి ఎమెరిటస్ సహకరించనుంది. వేగంగా మారుతున్న ఉద్యోగ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా అప్లైడ్ లెర్నింగ్, ఇంటర్‌డిసిప్లినరీ ఎడ్యుకేషన్, కెరీర్ రెడీనెస్‌పై సీయూ డెన్వర్ దృష్టి పెట్టడం విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందని ఎమెరిటస్ కో ఫౌండర్, సీఈఓ అశ్విన్ దామెరా పేర్కొన్నారు. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ 2020 లక్ష్యాలకు అనుగుణంగా హైదరాబాద్‌లో క్యాంపస్ ప్రణాళిక ఉంటుందని సీయూ డెన్వర్ స్పష్టం చేసింది. మల్టీడిసిప్లినరీ విద్య, అంతర్జాతీయీకరణ, విద్యార్థుల అభ్యసన ఫలితాలు, ఉపాధి అవకాశాలకు అవసరమైన నైపుణ్యాలపై పాలసీ దృష్టికి అనుగుణంగా క్యాంపస్‌ను అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొంది. సీయూ డెన్వర్ 1973లో ఏర్పాటైంది. ప్రస్తుతం సుమారు 14 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా 100కు పైగా దేశాల్లో లక్ష మందికి పైగా పూర్వ విద్యార్థుల నెట్‌వర్క్ ఉన్నట్లు యూనివర్సిటీ చెబుతోంది. అధిక స్థాయి పరిశోధన కార్యకలాపాలు నిర్వహించే ఆర్1 పరిశోధనా సంస్థగా కూడా ఇది గుర్తింపు పొందింది. హైదరాబాద్‌లో ప్రతిపాదిత క్యాంపస్‌కు సంబంధించిన మిగిలిన ప్రక్రియలు పూర్తయిన తర్వాత అడ్మిషన్లపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే వచ్చే ఏడాది ఆగస్టులో హైదరాబాద్‌లో తొలి బ్యాచ్ విద్యార్థులతో అమెరికా పబ్లిక్ యూనివర్సిటీ విద్యా ప్రస్థానం ప్రారంభం కానుంది.

## ఇప్పటి వరకు 71,23,526 మంది ఓటర్లు తుది జాబితాలో చేరిక

**హైదరాబాద్,అక్టోబరు7,ప్రభాతవార్త:** తెలంగాణలో సర్ ప్రక్రియ పూర్తి కావొస్తుంది. నోటీసులు అందుకున్న వారిలో 76శాతం ఓటర్లు తుది జాబితాకు అర్హత పొందినట్లు ఈసీ ప్రకటించింది. మొత్తం 92,88,180 మందికి నోటీసులను సిద్దం చేయగా, బుధవారం సాయంత్రం వరకు 91,92,625 మందికి నోటీసులు ఇచ్చామని,ఇందులో 71,23,526 మంది హియరింగ్ హాజరై ధృవపత్రాలు సమర్పించడం ద్వారా తుది జాబితాకు అర్హత సాధించారని పేర్కొంది. ఇంకా సుమారు 20లక్షల ఓటర్ల విచారణ పూర్తి కావాల్సి ఉందని,95,555 మంది ఓటర్లకు నోటీసులు అందాల్సి ఉందని తెలిపింది. నవంబర్ 5 వరకు ఈ ప్రక్రియ కొనసాగనుంది.

## విద్యుత్ పై'వేటు' లేదు

>> లింకేజీ అని చెప్పారు. బొగ్గు కేటాయింపు, సరఫరా లేకుండా థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మించడం సరికాదన్నారు. యాదాద్రి ప్లాంట్‌కు ఏడాదికి సుమారు 7 మిలియన్ టన్నుల దిగుమతి బొగ్గును సరఫరా చేసేందుకు ఎంఎస్‌టీసీ అంగీకరించినట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా దిగుమతి బొగ్గును రవాణా చేసేందుకు రైల్వే శాఖకు కూడా లేఖలు రాశారని తెలిపారు. అయితే ఆ ఒప్పందాలు అమలు కాలేదని పేర్కొన్నారు. 2022-23 నాటికి సింగరేణిలో జీ9 గ్రేడ్ బొగ్గు ఉత్పత్తి సామర్థ్యం కేవలం 1.71 మిలియన్ టన్నులు మాత్రమే ఉందని తెలిపారు. అలాంటప్పుడు యాదాద్రి ప్లాంట్‌కు ఏడాదికి 14 మిలియన్ టన్నుల బొగ్గును ఎలా సరఫరా చేస్తారని ప్రశ్నించారు. సింగరేణి బొగ్గుపై ఆధారపడుతున్న కొత్తగూడెం, భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్లతో పాటు ఎన్‌టీపీసీకి కూడా బొగ్గు కేటాయింపులు ఉన్నాయని చెప్పారు. ఈ ప్లాంట్ల అవసరాలకే సరిపడా బొగ్గు లేని పరిస్థితిలో యాదాద్రికి 14 మిలియన్ టన్నులు కేటాయిస్తామని చెప్పడం ఆచరణ సాధ్యం కాదని పేర్కొన్నారు. యాదాద్రికి అవసరమైన బొగ్గునుతో పాటు, కొత్త బ్లాకులను సాధించే విషయంలో గత పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. బొగ్గు బ్లాకులు తగ్గినప్పటికీ సింగరేణి తన వంతుగా చేయాల్సిందంతా చేస్తూ ఉత్పత్తిని పెంచిందని వివరించారు. 2014-15లో 52.66 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి ఉండగా, 2025-26లో 62.07 మిలియన్ టన్నుల ఉత్పత్తి, డిస్పాచ్ సాధించిందని చెప్పారు. బొగ్గు అవసరాలను ముందుగానే అంచనా వేసి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యతను నిర్వర్తించలేదన్నారు. గత పదేళ్లలో సింగరేణికి అందుబాటులో ఉన్న బొగ్గు బ్లాకులను కాపాడుకోవడంలో అప్పటి సర్కార్ విఫలమైందన్నారు. 2014-2024 మధ్య 14 బొగ్గు బ్లాకులు మూతపడటంతో సుమారు 15 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి తగ్గిపోయిందని వివరించారు.
సింగరేణిలో ఉన్న బొగ్గు బ్లాకుల ఉత్పత్తి సామర్థ్యం, వివిధ విద్యుత్ ప్లాంట్లకు ఉన్న సరఫరాను సమగ్రంగా పరిశీలించకుండా గత పాలకులు యాదాద్రికి భారీ స్థాయిలో హామీలు ఇవ్వడం వల్లే ఇప్పుడు ఇబ్బందులు తలెత్తుతున్నాయని విమర్శించారు. నైనీ బొగ్గుకు ఇప్పటికే ఇతర ప్లాంట్లకు కేటాయింపులు ఉన్నందున మొత్తం బొగ్గును యాదాద్రికి మళ్లించడం సాధ్యం కాదన్నారు. యాదాద్రికి ప్రత్యేకంగా కోల్ అలాట్‌మెంట్ తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు.
యాదాద్రి నుంచి ఉత్పత్తి అయ్యే విద్యుత్ ధర యూనిట్‌కు రూ.6.66గా ఉందని తెలిపారు. అదే కాకతీయ థర్మల్ నుంచి యూనిట్‌కు రూ.4.17, భద్రాద్రి నుంచి సుమారు రూ.4.60-రూ.5.10 పరిధిలో విద్యుత్ లభిస్తోందని చెప్పారు. యాదాద్రి విద్యుత్ ధర ఎక్కువగా ఉండటంతో ఆ భారం వినియోగదారులపై పడుతుందని వెల్లడించారు. యాదాద్రి పవర్ ప్లాంట్‌కు సరిపడా బొగ్గు కేటాయింపులు లేకపోయినా ప్రత్యామ్నాయ మార్గాల్లో బొగ్గును సమీకరిస్తున్నామని తెలిపారు.
వారానికి ఒకసారి డాక్యుమెంటరీ ఆధారాలతో గత ప్రభుత్వ హయాంలో జరిగిన లోపాలు, వాస్తవాలను ప్రజాక్షేత్రంలో పెడతామని స్పష్టం చేశారు. రాష్ట్ర విద్యుత్ వ్యవస్థను బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, రాజకీయ విమర్శల కోసం విద్యుత్ సంస్థలు, సింగరేణి వంటి ప్రభుత్వ రంగ సంస్థలపై ప్రజల్లో అపోహలు సృష్టించడం రాష్ట్ర ప్రయోజనాలకు మంచిది కాదని సూచించారు.

# రాష్ట్రంలో విద్యుత్‌కు అనూహ్య డిమాండ్

## 20 వేల మెగావాట్లకు చేరుకున్న వినియోగం

## ఎనర్జీ ఎక్ఛేంజ్‌లో 5530 యూనిట్లు సేకరణ

## యూనిట్ ధర రూ.3.51 చొప్పున కొనుగోలు

## ఉక్కిరిబిక్కిరి అవుతున్న విద్యుత్ పంపిణీ సంస్థలు



**హైదరాబాద్, అక్టోబరు 7 ప్రభాతవార్త:** తెలంగాణలో ఇటీవల విద్యుత్ డిమాండ్ అనూహ్యంగా పెరిగి ఆల్ టైమ్ రికార్డులను సృష్టిస్తోంది. దీంతో రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో రైతాంగం రోడెక్కి ఆందోళనలు చేస్తున్నా, సబ్ స్టేషన్లు ముట్టడి వంటి నిరసనలు చేస్తున్నారు. అయినా పంపిణీ సంస్థలు వ్యవసాయ విద్యుత్ సరఫరాలో గంటల తరబడి అనధికారిక కోతలు విధిస్తున్నాయి. అయినా డిమాండ్ పెరుగుతుండటంతో ఇండియన్ ఎనర్జీ ఎక్ఛేంజ్‌లో కొనుగోలు చేయాల్సి వస్తోంది. దీనికి తగినట్లుగా రాష్ట్రంలోని ప్రాజెక్టుల్లో నీటి లభ్యత తగ్గడంతో జల విద్యుత్ ఉత్పత్తి దాదాపు 4,000 మెగావాట్ల మేర పడిపోయింది. ఇదే సమ యంలో రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకు బొగ్గు కొరత ఏర్పడటంతో డిమాండ్‌ను అధిగ మించేందుకు బహిరంగ మార్కెట్ విద్యుత్‌ను కొనుగోలు చేస్తూ ప్రభుత్వం సరఫరాను మేనేజ్ చేస్తోంది. అయితే ఎక్ఛేంజ్‌లో రాష్ట్రాల నుండి వచ్చే డిమాండ్ మేరకు యూనిట్ ధర ఏ రోజుకారోజు మారుతుంటుంది. రాష్ట్రాల్లో విద్యుత్‌కు డిమాండ్ తగ్గితే, ఎక్ఛేంలో యూనిట్ రేటు తక్కువగా ఉంటుంది. అదే డిమాండ్ ఎక్కువగా ఉన్న సమయాల్లో యూనిట్ రేటు కూడా పెరుగుతుంటోంది. ఫలితంగా రాష్ట్ర విద్యుత్ సంస్థలపై భారం పెరుగుతోంది. రాష్ట్రంలో బుధవారం 18282 మెగావాట్ల డిమాండ్ ఏర్పడగా, విద్యుత్ ఎక్ఛేంజ్‌లో 5530 మెగావాట్ల మేర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలు కొనుగోలు చేశాయి. ఇందుకు గాను యూనిట్‌కు రూ.3.51 చొప్పున కొనుగోలు చేశాయి. అదే ఈ నెల 6వ తేదీన 10131 మెగావాట్ల డిమాండ్‌కు గాను రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే విద్యుత్‌కు అదనంగా ఎక్ఛేంజ్‌లో 4567 మెగావాట్ల మేర కొనుగోలు చేసింది. ఇందుకు గాను యూనిట్‌కు రూ.2.74 చొప్పున రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు చెల్లించాయి. మరోపక్క సాధారణంగా వేసవి కాలంలో ఉండే స్థాయిలో ప్రస్తుతం విద్యుత్ వినియోగం జరుగుతోంది. గత నెలాఖరు 30న రాష్ట్ర చరిత్రలోనే అత్యధికంగా 19892 మెగావాట్ల పీక్ డిమాండ్ నమోదై సరికొత్త రికార్డు సృష్టించింది. గతంలో 15000 మెగావాట్లుగా ఉన్న గరిష్ట డిమాండ్, ప్రస్తుతం ఏకంగా 20000 మెగావాట్లకు చేరువైంది. సెప్టెంబర్ 30 నాటి వినియోగం 327.56 మిలియన్ యూనిట్లను తాకింది. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలోని హైదరాబాద్, పరిసర జిల్లాల్లో గత నెల 29న రికార్డు స్థాయిలో 12044 మెగావాట్ల డిమాండ్ నమోదైంది. జీహెచ్ఎంసీ పరిధిలో ఉక్కపోత కారణంగా ఏసీల వాడకం పెరిగి ఈ నెల 1న విద్యుత్ డిమాండ్ మూడేళ్ల గరిష్టమైన 4,114 మెగావాట్లకు చేరింది. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదు. తీవ్రమైన ఉక్కపోత, పొడి వాతావరణం వల్ల గృహ అవసరాలకు కూలింగ్ లోడ్స్ (ఏసీలు, కూలర్లు) వాడకం విపరీతంగా పెరిగింది. అలాగే వ్యవసాయ మోటార్ల వాడకం విపరీతంగా పెరిగింది. వర్షాలు లేకపోవడంతో పంటలను కాపాడుకోవడానికి రైతులు దాదాపు 20 లక్షలకు పైగా ఉన్న వ్యవసాయ బోర్లను నిరంతరం నడుపుతున్నారు. మరోపక్క ఎత్తిపోతల పథకాలు సైతం విద్యుత్‌ను గరిష్ట స్థాయిలో వినియోగిస్తున్నాయి. సాగునీటి ప్రాజెక్టులు, ఎత్తిపోతల (లిఫ్ట్ ఇరిగేషన్) పథకాల మోటార్ల వాడకం నిరుటితో పోలిస్తే 450 మెగావాట్ల నుంచి ఏకంగా 1800 మెగావాట్లకు పెరుగుదల చోటు చేసుకుంది.



జాతీయ ఆర్మ్ రెజ్లింగ్ పోటీల్లో కాంస్య పతకం సాధించిన రాధికను అభినందిస్తున్న డిజిపి ఆనంద్. చిత్రంలో ఐజి డాక్టర్ గజారావు భూపాల్ తదితరులున్నారు

## జాతీయ ఆర్మ్ రెజ్లింగ్ పోటీల్లో మహిళా కానిస్టేబుల్‌కు కాంస్య పతకం

**హైదరాబాద్, అక్టోబరు 7, ప్రభాతవార్త:** హర్యానాలోని కర్నాల్‌లో జరిగిన 75వ అఖిల భారత పోలీసు రెజ్లింగ్ క్లస్టర్ 2026 ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణ పోలీసు క్రీడాకారిణి రాధిక కాంస్య పతకం సాధించారు. గత సెప్టెంబరు నెల 23వ తేదీ నుంచి 27వ తేదీ వరకు జరిగిన ఈ పోటీల్లో మహబూబ్‌నగర్ జిల్లా అడకల్ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ రాధిక 90 ప్లస్ కిలో ఆర్మ్ రెజ్లింగ్ విభాగంలో మూడవ స్థానంలో నిలిచి కాంస్య పతకం అందుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం డిజిపి కార్యాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో రాధికను డిజిపి ఆనంద్ అభినందించారు. భవిష్యత్తులో మరింతగా రాణించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పి అండ్ ఎల్ ఐజి డాక్టర్ గజారావు భూపాల్, క్రీడల విభాగం డిఎస్‌పి రామారావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు రూ.500కోట్ల టోకరా

## ప్రిలాంచ్ పేరుతో బోర్డు తిప్పేసిన త్రిపురా కన్‌స్ట్రక్షన్: సిసిఎస్‌లో బాధితుల ఫిర్యాదు

**హైదరాబాద్, అక్టోబరు 7, ప్రభాతవార్త:** తెలంగాణలో ప్రీలాంచ్ మోసాలు ఆగడం లేదు. సాహితి ఇన్‌ఫ్రా మొదలుకొని పదుల సంఖ్యలో రియ ల్ ఎస్టేట్ కంపెనీలు అమాయకులను నించా ముంచి వేల కోట్ల రూపాయలను దండుకుని బిచాణా ఎత్తేసినట్లుగా త్రిపురా కన్‌స్ట్రక్షన్స్ అనే కం పెనీ బిడిఎల్ ఉద్యోగులను, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లను లక్ష్యం చేసుకుని 500 కోట్ల రూపాయలకు పైగా టోకరా వేసింది. వివరాలు ఇలావున్నాయి. 2021లో సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్‌లో ఏర్పాటైన త్రిపురా కన్‌స్ట్రక్షన్స్ అనే కంపెనీ ఇదే ప్రాంతంలో తక్కువ ధరకు నాణ్యమైన అపార్ట్‌మెంట్ల ను నిర్మించి ఇస్తామని నమ్మించి బిడిఎల్ ఉద్యోగులు, ఐటి ఇంజినీర్ల నుంచి 50 లక్షల రూపాయలు మొదలుకొని కోటి రూపాయల వరకు వ సూలు చేసింది. ముందుగా మొత్తం డబ్బులు ఇచ్చిన వారికి ఆఫర్ కూడా ఇచ్చింది. అయితే ఐదేళ్లయినా ఎలాంటి పనులు ప్రారంభించక పోగా, నిర్మాణాల కోసం వున్న స్థలాన్ని మరొకరికి విక్రయించేందుకు యత్నిస్తుండడంతో బాధితులు నేరుగా హైదరాబాద్ సిసిఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కంపెనీ ఎండి పసుపులేటి సుధాకర్‌తో పాటు అతని అనుచరులు ఈ గోల్‌మాల్‌లో సూత్రధారులుగా బాధితులు చెబుతున్నారు. రెండేళ్లలో అందరికి అపార్ట్‌మెంట్లు నిర్మించి ఇస్తానని నమ్మించిన సుధాకర్ ఇప్పటి వరకు ఎలాంటి నిర్మాణాలు చేబట్టలేదని బాధితులు వాపోతున్నారు. దీనిపై డబ్బులు ఇచ్చిన వారు ఎప్పుడు అడిగినా అదిగో.. ఇదిగో..అంటూ కాలాయాపన చేశాడని, దీనిపై గట్టిగా నిలదీయగా తప్పించుకు తిరుగుతున్నాడని, తాజాగా తమ అపార్ట్‌మెంట్ల కోసం వున్న స్థలాన్ని సుధాకర్ మరో కంపెనీకి అమ్మేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలడంతో పోలీసులను ఆశ్రయించామని బాధితులు తెలిపారు. దీనిపై సిసిఎస్‌లో బుధవారం నాడు బాధితులు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదుపై సిసిఎ స్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేబట్టారు.

# దసరాకు 7,000 ప్రత్యేక బస్సులు

## 30 మంది ఉంటే ఇంటికే వచ్చి పికప్

## రాష్ట్రంలోని వివిధ జోన్ల నుంచి వేల సంఖ్యలో సర్వీసులు ఏర్పాటు

## 9, 10, 16, 17 తేదీల్లో ప్రయాణికుల రద్దీ అధికంగా ఉండే అవకాశం



**హైదరాబాద్,అక్టోబరు7,ప్రభాతవార్త:** దసరా పండుగను పురస్కరించుకుని ప్రయాణికులు తమ స్వగ్రామాలకు చేరుకు నేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ ఆర్టీసీ) భారీ ఏర్పాట్లు చేసింది. పండుగ రద్దీని దృష్టిలో ఉంచుకుని రాష్ట్రవ్యాప్తంగా సుమారు 7,000 ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు బుధవారం ప్రకటించింది. ఈ క్రమంలో కరీంనగర్ జోన్ పరిధిలో అత్యధికంగా 3,533బస్సులు (ఆదిలాబాద్ 431, నిజామాబాద్ 719, కరీంనగర్ 1,175, వరంగల్ 530, ఖమ్మం 678) నడపనున్నారు. హైదరాబాద్ జోన్ నుంచి 2,155 బస్సులు (మహబూబ్‌నగర్ 645, మెదక్ 255, నల్గొండ 815, రంగారెడ్డి 440), గ్రేటర్ హైదరాబాద్ జోన్ నుంచి 1,312 ప్రత్యేక సర్వీసులు అందుబాటులో ఉంటాయి. అక్టోబర్ 9, 10, 16, 17 తేదీల్లో ప్రయాణికుల రద్దీ అధికంగా ఉంటుందని అంచనా వేస్తుండగా, తిరుగు ప్రయాణాల కోసం అక్టోబర్ 25, 26 తేదీల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ ఏడాది ప్రయాణికుల సౌకర్యార్థం టీజీఎస్ఆర్టీసీ ఒక నూతన సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని కాలనీలు, టౌన్‌షిప్‌లు, గేటెడ్ కమ్యూనిటీలు, హాస్టళ్లు, కళాశాలల నుంచి కనీసం 30 మంది ప్రయాణికులు ఒక బృందంగా ఏర్పడి ముందస్తుగా బుక్ చేసుకుంటే, వారి వద్దకే బస్సును పంపి పికప్ చేసుకునే వెసులుబాటు కల్పించింది. ఈ ప్రత్యేక బస్సు సర్వీసులకు రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం టికెట్ ధరలను సవరించినట్లు టీజీఎస్ఆర్టీసీ అధికారులు వెల్లడించారు.

# దవడ పళ్లు రాలుతాయి

## పోలీసులను హెచ్చరించిన రేణుకాచౌదరి



**హైదరాబాద్, అక్టోబరు7,ప్రభాతవార్త:** మీ డ్యూటీ మీరు చేయండి అంతే తప్ప పిచ్చి పిచ్చి వేశాలు వేస్తే దవడ పళ్ళు రాలుతాయి, రెండు కాళ్లు విరిచి జేబులో పెట్టి పంపిస్తా నా కొడకల్లారా అని ఘాటుగా పోలీసు లను తీవ్ర పదజాలంతో ఎంపి రేణుకాచౌదరి హెచ్చ రించారు.ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీ నామా చేయాలంటూ బుధవారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఇండియా కూటమి ఎంపిల ధర్నా ప్రయత్నం తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీసింది. రాహుల్ గాంధీ నేతృత్వంలో ఎంపిలు జంతర్ మంతర్ వద్దకు బయలుదేరగా వారిని మార్గమధ్యంలోనే పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులకు ఎంపీలకు మధ్య తీవ్ర తోపులాట జరిగింది. మగపోలీసులు తనతో పాటు ఇతర మహిళా పార్లమెంట్ సభ్యులపై చేతులేశారనీ కాంగ్రెస్ ఎంపీ రేణుకా చౌదరి ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలపై చేయి వేసిన వారు ఖబర్దార్ నేను ఎవరనుకుంటున్నారు? అని ఆమె పోలీసులను ప్రశ్నించారు. మేము మా డ్యూటీ మేము చేస్తున్నామనీ పోలీసులు బదులు చెప్పారు. మహిళలపై మరోసారి చేయి వేస్తే వారి తోలు తీసి డోలు చేస్తానని హెచ్చరించారు. పోలీ సులు గూండాయిజానికి పాల్పడుతున్నారనీ మేము భయపడేది లేదన్నారు. దేశ యువత కోసం మేము పోరాడుతున్నామన్నారు. రాహుల్ గాంధీ అరెస్టు పై స్పందిస్తూ ఇంకా వెయ్యి అరెస్టులు చేసినా మేము సిద్ధంగా ఉన్నామని ఆమె ఆవేశంతో పోలీసులతో వాగ్వాదానికి దిగారు. బిజెపి పాలకులు పోలీసులను అడ్డం పెట్టుకొని చేసే పనికి భపడతామా ఇలాంటి వెధ వలను చాలానే చూశామంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు.

# రాహుల్ గాంధీ అరెస్ట్‌ను ఖండించిన టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

**హైదరాబాద్,అక్టోబరు 7,ప్రభాతవార్త:** ఓట్లతొలగింపు పై నిరసన తెలపడానికి ఇసి కార్యాలయం వైపు శాంతియుతంగా ర్యాలీగా వెళ్తున్న రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, పార్లమెంట్ సభ్యులు కాంగ్రెస్ శ్రేణుల పట్ల పోలీసులు ప్రవర్తించిన తీరు అత్యంత హేయమైనదని టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ ఖండించారు. దేశంలో ప్రజాస్వామ్యవాతావర్ణం లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. మహిళా పోలీసులను కూడా వినియోగించకుండా మహిళలపై మగ పోలీసులతో దాష్టికం చేయిస్తున్నారని ఇది బిజెపి సంస్కృతని ఆయన దుయ్యబట్టారు. ఎన్ని అణచివేత చర్యలకు పాల్పడినా, పోలీసు బలగాలతో నిర్బంధాలు విధించినా కాంగ్రెస్ పార్టీ ప్రజల తరఫున, రాజ్యాంగం, రాజ్యాంగబద్దసంస్థల పరిరక్షణ కోసం పోరాటాన్ని ఆపేది లేదని మహేష్ అన్నారు.దేశ ప్రధానమంత్రి తర్వాత అత్యున్నత గౌరవం ఇవ్వాల్సిన ప్రతిపక్ష నాయకుడి పట్ల కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అత్యంత బాధాకరమని ఆయన అన్నారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ చేసిన తప్పిదాలను ప్రజల ముందుకు తీసుకువచ్చినందుకే రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను రాజకీయంగా ఎదుర్కోలేక కేంద్ర ప్రభుత్వం అరెస్టుల మార్గాన్ని ఎంచుకుందని విమర్శించారు. ఇండియా కూటమి నాయకులు చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేసినప్పటికీ కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకుండా ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీస్తోందని అన్నారు.దేశ ప్రజలు బీజేపీ ప్రభుత్వ వైఖరిని గమనిస్తున్నారని, మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి రాజకీయంగా రోజులు దగ్గరపడ్డాయని ఆయన వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ఆధ్వ ర్యంలో నిర్వహించే "చలో రాజ్‌భవన్" నిరసన కార్యక్ర మాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. ప్రజాస్వామ్యంపై విశ్వాసం ఉన్న అన్ని వర్గాల ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమం నెక్లెస్ రోడ్ నుంచి రాజ్‌భవన్ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

## ఒకే ఇంటిని పలువురికి విక్రయించి

# రూ.4.5 కోట్లు దండుకున్న మోసగాళ్లు

## నిందితుల్లో ఒకరి అరెస్టు

## భవనం జప్తు, పరారీలో ఉన్న నేరగాళ్ల కోసం గాలింపు

**హైదరాబాద్, అక్టోబరు 7, ప్రభాతవార్త:** పాతబస్తీలోని మాదన్నాపేట్‌లో ఒకే ఇంటిని అనేక మందికి విక్రయించి నాలుగున్నర కోట్ల రూపాయలు దండుకున్న మోసగాళ్ల భాగోతాన్ని సిసిఎస్ పోలీసులు రట్టు చేశారు. ఈ సందర్భంగా మోసగాళ్లలో ఒక మహిళను అరెస్టు చేసి ఇంటిని జప్తు చేశారు. పరా రీలో వున్న మిగతా వారి కోసం గాలిస్తున్నారు. మాదన్నాపేట్‌లోని దారాబ్‌జంగ్ కాలనిలో రషాద్ ఉల్ ఖైర్‌తో పాటు మరికొందరు తమ ఇంటిని పలు భాగాలుగా చేసి పలువురికి ఏకకాలంలో అమ్మారు. ఈ క్రమంలో ఒకరికి తెలియకుండా మరొకరికి అమ్మడంతో పాటు అమ్మి న భాగాలలో తామే వుంటూ అద్దె ఇచ్చేవారు. ఏడాదికి పైగా సాగుతున్న ఈ మోసం గత జూలై నెలలో రట్టయ్యింది. దీనిపై సిసిఎస్ పోలీసులు రంగంలో దిగి గోల్‌మాల్‌పై ఆరా తీయగా రషాద్ ఉల్ ఖైర్‌తో పాటు మరికొందరు ఈ మోసంలో పక్కాగా వ్యవహరించాని తేల్చారు. సు మారు 20 మంది నుంచి నాలుగున్నర కోట్ల రూపాయలను వసూలు చేసి తమ అవసరాలకు వాడుకున్నారని తేల్చారు. బాధితుల ఫిర్యాదు మే ర కు ఈ కేసులో రెండవ ముద్దాయిగా వున్న అస్మా బేగంను అరెస్టు చేసి రిమాండుకు తరిలంచా రు. ఆమెకు సహకరించిన రషాద్ ఉల్ ఖైర్‌తో పాటు ముంతాజ్ బేగం సహా ఇతర నిందితులు పరారీ లో వుండగా వారి కోసం గాలిస్తున్నారు.

# ప్రజాసేవలో ప్రధాని మోడీ 25యేళ్ల ప్రస్థానం

## గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా శుభాకాంక్షలు

**హైదరాబాద్,అక్టోబరు7,ప్రభాతవార్త:** ప్రజాసేవలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25ఏళ్ల ప్రస్థానం పూర్తి చేసుకున్న సందర్భంగా తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు తన అధికారిక సామాజిక మధ్యమాల్లో శుభాకాంక్షలు తెలుపుతూ బుధవారం పోస్ట్ చేశారు. 2001 అక్టోబర్ 7న గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నరేంద్ర మోదీ, గుజరాత్ ముఖ్యమంత్రి నుంచి దేశ ప్రధానిగా ఎదిగి 25ఏళ్లుగా ప్రజాసేవలో కొనసాగుతున్నారని గవర్నర్ పేర్కొన్నారు. ప్రజాసేవ పట్ల ప్రధాని నరేంద్ర మోదీ చూపుతున్న నిబద్ధత, సంకల్పం ప్రశంసనీయమని గవర్నర్ అన్నారు. దేశ అభివృద్ధి, ప్రజలసంక్షేమం కోసం ఆయన చేస్తున్న కృషిని అభినందించారు. ప్రజాసేవలో 25 ఏళ్ల ప్రస్థానం ఒక కీలక మైలురాయి అని పేర్కొన్న గవర్నర్, ప్రధాని నరేంద్ర మోదీకి సంపూర్ణ ఆరోగ్యం, దీర్ఘాయుష్షు కలగాలని, దేశ ప్రజలకు మరింత సేవ చేసే శక్తి, సామర్థ్యం భగవంతుడు ప్రసాదించాలని గవర్నర్ ఆకాంక్షి ంచారు.

# తెలంగాణ బలం.. యువత నైపుణ్యమే

## ప్రపంచ సంస్థలకు హైదరాబాద్ గమ్యస్థానం: మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్,అక్టోబరు7,ప్రభాతవార్త:** తెలంగాణకు ఉన్న అతిపెద్ద బలం యువతలోని నైపుణ్యం, ప్రతిభ, ప్రపంచ స్థాయి పోటీతత్వమేనని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. ఈ ప్రతిభ కారణంగానే హైదరాబాద్ సాంకేతిక, ఆవిష్కరణ, ఆర్థిక సేవలు, గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లకు (జీసీసీ) దేశంలోనే ప్రముఖ గమ్యస్థానంగా ఎదుగుతోందని వెల్లడించారు. జూబ్లీహిల్స్‌లో బుధవారం జరిగిన డిఇ షా ఇండియా 30వ వార్షికోత్సవ వేడుకల్లో మంత్రి శ్రీధర్‌బాబు పాల్గొని ప్రసంగించారు. హైదరాబాద్‌లో డీఈ షా మూడు దశాబ్దాల ప్రస్థానం నగరంపై, తెలంగాణలోని ప్రతిభావంతులైన మానవ వనరులపై ఆ సంస్థకు ఉన్న దీర్ఘకాలిక విశ్వాసానికి నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా డిఇషా గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్లు ఎడ్డీ ఫిష్‌మన్, అనూప్‌ప్రసాద్, నీల్ కాట్జ్‌కు మంత్రి అభినందనలు తెలిపారు. సంస్థ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్లు చైతన్య గొర్రెపాటి, లక్ష్మీ ్మ ప్రసాద్ కోనేటితో పాటు సం స్థలోని మొత్తం బృందానికి శుభాకాంక్షలు చెప్పారు.

# రాహుల్ పోరాటాన్ని బారికేడ్లు ఆపలేవు

## ఓటు చోరీ ఆరోపణలకు ఎన్నికల సంఘం బహిరంగ సమాధానాలు ఇవ్వాలి

## నీటిపారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, అక్టోబర్ 7,ప్రభాతవార్త:** ప్రజల ఓటు విలువను కాపాడాలంటూ రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటాన్ని పోలీసు అరెస్టులు,బారికేడ్లతో ఆపలేరనీ నీటి పారుదల, ఆహార, పౌరసరఫరాల శాఖల మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నలమాద ఉత్తమ్ కు మార్ రెడ్డి అన్నారు. బుధవారం విలేఖరులతో మాటా ్లడుతూ ఢిల్లీలో ఎన్నికల సంఘం వద్దకు వెళ్లేందుకు ప్రయత్నించిన రాహుల్ గాంధీ, ఇతర ప్రతిపక్ష ప్రజాప్రతినిధులను పోలీసులు అడ్డుకోవడం, అదుపులోకి తీసుకోవడం ఎలక్షన్ కమిషన్ ఒంటెద్దుపోకడ పై దేశవ్యాప్తంగా చర్చకు దారితీసిందని ఉత్తమ్ అభిప్రాయపడ్డారు. ఎన్నికల సంఘం తన రాజ్యాంగబద్ధమైన బాధ్యతలకు అనుగుణంగా పూర్తి నిష్పాక్షితతో వ్యవహరించాలని మంత్రి స్పష్టం చేశారు. రాజ్యాంగ సంస్థల ప్రతిష్ఠను నిలబెట్టేది అధికార దర్పం కాదనీ,ప్రజల విశ్వాసమనీ, అది నిలబెట్టుకోవాలంటే నిర్ణయాల్లో పారదర్శకత, అభ్యంతరాల పరిశీలనలో నిజాయితీ, సమాధానాల్లో స్పష్టత ఉండాలనీ హితవుచెప్పారు. సంస్థను ప్రశ్నించడం దాని ప్రతిష్ఠను దెబ్బతీయడమంటూ భావించే ధోరణి ప్రజాస్వామ్య స్ఫూర్తికే విరుద్ధం," అని అన్నారు. అర్హుడైన ఒక్క పౌరుడి పేరు అన్యాయంగా తొలగినా, అది ఆ వ్యక్తి హక్కుకు జరిగిన నష్టమేకాకుండా మొత్తం ప్రజాస్వామ్య వ్యవస్థకు చేటు అని అభిప్రాయపడ్డారు. జాబితాల సవరణకు అనుసరించిన ప్రమాణాలు, పేర్ల తొలగింపునకు కారణాలు, అభ్యంతరాల పరిష్కార విధానం ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలిలనీ కోరారు. సమగ్ర ఓటర్ల సవరణపై వస్తున్న విమర్శలను అవహేళన చేయడం, ప్రశ్నించే వారిపై రాజకీయ దాడులకు దిగడం ద్వారా సందేహాలు తొలగవు. ప్రజల తీర్పుతో ఏర్పడే ప్రభుత్వాల విశ్వసనీయతను కాపాడాలంటే, ఆ తీర్పు వెలువడే ఎన్నికల ప్రక్రియపై పూర్తి నమ్మకం ఉండాలి," చెప్పారు. ప్రజల జీవితాలను ప్రభావితం చేసే నిర్ణయాలపై పట్టుదలగా ప్రశ్నించడం రాహుల్ గాంధీ నాయకత్వంలో కనిపించే లక్షణమని మంత్రి అన్నారు. 2016లో పెద్ద నోట్ల రద్దుతో పేదలు, చిన్న వ్యాపారులు ఎదుర్కొన్న ఇబ్బందులపై ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారని గుర్తుచేశారు. 2020 మార్చిలో కోవిడ్ కారణంగా పొంచి ఉన్న తీవ్రమైన ఆర్థిక దెబ్బపై హెచ్చరించారని, లడఖ్ సరిహద్దు పరిణామాలపై దేశానికి స్పష్టత ఇవ్వాలని పదేపదే కోరారని అన్నారు. ప్రజల ఆందోళనలను అధికార వ్యవస్థల ముందుంచడంలో ఆయన చూపిన పట్టుదల ఇప్పుడు ఎన్నికల పారదర్శకత పోరాటంలోనూ కనిపిస్తోందని పేర్కొన్నారు. సంక్షోభం ముంచుకొచ్చిన తరువాత సానుభూతి ప్రకటించడంతో నాయకత్వ బాధ్యత ముగియదని, ప్రమాదాన్ని గుర్తించినప్పుడు హెచ్చరిం చాలని, ప్రజలకు నష్టం కలిగితే నిలదీయాలని, సమాధానం దొరికే వరకు పట్టుబట్టాలని, రాహుల్‌గాంధీ ఆ బాధ్యతను నిర్వర్తిస్తున్నారని ఆయన తెలిపారు. ఆయన ప్రశ్నలను తేలికగా తీసుకున్నవారు,వాటి వెనుక ఉన్న ప్రజల ఆందోళనను వినాల్సిందే," అని ఉత్తమ్ అన్నారు.

# వాయు నాణ్యత మెరుగుదలకు శాస్త్రీయ పర్యవేక్షణ,సమగ్ర కార్యాచరణ అవసరం

## అటవీ, తతపర్యావరణ శాఖ ముఖ్యకార్యదర్శి అహ్మద్ నదీమ్

**హైదరాబాద్,అక్టోబరు7,ప్రభాతవార్త:** తెలంగాణలో వాయు కాలుష్య నియంత్రణ, వాయు నాణ్యత మెరుగుదల కోసం ఎయిర్ క్వాలిటి మానిటరింగ్ కమిటి(ఎక్యుఎంసి) ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలు సత్ఫలితాలనిస్తున్నాయని అటవీ, పర్యావరణ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్ అన్నారు. శాస్త్రీయ పర్యవేక్షణ, కాలుష్య మూలాల గుర్తింపు, నియంత్రణ చర్యలు, పచ్చదనం పెంపు, ప్రజా అవగాహన కార్యక్రమాలతో కూడిన సమగ్ర కార్యాచరణను కొనసాగిస్తుండటం అభినందనీయమని పేర్కొన్నారు. బుధవారం సెక్రటేరియట్‌లో కమిటి ఛైర్మన్, ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్ ఆధ్వర్యంలో కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సిపిసిబి) ఆమోదించిన ఎక్యుఎంసి కార్యాచరణ ప్రణాళికలోని అంశాలపై ఎయిర్ క్వాలిటి మానిటరింగ్ కమిటి సమావేశం చర్చించింది. క్యూర్ ప్రాంతంలో వాయు నాణ్యతను మరింత ఖచ్చితంగా, నిరంతరంగా పర్యవేక్షి ంచేందుకు 13 నిరంతర పరిసర వాయు నాణ్యత పర్యవేక్షణ వ్యవస్థ (సిఏఏక్యూఎంఎస్)ల ఏర్పాటు ప్రక్రియ కొనసాగుతున్నది. పర్యవేక్షణ కేంద్రాల స్థానాలను శాస్త్రీయంగా నిర్ణయించి, ఆయా ప్రాంతాల్లోని వాయు నాణ్యతకు సంబంధించిన కచ్చితమైన సమా చారాన్ని పొందేలా సాంకేతిక కమిటీని ఏర్పాటు చేశారు. సిఏఏక్యూ ఎంఎస్‌ల నుంచి లభించే డేటాను సమగ్రంగా అందుబాటులోకి తీసుకురావడానికి ఎయిర్ క్వాలిటి డ్యాష్ బోర్డు అభివృద్ధి ప్రక్రియ కూడా కొనసాగుతున్నది. సంబంధిత శాఖలకు ఎస్ఎంఎస్ అలర్ట్‌ల ద్వారా వాయు నాణ్యతకు సంబంధించిన సమాచారం చేరవేస్తారు. టిజిపిసిబి ఆధ్వర్యంలో బొల్లారం, జీడిమెట్ల ప్రాంతాల్లో ఇప్పటికే 8 ఏర్పాటు చేశారు. రీసైక్లింగ్, క్రషింగ్ తదితర కార్యకలాపాలు జరిగే ప్రాంతాల్లో, అలాగే నిర్మాణ, కూల్చివేత ప్రదేశాల్లో ఎస్‌సిఎస్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటు న్నారు. పట్టణ వాయు కాలుష్యం లో ధూళికణాల కాలుష్యాన్ని నియంత్రించేందుకు రోడ్ డస్ట్ నియంత్రణకు ప్రాధాన్యత ఇస్తున్నారు. రోడ్ల మెరుగుదల, ఎండ్‌టుఎండ్ పేవింగ్, మెకానికల్ రోడ్ స్వీపింగ్, బహిరంగ ప్రాంతాల్లో పచ్చదనం పెంపుదల, ట్రాఫిక్ కారిడార్లలో గ్రీన్ కవర్, మినీ ఫారెస్టులు, మియావాకీ ప్లాంటేషన్లు వంటి చర్యలను నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ కింద చేపడుతున్నారు.

# నేటి నుంచి హైదరాబాద్‌లో ఆర్చరీ ప్రీమియర్ లీగ్

## 18వరకు నెక్లెస్‌రోడ్ పీపుల్స్ ప్లాజా వేదికగా పోటీలు

## భాగ్యనగరానికి తరలివచ్చిన ఒలింపియన్లు, ఆసియాడ్ విజేతలు



**హైదరాబాద్, అక్టోబరు 7,ప్రభాతవార్త:** ప్రపంచంలోనే ఏకైక ఫ్రాంచైజీ ఆధారిత ఆర్చరీ టోర్నమెంట్ ఆర్చరీ ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) రెండో సీజన్ ఆతిథ్యాన్ని హైదరాబాద్ సిద్ధమైంది. న్యూఢిల్లీలో తొలి సీజన్ విజయవంతమయ్యాక ఐచినగోయా ఆసియా క్రీడల్లో భారత ఆర్చరీ బృందం దక్షి ణ కొరియాను అధిగమించి సంచలన ప్రదర్శన చేసిన ఉత్సాహంతో ఈ లీగ్ ప్రారంభమవుతోంది. గురువారం మొదలయ్యే ఈ పోటీలు ఈ నెల 18 వరకు నెక్లెస్ రోడ్‌లో ఉన్న పీపుల్స్ ప్లాజా వేదికగా జరగనున్నాయి.

ఒలింపిక్ పతక విజేతలు, భారత ఆసియా క్రీడల స్టార్లతో పాటు అంతర్జాతీయ ఆర్చర్లు ఒకే వేదికపైకి రానున్నారు. బుధవారం నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో లీగ్ గీతాన్ని, మాస్కాట్‌ను అధికారికంగా ఆవిష్కరించారు. 15 సెకన్ల షాట్ క్లాక్.. భిన్నమైన ఫార్మాట్ ఈ టోర్నమెంట్‌లో ఆరు జట్లలో కలిపి మొత్తం 48 మంది భారత, అంతర్జాతీయ ఆర్చర్లు పోటీపడుతున్నారు. ప్రతి జట్టులో ఎనిమిది మంది క్రీడాకారులు ఉంటారు. రికర్వ్, కాంపౌండ్ ఒకే జట్టులో కలిసి ఆడటం ఈ ఫ్రాంచైజీ లీగ్ ప్రత్యేకత. ప్రతి బాణం సంధించడానికి కేవలం 15 సెకన్ల సమయం మాత్రమే కేటాయిస్తారు. డబుల్ రౌండ్‌రాబిన్ పద్ధతిలో సాగే ఈ లీగ్‌లో ప్రతి మ్యాచ్‌లో నలుగురు ఆర్చర్లు ఒక్కో సెట్‌కు రెండు బాణాలు వేస్తూ పాయింట్ల కోసం పోటీపడతారు. లీగ్ దశ ముగిసేసరికి అగ్రస్థానంలో నిలిచిన నాలుగు జట్లు సెమీఫైనల్స్‌కు చేరుకోగా, అక్టోబర్ 18న తుది పోరు (ఫైనల్) జరుగుతుంది. ఈసందర్భంగా లీగ్ డైరెక్టర్ అనిల్ కామినేని మాట్లాడుతూ దేశ సంస్కృతికి అద్దం పట్టేలా ఏపీఎల్ నిర్వహి స్తున్నామన్నారు.

గతేడాది తొలి ఎడిషన్‌తో పోలిస్తే ఆర్చరీ ప్రీమియర్ లీగ్ పై ఆసక్తి మరింత పెరిగిందని ప్రపంచవ్యాప్తం గా ఉన్న ఆర్చర్లు ఈ లీగ్‌లో పాల్గొనేందుకు తీవ్ర ఉత్సాహం చూపుతున్నారన్నారు. తొలి రోజు మూడు మ్యాచ్‌లు లీగ్ ప్రారంభ రోజైన గురువారం మూడు మ్యాచ్‌లు జరగనున్నాయి.

గతేడాది చాంపియన్ రాజ్‌పుతానా రాయల్స్, రన్నరప్ పృథ్వీరాజ్ యోధాస్ ఆరంభ పోరులో తలపడతాయి. రెండో మ్యాచ్‌లో వెన్నం జ్యోతి సురేఖ నేతృత్వంలోని కాకతీయ నైట్స్, ధీరజ్ బొమ్మదేవర నేతృత్వంలోని మైటీ మరాఠాస్ తలపడతాయి. మూడో మ్యాచ్‌లో కుంకుమ్ మొహోద్, అతాను దాస్, కేసీ కౌఫోల్డ్ తో కూడిన చెరో ఆర్చర్స్ జట్టు.. దీపికా కుమారి, చికిత సభ్యులుగా ఉన్న చోళ చీఫ్స్ టీమ్‌ను ఢీకొట్టనుంది.

**సొంతగడ్డపై ఆడటం సంతోషంగా ఉంది: తానిపర్తి చికిత**

సఆసియా క్రీడల్లో స్వర్ణ పతకం సాధించిన పెద్దపల్లికి చెందిన తెలంగాణ ఆర్చర్ తానిపర్తి చికిత చోళ చీఫ్స్ తరఫున బరిలోకి దిగనుంది. తొలి సీజన్ ఏపీఎల్ అనుభవం ఈ ఆసియాడ్ లో రెండు స్వర్ణాలు నెగ్గడానికి తనకు ఎంతగానో ఉపయోగపడిందని చెప్పింది. "ఏపీఎల్ తొలి సీజన్‌లో 15 సెకన్ల వేగవంతమైన షాట్ క్లాక్ కింద ఆడిన అనుభవం ఒత్తిడిని ఎదుర్కోవడంలో నాకు ఎంతో సహాయపడింది. సీనియర్ల శిక్షణను చూస్తూ మెళకువలు నేర్చుకున్నాను. అది ఆసియాడ్‌లో పసిడి గెలవడానికి కూడా ఉపయోగపడింది. ఇప్పుడు నా సొంత గడ్డపై ఆడుతుండటం ఆనందంగా ఉంది. ఈ పోటీలను చూసి మరింత మంది చిన్నారులు, యువతు ఆర్చరీని ఎంచుకుంటారని ఆశిస్తున్నా అని తెలిపింది.

पंजाब नैशनल बैंक ...भरोसे का प्रतीक! punjab national bank ...the name you can BANK upon!

ప్రజా ప్రకటన

ఈ ప్రకటన, శూన్య నిల్వ ఉన్న మరియు గత మూడు సంవత్సరాలకు పైగా కస్టమర్ ద్వారా ఎటువంటి లావాదేవీలు జరగని నిష్క్రియ ఖాతాదారుల కోసం జారీ చేయబడింది. తమ ఖాతాను తిరిగి సక్రియం చేసుకోవడానికి KYC పత్రాలను సమర్పించి PNB శాఖను సంప్రదించవలసిందిగా కోరడమైనది. ఈ ప్రకటన తేదీ నుండి ఒక నెలలోపు ఖాతాను సక్రియం చేయనట్లయితే, తదుపరి ఎటువంటి సమాచారం ఇవ్వకుండా అటువంటి నిష్క్రియ ఖాతాలను మూసివేయబడతాయి.

ఏవైనా ప్రశ్నలు/సహాయం కోసం దయచేసి మీ శాఖను సంప్రదించండి.

పంజాబ్ నేషనల్ బ్యాంక్

తేదీ: 08.10.2026

అధీకృత సంతకందారు

వార్త

అణుయుద్ధంలో విజయం సాధించాలంటే ఒక్కటే మార్గం. అసలు యుద్ధమే ఆరంభం కాకుండా చూడాలి.

- బ్రాడ్లీ ఓమర్ నెల్సన్

# పొంచి ఉన్న క్షీర సంక్షోభం

వ్యవసాయరంగానికి అనుబంధ పరిశ్రమల్లో ఎంతో కీలకమైన పాడిపరిశ్రమ నేడు సంక్షోభంలో కూరుకుపోతున్నదేమోననిపిస్తున్నది. ఇప్పటికే పాల కొరతను అవకాశంగా తీసుకొని కొందరు దళారులు భారీ ఎత్తున కల్తీ పాలను తయారు చేసి ప్రజలకు అంటగడుతున్నారు. సూపర్ ఎల్‌నినో ప్రభావంతో ఈసారి వ్యవసాయరంగం తీవ్రమైన సంక్షోభం ఎదుర్కోబోతున్నట్లు సంకేతాలు వెలువడుతున్నాయి. వ్యవసాయరంగ శాస్త్రవేత్తలు ఇప్పటికే పదే పదే హెచ్చరిస్తున్నారు. ఫలితంగా పాల సంక్షోభం మరింత తీవ్ర రూపం దాల్చే పరిస్థితులు కన్పిస్తున్నాయి. చిన్నచిన్న డెయిరీలు కొన్ని మూతపడగా మరికొన్ని అదే బాటలో పయనిస్తున్నాయి. ప్రభుత్వరంగంలోనూ ఏవో కొన్ని డెయిరీలు తప్ప అధికశాతం నష్టాల ఊబిలోనే నెట్టుకొస్తున్నాయి. ప్రైవేట్ రంగంలో నడుస్తున్న పెద్దపెద్ద డెయిరీలకు అంతగా ఇబ్బంది లేకపోయినా ఆనిర్వాహకులు కూడా గడ్డు సమస్యలు ఎదుర్కొంటున్నారు. కరోనా తర్వాత పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. కరోనా కాలంలో ఈ డెయిరీల్లో పనిచేస్తున్న వేలాది మంది కార్మికులు తమతమ రాష్ట్రాలకు తిరిగి వెళ్లిపోయారు. అందులో కేవలం ఇరవై, ముప్ఫైశాతం కూడా తిరిగిరాలేదు. కార్మికుల కొరత తీవ్రరూపం దాల్చింది. ఎందరో చిన్న డెయిరీలు నడిపే యాజమాన్యాలు కేవలం కార్మికుల కొరతతో మూసివేశారని చెప్పొచ్చు. ఇక కృత్రిమ గర్భదారణ సమస్యలతో పాటు పశువులకు వస్తున్న రకరకాల వ్యాధులు, పశుగ్రాసం కొరత లాంటివి చుట్టుముట్టడంతో అనేక మంది రైతులు పశువులను అమ్ముకుంటున్నారు. సాధారణంగా వేసవిలో పాలకొరత సమస్య మరింత జటిలమవుతుంది. కానీ ఈసారి వర్షాకాలంలో కూడా పరిస్థితి అదుపు తప్పుతున్నదేమోననిపిస్తున్నది. ఉత్పత్తికి వినియోగానికి వ్యత్యాసం పెరిగే కొద్దీ దాన్ని భర్తీ చేసేందుకు దళారులు కృత్రిమ రసాయనికాలతో సింథటిక్ పాలను తయారు చేస్తున్నారు. పాల ఉత్పత్తులతో తయారు చేసే స్వీట్లు, ఇతర పదార్థాలు చివరకు నెయ్యి కూడా భారీ ఎత్తున నకిలీది తయారవుతున్నది. ఇటీవల హైదరాబాద్‌లో ప్రత్యేక బృందాలు చేసిన దాడుల్లో టన్నుల కొద్దీ నకిలీ నెయ్యి పట్టుబడింది. ఎన్నిసార్లు పట్టుబడినా, అరెస్టులు జరిగినా, జైలుకు వెళ్లినా తిరిగి వచ్చి ఆ వ్యక్తులు అదే వ్యాపారంలో కొనసాగుతున్నారు. ప్రజలకు విక్రయించే పాలల్లో అరవైఎనిమిది శాతానికిపైగా కల్తీయేనన్న వాస్తవాన్ని జాతీయ ఆహార భద్రతా ప్రమాణాల మండలి తనిఖీల్లో బయటపడింది. స్వచ్ఛమైన పాల లభ్యత అటు ప్రపంచవ్యాప్తంగా కూడా సమస్యగా మారింది. ప్రపంచ పాల వ్యాపారాన్ని శాసించే న్యూజిలాండ్ వంటి దేశాలు కూడా ఈ సమస్యను ఎదుర్కొంటున్నాయి. అయితే ఆ దేశాల్లో ఎప్పటికప్పుడు పటిష్టమైన చర్యలు తీసుకుంటూ నియంత్రించగలుగుతున్నారు. కానీ భారత్‌లో ఆ పరిస్థితులు కన్పించడం లేదు. పెరుగుతున్న జనాభా, పట్టణీకరణ వల్ల పాలు, పాల ఉత్పత్తులకు గిరాకీ ఊహించని రీతిలో పెరిగిపోతున్నది. దానికి అనుగుణంగా పాల ఉత్పత్తి పెరగడం లేదు. ఫలితంగా ధరలతోపాటు కల్తీ పెరిగిపోతున్నది. కానీ పాల రైతులకు మాత్రం ఆదాయం అంతంత మాత్రమే ఉంటున్నది. మొన్న ఆ మధ్య దక్షిణాది రాష్ట్రాల్లోపశువులకు వ్యాపించిన ముద్ద చర్మ లాంటి వ్యాధులతో పెద్దఎత్తున పశువులు మృతి చెందాయి. అంతేకాదు ఉన్న పశువుల్లో కూడా ఉత్పత్తి దెబ్బతిన్నది. పాల ఉత్పత్తిలో ప్రపంచంలోనే అగ్రస్థానంలో చేరుకునే అవకాశం ఉన్నా భారత్ ఆ వైపు అడుగులు వేయలేకపోతున్నది. కల్తీని అదుపు చేయలేకపోతున్నదనే వాదనను తోసిపుచ్చలేం. వీటన్నిటికంటే ముఖ్యంగా పాల ఉత్పత్తి, నాణ్యత పెంపు విషయంలో అటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కానీ నిర్దిష్టమైన ప్రణాళిక లేదనే చెప్పొచ్చు. ప్రభుత్వపరంగా అనేక పథకాలు ఉన్నప్పటికీ నిధులు కేటాయించడం, కేటాయించిన నిధులు సక్రమంగా లబ్ధిదారులకు అందించి సమర్థవంతంగా పథకాలను నడపలేకపోతున్నారు. దేశవ్యాప్తంగా ప్రమాణాల నిర్ధారణ సంస్థలు పని చేస్తున్నా వాటికి నిర్ధారణ జరిపేతీరిక, సమయం లేకుండా పోతున్నది. మరికొన్ని సంస్థల్లో పాతుకుపోయిన అవినీతి కారణంగా నిఘారూపం కూడా కొట్టొచ్చినట్లు కన్పిస్తున్నది. తెలుగు రాష్ట్రాల్లో దాదాపు ఇరవై ఐదు నుంచి ముప్పై శాతం వరకు కొరత ఉన్నట్లు చెప్తున్నారు. ఎల్‌నినో ప్రభా వంతో వ్యవసాయరంగం సంక్షోభం వల్ల ఆ కొరత మరో పది, పదిహేను శాతం పెరగవచ్చునని అభిప్రాయపడుతున్నారు. దీన్ని కల్తీతో భర్తీ చేసేందుకు దళారులు ఎలాగో పొంచి ఉంటారు. హోటళ్లలో విక్రయించే తినుబండారాల లో సింథటిక్ పాలనే వాడుతున్నారు. యూరియా, వంట నూనెలు, డిటర్జెంట్ వంటి రసాయనికాలతో పాలను తయారు చేస్తూ పట్టుబడిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. శిక్షలు కఠినంగా లేకపోవడం, చాలా వరకు కేసుల్లో సరైన సాక్ష్యాలు రుజువు చేయలేకపోవడంతో చాలా కేసులు వీగిపోతున్నాయి. అందుకే చట్టాలన్నా, అధికారులన్నా కల్తీపాలవ్యాపారుల్లో భయభక్తులు లేకుండా పోయాయి. దేశ వ్యాప్తంగా ప్రస్తుతం ఇరవైఐదువేల కోట్ల టన్నుల పాలు ఉత్పత్తి అవుతున్నట్లు అంచనా. కానీ అందరికి పాలు అందాలంటే అది ముప్ఫైఐదు, నలభై వేల కోట్లవరకు చేరాలని అనధికార అంచనాలు చెబుతున్నాయి. ఈ వ్యత్యాసాన్ని పూడ్చడానికి ఇప్పట్లో సాధ్యమయ్యే అవకాశాలు లేవని ఆ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఈ పరిస్థితు ల్లో లక్ష్యం చేరడం సాధ్యంకాకపోవచ్చు. ముఖ్యంగా పాడి పరిశ్రమ తలకుమించిన భారమై అన్నదాతకు దాన్ని వదిలించుకునేందుకే ఎక్కువ మొగ్గుచూపుతున్నారు. ఇప్పటికైనా పాడిపరిశ్రమపై పాలకులు ప్రత్యేక దృష్టి పెట్టాలి. ముఖ్యంగా రైతులకు ప్రోత్సాహకాలు మాటల్లో కాకుండా చేతల్లో చూపాలి.

సోమరిగా కాలాన్ని, యవ్వనాన్ని వృధా చేసుకుంటూ ఇంటివద్ద జీవితం గడిపేకన్నా హాయిగా విదేశాలలో విహరిస్తూ ప్రపంచ వింతలను చూడు.



షేక్స్పియర్

సమానుడితో పోరాడడం సందేహాస్పదమైనది, ఉన్నతునితో పోరాడడం పిచ్చితనం లాంటిది అయితే అధమునితో పోరాడడం నీచమైనది.



సెనెకా

## ప్రజావాక్కు



### రేబిస్ విషయంలో నిర్లక్ష్యం తగదు

రేబిస్ విషయంలోనిర్లక్ష్యానికి ఏమాత్రంతావులేదు. వ్యాధి లక్షణాలు కనిపించిన తర్వాత రేబిస్ దాదాపు వంద శాతం ప్రాణాంతకమైన వ్యాధి. అందువల్ల జంతువు కాటుకు గురైన వెంటనే వైద్యుల సూచన మేరకు సమర్థమైన టీకాలు, అవసరమైన చికిత్స తీసుకోవడం అత్యంత కీలకం. ఇటీవల నకిలీరేబిస్ టీకాలు గుర్తించబడిన ఘటన వైద్య భద్రతలో ఔషధాల సరఫరా వ్యవస్థను కట్టుదిట్టంగా పర్యవేక్షించాల్సిన అవసరాన్ని స్పష్టంచేస్తోంది. నకిలీ టీకా తీసుకున్న వ్యక్తికి తాను రక్షణ పొందుతున్నాననే తప్పుడు భద్రతాభావం కలుగుతుంది. అదే ప్రాణాంతక ప్రమాదంగా మారవచ్చు. ప్రపంచ రేబిస్ భారంలో భారతదేశం వాటా సుమారు 40 శాతం. దేశంలో ఏటా దాదాపు 20వేల మంది రేబిస్‌తో మరణిస్తున్నట్లు అంచనాలు సూచిస్తున్నాయి. కాబట్టి ప్రతి టీకా మోతాదు నాణ్యతపై రాజీకి అవకాశం ఉండకూడదు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### అన్నీ స్మార్ట్‌ఫోన్‌లోనే..

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రభుత్వపాఠశాలల్లో పని చేయుచున్న ఉపాధ్యాయుని ఉపాధ్యాయుల కోసం, విద్యార్థిని విద్యార్థుల కోసం లీప్ యాప్ ప్రవేశపెట్టింది. ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థుల హాజరుతో పాటు, వార్షిక పరీక్షల్లో వచ్చినమార్కులు, టెస్టులలో వచ్చిన మార్కులు, అసెస్మెంట్ చేసినప్పుడు వచ్చిన మార్కులు, కరికులర్ కోరికులర్ ఎక్స్ట్రా క్యులర్ యాక్టివిటీస్ అన్ని నమోదు చేసే విధంగా హోలిస్టిక్ ప్రెస్ కార్డును కూడా ప్రవేశపెట్టింది. అయితే గతప్రభుత్వం ప్రభుత్వ స్కూళ్లలో పెట్టించినా ప్యానల్ బోర్డ్స్‌లో బైజుస్ కంటెంట్ కి బదులుగా క్లికర్స్ అనే కంటెంట్‌ని ఉపయోగించమని అధికారులు సూచించారు. ఇప్పుడు ప్రతి ఒక్కటిఫోన్‌లోనే.

- వి. భాస్కర్ రావు, బొబ్బిలి

### సమాజంలో మార్పు రావాలి

అక్రమ సంబంధాలుపెట్టుకుని భర్తలను భార్యలు, భార్యలను భర్తలు అంతమొందిస్తున్నారు. కడుపున పుట్టిన పిల్లలు అడ్డుగా ఉన్నారనుకుంటే వారినీ కిరాతకంగా హతమారుస్తున్నారు. కన్నకూతుళ్లపైనే తండ్రులుఅత్యాచారాలు చేస్తున్నారు. దీంతోబాల్యం నుంచేపిల్లలు విలన్‌లా తయారవుతున్నారు. కుటుంబ సభ్యుల మధ్య సఖ్యత ఉండటం లేదు. ఆస్థి కోసం డబ్బులకోసం కలహించుకుంటున్నారు.

-కె.రామకృష్ణ, హైదరాబాద్

### రీల్స్‌కు బానిసలు కావద్దు

స్మార్ట్‌ఫోన్ చేతిలోకి వచ్చినప్పటి నుంచి ఈ మధ్య చాలా మంది రీల్స్ చేయడం, చూడటం ఒక వ్యసనంలా మార్చుకుంటున్నారు. కొద్దిసేపు వినోదం కోసం మొదలుపెట్టి గంటల తరబడి వాటిలోనే గడుపుతున్నారు. దీనివల్ల విలువైన సమయాన్ని కోల్పోవడమే కాకుండా ఆరోగ్య సమస్యలను కూడా కొని తెచ్చుకుంటున్నారు. మరికొందరు రీల్స్ మోజులో పడి ప్రమాదకరమైన పనులుచేస్తూ ప్రాణాలను సైతం కోల్పోతున్నారు. రీల్స్ కోసం మన ప్రాణాలను, సమయాన్ని పణంగా పెట్టడం ఏమాత్రం మంచిదికాదు. స్మార్ట్‌ఫోన్‌ను సమాచారం, విజ్ఞానం, విద్యవంటిమంచి విషయాల కోసం ఉపయోగించాలి. వినోదానికి కొంత సమయం కేటాయించి, మిగిలిన సమయాన్ని మనఅభివృద్ధికి ఉపయోగించాలి. తల్లిదండ్రులు కూడా పిల్లలు ఫోన్‌లో ఏంచూస్తున్నారో, ఎంత సమయం గడుపుతున్నారో గమనిస్తూ వారికి మంచి అలవాట్లు నేర్పాలి.

- ఎన్. కృష్ణ, హైదరాబాద్

### మొక్కలకు ప్రాధాన్యతను ఇద్దాం!

ప్రస్తుతం నేటి ఆధునిక యుగంలో ప్రతీరోజూ కాలుష్యంతో పోరాడుతూ, వాతావరణ మార్పుల ప్రభావాన్ని అనుభవిస్తూ, మొక్కల అవసరం తెలిసి కూడా వాటిని విచక్షణారహితంగా కొట్టేస్తున్నారు. రోడ్లువేస్తున్నారని, కాలువలు కడుతున్నారని, ఇతరత్రా అభివృద్ధి పనులపేరిట వృక్షాలను నరికివేసున్నారు. వాటి స్థానంలో మరో చోటనైనా కొత్త మొక్కలు నాటడం లేదు. ప్రస్తుతం ఎల్‌నినో పరిస్థితి రావడానికి కూడా ఇదే కారణం అని నిపుణులు చెబుతున్నారు. మనకు, భవిష్యత్తు తరాలకు మొక్కల అవసరం ఉందన్న సంగతి గ్రహించాలి. పచ్చదనం లేకపోతే మనుగడ లేదన్న విషయాన్ని అందరం గుర్తించి మొక్కలు నాటడానికి ప్రాధాన్యం ఇద్దాం.

- డి. వెంకటరెడ్డి, బెంగుకూరు

### రైతుల ఆదాయం పెంచాలి

ఉపాధి హామీ రూపాంతరం చెందిన పిమ్మట కేంద్ర ప్రభుత్వం ఉపాధికి హామీ పడుతూ ఆస్తుల సృష్టి, బహుళ రకాల ఆదాయ మార్గాలపైన దృష్టి పెట్టినట్టు అర్థం అవుతున్నది. ఇవ్వాలా ఎవరు అవునన్నా కాదన్న నీటి వసతి పెరిగింది. అలాగేనీటిని ఒడిసిపట్టడం పైనప్రజలలో అవగాహనా కూడా పెరిగింది. అయితే నీటి వసతి పెరగడం మూలంగా గాలిలో తేమ పెరిగి వివిధ రకాల పండ్ల మొక్కల సాగుకి వీలు అవుతున్నది. మొక్కల పెంపకం పైన దృష్టి పెట్టాలి.

- భారత అవినాష్, జనగామ

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన వి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ఆర్థిక శక్తికి మారుతున్న కొలమానాలు

*ప్రతి దేశం రాజకీయ భద్రత పేరుతో మార్కెట్లను మూసివేసి, సరఫరా గొలుసులను విడదీస్తే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మరింత ఖరీదైనదిగా, అసమర్థమైనదిగా మారుతుంది. భౌగోళిక రాజకీయ పోటీని ఆపడం సాధ్యం కాకపోవచ్చు. కానీ ఆ పోటీ ప్రపంచ ఆర్థిక అనుసంధానాన్ని పూర్తిగాధ్వంసం చేయకుండా చూడటం మాత్రం సాధ్యమే. పరస్పర ఆధారపడటం యుద్ధానికి అడ్డుకట్ట వేయగల ఏకైక హామీ కాకపోయినా, దాని ధరను పెంచుతుంది. అదే సమయంలో విభజనకు బదులుగా సహకారానికి ఆర్థిక విలువను కొనసాగిస్తుంది. రాబోయే ప్రపంచ క్రమాన్ని సైనిక కూటములు మాత్రమే నిర్ణయించవు. ఎవరి వద్ద కీలక సాంకేతికత ఉంది? ఎవరు ఇంధనాన్ని, ముడి సరుకును, సరఫరా గొలుసులను నియంత్రిస్తున్నారు? ఎవరి ఆర్థిక నెట్‌వర్క్‌పై ప్రపంచ మార్కెట్లు ఆధారపడుతున్నాయి? ఇతరుల ఆధారపడటాన్ని ఎవరు వ్యూహాత్మక ప్రభావంగా మార్చగలరు? ఈ ప్రశ్నలే భవిష్యత్ శక్తి సమీకరణాలను నిర్ణయించనున్నాయి. కొత్త భౌగోళిక రాజకీయాల్లో భూభాగాన్ని ఆక్రమించడం కంటే, ఇతరుల ఆధారపడటాన్ని నియంత్రించడమే అసలైన శక్తి.*

దుంగ జయరాం

రాబోయే దశాబ్దంలో అత్యంత కీలకమైన భౌగోళిక రాజకీయ పోరాటం సరిహద్దుల విస్తరణ, భూభాగాల ఆక్రమణ చుట్టూ మాత్రమే సాగకపోవచ్చు. ఆధునిక ప్రపంచంలో ఇతర దేశాలు తమపై ఎంతగా ఆధారపడేలా చేయగలరు, ఆ ఆధారపడటాన్ని ఎంతవరకు వ్యూహాత్మక ప్రయోజనంగా మలుచుకోగలరు అన్నదే శక్తికి కొత్త కొలమానంగా మారుతోంది. ఇంధనం, కీలక ఖనిజాలు, సెమీకండక్టర్లు, సముద్ర రవాణా మార్గాలు, డిజిటల్ మౌలిక వసతులు, ఆర్థిక నెట్‌వర్క్‌లపై నియంత్రణ పెరిగే కొద్దీ రాజకీయ ప్రభావం కూడా పెరుగుతోంది. సైనిక శక్తి ప్రాధాన్యం తగ్గలేదు. కానీ ఆర్థిక, సాంకేతిక, ద్రవ్య ఆధిపత్యాలు ఇప్పుడు విదేశాంగ విధానాన్ని ప్రభావితం చేసే కీలక సాధనాలుగా మారాయి. ఇది ప్రపంచ శక్తి సమీకరణాల స్వరూపాన్నే మార్చుతోంది. ప్రచ్ఛన్న యుద్ధకాలంలా ప్రపంచం రెండు స్పష్టమైన శిబిరాలుగా విడిపోలేదు. అమెరికా-చైనా పోటీ తీవ్రతరమవుతున్నప్పటికీ, రష్యా ఇంధనం, భద్రతా సంబంధాల ద్వారా ప్రభావాన్ని కొనసాగిస్తోంది. యూరప్ వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తిని పెంచుకోవాలని చూస్తోంది. భారత్ వంటిదేశాలు ఏ ఒక్కశక్తి కేంద్రానికీ పూర్తిగా కట్టుబడకుండా, తమ ప్రయోజనాలకు అనుగుణంగా భాగస్వామ్యాలను ఎంచుకుంటున్నాయి. ఇది శాశ్వత కూటముల కంటే అవసరానికి అనుగుణంగా మారే బహుముఖ దౌత్యానికి దారితీస్తోంది. ఈ మార్పులో సాంకేతికత కీలక రంగంగా ఎదిగింది. సెమీకండక్టర్లు, కృత్రిమ మేధ, అధునాతన కంప్యూటింగ్, టెలికమ్యూనికేషన్లు ఇక వ్యాపార రంగాలకే పరిమితం కావు. అవి ఆర్థిక పోటీతత్వం, జాతీయ భద్రతకు పునాదులు. అందుకే కీలక సాంకేతికతల బదిలీపై ఆంక్షలు, ఎగుమతి నియంత్రణలు పెరుగుతున్నాయి. అదే సమయంలో దేశాలు దేశీయ తయారీ సామర్థ్యాలను పెంచుతూ, ప్రత్యర్థులపై ఆధారపడని ప్రత్యామ్నాయ సరఫరా వ్యవస్థలను నిర్మిస్తున్నాయి. ఆర్థిక వ్యవస్థ కూడా ఈ పోరాటంలో ఆయుధంగా మారింది. డాలర్ ఆధిపత్యం, అంతర్జాతీయ చెల్లింపు వ్యవస్థలు, సుంకాలు, పెట్టుబడి పరిమితులు, ఎగుమతి నియంత్రణలు ఇప్పుడు వాణిజ్య విధానాలకే పరిమితం కావడం లేదు, రాజకీయ ఒత్తిడి సాధనాలుగా ఉపయోగపడుతున్నాయి. దీనికి ప్రతిగా స్థానిక కరెన్సీల్లో వాణిజ్యం, ప్రత్యామ్నాయ చెల్లింపు వ్యవస్థలు, డీడాలరైజేషన్ ప్రయత్నాలు ఊపందుకుంటున్నాయి. అయితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థను పూర్తిగా విడదీయడం ఎవరికీ సులభం కాదు. సరఫరా గొలుసులు దశాబ్దాలుగా దేశాల మధ్య ఏర్పడిన పరస్పర ఆధారపడటంపై నిర్మితమయ్యాయి. వాటిని ఒక్కసారిగా తెంచితే ఉత్పత్తి వ్యయం పెరుగుతుంది, వాణిజ్యం మందగిస్తుంది, వినియోగదారులపై భారంపడుతుంది. అందుకే కీలక రంగాల్లో ఆధారపడటాన్ని తగ్గిస్తూ, మిగిలిన రంగాల్లో పరస్పర వాణిజ్యాన్ని కొనసాగించే ప్రమాదనియంత్రిత అనుసంధానం దిశగా ప్రపంచం కదులుతోంది. సముద్ర మార్గాలు, ఇంధన సరఫరాలు ఈ కొత్త భౌగోళిక రాజకీయ వాస్తవాన్ని మరింత స్పష్టంగా చూపిస్తున్నాయి. హోర్ముజ్ జలసంధిలో ఉద్రిక్తత చమురు ధరలను ప్రపంచ



వ్యాప్తంగా ప్రభావితం చేయగలదు. మలక్కా జలసంధి అంతర్జాతీయ వాణిజ్యానికి కీలకం. తైవాన్ చుట్టూ ఏర్పడే సంక్షోభం ప్రపంచ సెమీకండక్టర్ సరఫరాపై తీవ్ర ప్రభావం చూపగలదు. అంటే భద్రత అనేది ఇక సరిహద్దులను కాపాడటంతో మాత్రమే ముగియదు. ప్రత్యామ్నాయ సరఫరా మార్గాలు, నిల్వలు, మౌలిక వసతులను సిద్ధం చేసుకోవడం కూడా దాని భాగమే. కీలక ఖనిజాల విషయంలోనూ ఇదే విరోధాభాసం కనిపిస్తోంది. శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గించాలనుకుంటున్న ప్రపంచం, విద్యుత్ వాహనాలు, బ్యాటరీలు, పునరుత్పాదక ఇంధనం, రక్షణ సాంకేతికతలకు అవసరమైన లిథియం, కోబాల్ట్, నికెల్, అరుదైన భూలోహాల కోసం కొద్ది దేశాలపై ఆధారపడాల్సి వస్తోంది. పాత ఇంధన ఆధారపడటాన్ని తగ్గించే ప్రయత్నం కొత్త ముడిసరుకు ఆధారపడటానికి దారితీయకూడదన్నది భవిష్యత్ విధానానికి కీలక సవాలు. అందుకే వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి ప్రతి దేశానికీ ప్రాధాన్యంగా మారింది. అమెరికా కీలక తయారీని స్వదేశానికి తీసుకురావాలని చూస్తోంది. చైనా సాంకేతిక స్వావలంబనను పెంచుతోంది. యూరప్ రక్షణ, ఇంధన రంగాల్లో తన సామర్థ్యాన్ని బలోపేతం చేసుకోవాలని ప్రయత్నిస్తోంది. భారత్ కూడా దేశీయ తయారీ, సాంకేతిక సామర్థ్యం, ప్రత్యామ్నాయ సరఫరా మార్గాలపై దృష్టి పెడుతోంది. లక్ష్యం ఒకటే ఆర్థికంగా బలపడకుండా విదేశాంగంలో నిజమైన స్వేచ్ఛ సాధ్యం కాదు. భారత్‌కు ఇది అవకాశమూ, పరీక్షా సమయమూ. అమెరికా, రష్యా, యూరప్‌తో సమాంతర సంబంధాలను కొనసాగిస్తూ జాతీయ ప్రయోజనాలకు అనుగుణంగా భాగస్వామ్యాలను ఎంచుకునే సామర్థ్యం భారత్‌కు ఉంది. భారీ దేశీయ మార్కెట్, మానవ వనరులు, హిందూ మహాసముద్రంలో వ్యూహాత్మక స్థానం కూడా అదనపు బలాలు. కానీ ఈ దౌత్య వెసులుబాటు వెనుక బలమైన ఆర్థిక, పారిశ్రామిక పునాది ఉండాలి. సెమీకండక్టర్లు, రక్షణ పరికరాలు, కీలక పారిశ్రామిక భాగాలు, ఇంధనం వంటి రంగాల్లో అధిక విదేశీ ఆధారపడటం కొనసాగితే దౌత్య స్వేచ్ఛకు పరిమితులు తప్పవు. ఈ పరిణామాల్లో చిన్న, మధ్యతరహా దేశాలు అత్యంత ప్రమాదకర స్థితిలో ఉన్నాయి. మహాశక్తులు సరఫరాదారులను లేదా మార్కెట్లను మార్చుకునే సామర్థ్యం కొంతవరకు కలిగి ఉంటాయి. చిన్నదేశాలకు అది ఉండకపోవచ్చు. ప్రపంచం ఆర్థిక కూటములుగా విడిపోతే, మహాశక్తుల మధ్య పోటీలో ప్రత్యక్షపాత్ర లేని దేశాలే ఆంక్షలు, ధరలపెరుగుదల, సరఫరా అంతరాయాల భారాన్ని ఎక్కువగా మోయాల్సి రావచ్చు. అందుకే ప్రపంచానికి ఇప్పుడు అవసరమైనది సంపూర్ణ విభజన కాదు, సురక్షితమైన పరస్పర ఆధారపడటం. కీలక సాంకేతికతలు, మౌలిక వసతులను రక్షించుకోవడం అవసరమే. కానీ ప్రతి దేశం రాజకీయ భద్రత పేరుతో మార్కెట్లను మూసివేసి, సరఫరా గొలుసులను విడదీస్తే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మరింత ఖరీదైనదిగా, అసమర్థమైనదిగా మారుతుంది. భౌగోళిక రాజకీయ పోటీని ఆపడం సాధ్యం కాకపోవచ్చు. కానీ ఆ పోటీ ప్రపంచ ఆర్థిక అనుసంధానాన్ని పూర్తిగాధ్వంసం చేయకుండా చూడటంమాత్రం సాధ్యమే. పరస్పర ఆధారపడటం యుద్ధానికి అడ్డుకట్ట వేయగల ఏకైక హామీ కాకపోయినా, దాని ధరను పెంచుతుంది. అదే సమయంలో విభజనకు బదులుగా సహకారానికి ఆర్థిక విలువను కొనసాగిస్తుంది. రాబోయే ప్రపంచ క్రమాన్ని సైనిక కూటములు మాత్రమే నిర్ణయించవు. ఎవరి వద్ద కీలక సాంకేతికత ఉంది? ఎవరు ఇంధనాన్ని, ముడి సరుకును, సరఫరా గొలుసులను నియంత్రిస్తున్నారు? ఎవరి ఆర్థిక నెట్‌వర్క్‌పై ప్రపంచ మార్కెట్లు ఆధారపడుతున్నాయి? ఇతరుల ఆధారపడటాన్ని ఎవరు వ్యూహాత్మక ప్రభావంగా మార్చగలరు? ఈ ప్రశ్నలే భవిష్యత్ శక్తి సమీకరణాలను నిర్ణయించనున్నాయి. కొత్త భౌగోళిక రాజకీయాల్లో భూభాగాన్ని ఆక్రమించడం కంటే, ఇతరుల ఆధారపడటాన్ని నియంత్రించడమే అసలైన శక్తి. ●

# వృద్ధాప్యం భారమా! బాధ్యతా?

డాక్టర్ మోటె చిరంజీవి

వృద్ధులు కుటుంబానికి భారం కాదు, తరాలకు బలం. ఒకప్పుడు ఇంట్లో తాతయ్య, నానమ్మ ఉంటే ఆ కుటుంబానికే ఒక ప్రత్యేక గౌరవం ఉండేది. వారి మాటకు విలువ, అనుభవానికి ప్రాధాన్యం ఉండేది. పండుగలు, పర్వదినాలు, ఆచారాలు, కుటుంబ విలువలు ఒక తరం నుంచి మరోతరానికి చేరేది వారి ద్వారానే. కానీ మారుతున్న జీవనశైలి, పట్టణీకరణ, ఉద్యోగ అవసరాలు, ఉమ్మడి కుటుంబ వ్యవస్థ క్షీణించడం వంటి పరిణామాలతోవృద్ధుల పరిస్థితి క్రమంగా మారుతోంది. భారతీయ సంస్కృతిలో 'మాతృదేవోభవ.. పితృదేవోభవ అనే భావనకు ఎంతో ప్రాధాన్యం ఉంది. తల్లిదండ్రులను దేవుళ్లుగా భావించిన సమాజంలోనే నేడు కొందరు వృద్ధులు ఒంటరితనం, నిర్లక్ష్యం, ఆర్థిక అసురక్షిత పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. కుటుంబ సభ్యులు ఉన్నప్పటికీ మాట్లాడేవారు లేకపోవడం, ఆరోగ్య సమస్యల సమయంలో తోడుండేవారు లేకపోవడం మరింత బాధాకరం. భారతదేశంలో వృద్ధుల సంఖ్య వేగంగా పెరుగుతోంది. 2023లో యుఎన్ఎఫ్‌పిఎ విడుదల చేసిన నివేదిక ప్రకారం 60 ఏళ్ల పైబడిన వారి సంఖ్య సుమారు 15.3 కోట్లు ఉండగా, 2050 నాటికి అది 34.7 కోట్లకు చేరవచ్చని అంచనా. వృద్ధుల్లో సుమారు 40 శాతం అత్యల్ప సంపద వర్గంలో ఉండటం, దాదాపు ఐదో వంతు మందికి సొంత ఆదాయం లేకపోవడం వారి ఆర్థిక భద్రతపై ప్రశ్నలను లేవనెత్తుతోంది. ప్రపంచ పరిస్థితి కూడా ఆందోళనకరమే. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం సమాజంలో నివసిస్తున్న 60ఏళ్ల పైబడిన వారిలోదాదాపు



ప్రతి ఆరుగురిలో ఒకరు గత ఏడాదిలో ఏదో ఒక రూపంలో వేధింపులకు గురైనట్లు అంచనాలు చెబుతున్నాయి. వృద్ధాశ్రమాలు, దీర్ఘకాలిక సంరక్షణ సంస్థల్లోనూ దుర్వినియోగం నమోదవుతున్నట్లు డబ్ల్యుహెచ్ఓ పేర్కొంది. ఇలాంటి పరిస్థితుల్లో వృద్ధాశ్రమాలు అవసరమైన ఆశ్రయాలుగా మారుతున్నాయి. అయితే వృద్ధాశ్రమం కుటుంబానికి ప్రత్యామ్నాయం కాకూడదు. నిజంగా అవసరమైన వారికి అవి భద్రత, వైద్యం, ఆహారం, మానవీయ సహకారం అందించే కేంద్రాలుగా ఉండాలి. అదే సమయంలో కుటుంబాలు తమ బాధ్యత నుంచి తప్పించుకునే మార్గంగా వాటిని చూడకూడదు. వృద్ధుల పట్ల నిర్లక్ష్యం కేవలం వ్యక్తిగత సమస్య కాదు. అది సామాజిక విలువలసమస్య. తెలంగాణలోనూ వృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వ చర్యలు కొనసాగుతున్నాయి. రాష్ట్ర అధికారిక గణాంకాల ప్రకారం 2026 సెప్టెంబర్ నాటికి 16.36 లక్షలకు పైగా వృద్ధాప్య పింఛన్లు నమోదయ్యాయి. వృద్ధులకు వైద్య సేవలు అందించేందుకు రాష్ట్రవ్యాప్తంగా 17మొబైల్ మెడికేర్‌యూనిట్లు పనిచేస్తున్నట్లు ప్రభుత్వం వెల్లడిస్తోంది. అయితే పింఛను, వైద్యం మాత్రమే వృద్ధాప్య భద్రతకు సరిపోవు. వారికి కావాల్సింది ఆత్మీయత, గౌరవం, సంభాషణ, నిర్ణయాల్లో భాగస్వామ్యం. వారానికి ఒకసారి తల్లిదండ్రులతో మాట్లాడటం, వారి ఆరోగ్యాన్ని తెలుసుకోవడం, పండుగలను కలిసి జరుపుకోవడం వంటి చిన్న చర్యలే వారి జీవితాల్లో పెద్ద మార్పును తీసుకురాగలవు. నేడు మనం వారిని ఎలా చూసుకుంటామో రేపు మన వృద్ధాప్యంలో సమాజం మనల్ని ఎలా చూడాలో అదే ప్రమాణంగా నిలుస్తుంది. వృద్ధాశ్రమాలు పెరగడం కంటే వృద్ధుల పట్ల ఆప్యాయత పెరగాలి. అదే భారతీయ సంస్కృతికి నిజమైన గౌరవం. ●

# ఏకోపాధ్యాయ బడుల ప్రమాణాలు పెంచాలి

మల్లాడి శ్రీనగేష్

ఏకోపాధ్యాయ పాఠశాలల్లో, 5 తరగతులు, 18 సబ్జెక్టులు, సుమారు 250కి పైగా పాఠాలు, 800పీరియడ్లు, 200 పనిదినాలలో సుమారు 180 బోధనా రోజులు, నీతి ఆయోగ్ చెప్పినట్టు 14శాతం బోధనేతర పనులు, కాంప్లెక్స్. సమావేశాలు, అడ్మినిస్ట్రేటివ్ బాధ్యతలు ఇవన్నీ ఏకపాధ్యాయుని ప్రతి పాఠశాల దిన చర్య బహుళ తరగతి, బహుభాషా నేపథ్యాల విద్యార్థులు, వివిధ స్థాయి విద్యా సామర్థ్యాల విద్యార్థులు, రెండు మాధ్యమాలు ఇలా లెక్కిస్తే ఏకోపాధ్యాయ పాఠశాలల ఉపాధ్యాయుల, మానసిక ఒత్తిడి, బోధనలో ఎదురౌతున్న సమస్యలు వర్ణనాతీతం. మరొకవైపు తక్కువ మంది పిల్లలు 5 శాతం లేదా 10 శాతం కావొచ్చు. వారిలో ఎంతమంది ప్రతి రోజూ పాఠశాలకు వస్తారో తెలియని అనిచ్ఛితి. పిల్లలతో కళకళలాడాల్సిన ప్రాంగణంలో ఉపాధ్యాయులకు పిల్లలకు ఒక నిశ్శబ్ద వాతావరణం, ఆటలు, పాటలు, వినోదం కొరవడిన ఒక నిర్లిప్తత. ఒకే ఉపాధ్యాయుడు సవ్యసాచిలా ప్రధానోపాధ్యాయుడుగా, సబ్జెక్టు బోధకుడుగా, సమయ పాలకుడిగా బహుళ తరగతులు, అకడమిక్ బాధ్యతలు. దీనికి తోడు ఉదయం ఉపాహార, మధ్యాహ్న భోజన నిర్వహణ, స్టాక్ నమోదు, రిపోర్టుల తయారీ, ప్రాంగణంలో శుచి శుభ్రతలపై జవాబుదారీతనం, తలిదండ్రులకు, అధికారులకు, ప్రభుత్వానికి ఒకే ఒక్కరు అన్నట్టు తనే జవాబుదారు. అయితే వర్క్ ఎడ్జెస్టుమెంట్ ప్రాతిపదికన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో అదనపు ఉపాధ్యాయులను నియమించినట్లు, బహుళ తరగతి బోధనకై మాడ్యూల్ రుపొంచింది ప్రత్యేక శిక్షణ అందించినట్లు, ఈ లోటును చాలా రాష్ట్రాలు భర్తీ చేస్తున్నట్టు తెలుస్తోంది. అయితే పదిమంది లేదా తక్కువ నమోదు వున్న పాఠశాలల పరిస్థితిని పునఃసమీక్షించాల్సిన అవసరం, ఒక శాశ్వత పరిష్కారానికి కార్యాచరణ రూపొందించడం తప్పనిసరి. దేశంలో యూ డైస్ 2025-26 ప్రకారం ఏకోపాధ్యాయ పాఠశాలలు 1.00,843 లక్షలు ఉండంగా ఆ బడుల్లో 29.14 లక్షల మంది పిల్లలు చదువుతున్నట్టు, వీరిలో 27.7 శాతం మంది గిరిజన, షెడ్యూల్ కులాలకు చెందిన పిల్లలు చదువుతున్నారు. ఈ పాఠశాలలు 89శాతం గిరిజన, గ్రామీణ ప్రాంతాల్లోనే ఉన్నట్లు నీతి ఆయోగ్ నివేదిక వెల్లడించింది. నీతి ఆయోగ్ డైస్ నివేదిక ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో 4793 అనగా 11.5 శాతం ఏకోపాధ్యాయ పాఠశాలలుండగా, 30మంది కన్నా తక్కువ విద్యార్థులు ఉన్న పాఠశాలలు 60శాతం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అధికంగా 16,357 పాఠశాలలు అనగా 26.9, దేశంలో అత్యధిక శాతం ఏకోపాధ్యాయ పాఠశాలలున్న రాష్ట్రంగా ప్రథమ స్థానంలో ఉండగా తెలంగాణ రాష్ట్రం తక్కువ శాతం ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నట్టు తెలుస్తోంది. ఉత్తరప్రదేశ్‌లో 7,874, జార్ఖండ్ 9827, మహారాష్ట్ర 9269, కర్ణాటక 8042, వెస్ట్ బెంగాల్ 6769, రాజస్థాన్ 6200 ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నట్టు నివేదిక. ఒకే ఉపాధ్యాయుడితో పాఠశాలలు నడుస్తుంటే ప్రభుత్వ పాఠశాలలపై ఆధారపడి చదువుతున్న బడుగు బలహీన వర్గాల పిల్లల విద్యా హక్కు ఎలా? సబ్జెక్టు



బోధించే ఉపాధ్యాయులు లేక, ఒక ఉపాధ్యాయుడు ఇటు పాఠాలు, పరిపాలన, పాఠశాలేతర బాధ్యతలు నిర్వహిస్తుంటే బాలల భవిష్యత్తు ఎలా నిర్మించబడుతుందని నిపుణులు వాపోతాన్నారు. బహుళ తరగతులు, బహు భాష, విభిన్న స్థాయి విద్యా సామర్థ్యాలు, పాఠశాలలో ఒక్కరున్నా ఇద్దరు పిల్లలున్నా సంఖ్యప్రతిపాదికను పరిగణించకుండా, నాణ్యమైన చదువు అందుబాటులో తేవడం ప్రభుత్వ ప్రధాన కర్తవ్యం. తరగతి గదిలో 20 మందిలో 10 మంది బాగా రాణిస్తుంటే వారే మన టార్గెట్ అనుకుంటే సాధించాల్సిన సమ్మిళిత విద్యకు అన్యాయం జరిగినట్టే. ఎవరైతే అభ్యసనా సామర్థ్యాలను సాధించలేక వెనుకబడి ఉన్నారో, తరగతి గదిలో అందరితో బాటు వారిని తీర్చిదిద్దడం విద్యా విధాన ప్రధాన లక్ష్యం. తక్కువ నమోదు. ఏకోపాధ్యాయ పాఠశాలలపై ప్రత్యేక శ్రద్ధ కనబరచకపోతే బాలల విద్యా హక్కులకు విఘాతం కలిగినట్టే. ఈ పరిస్థితిని విశ్లేషిస్తే మారుమూల గిరిజన ప్రాంతాల్లో బహుభాషా విషవలయంలో చిక్కుకున్న విద్యార్థుల పరిస్థితి మరింత జఠిలంగా ఉంటుందనేది నిత్య సత్యం. ఎక్కువ శాతం గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లోనే ఈ తరహా పాఠశాలలు ఉన్నట్టు గణాంకాలు తెల్పుతున్నాయి. మధ్యాహ్న భోజనం, పుస్తకాలు, దుస్తులు వంటి ఉచితాలు కన్నా నాణ్యమైన విద్యను అందించి ప్రతి పిల్లవాడిని ప్రయోజకుడిగా ఉత్తమ పౌరుడిగా తీర్చి దిద్దడం ప్రధాన లక్ష్యం. తక్కువ నమోదు, ఏకోపాధ్యాయుని పాఠ్య బోధన, అరకొర సదుపాయాలు, అలవికాని బోధనా వ్యూహాలువెరసి ప్రభుత్వ పాఠశాలపై నమ్మకం సన్నగిల్లి ఉన్న పిల్లల్ని దగ్గరలో వున్న ప్రైవేట్ బడుల్లో చేరుస్తున్నారు లేదాబడి మానిపించేసి పనుల్లో పెడుతున్నారు. ఏకోపాధ్యాయులు ప్రయత్నించినా సహ ఉపాధ్యాయులు కనీసం సబ్జెక్టు వరంగా లేక ఫలితం శున్యమే అవుతుంది. ఈ పరిస్థితిలో వున్న పాఠశాలలు దగ్గర్లో ఉన్న పాఠశాలలతో విలీనం చెయ్యాలీ అంటే విద్యా హక్కు నిబంధనలను ఉల్లంఘించినట్టే ! లేక నమోదు పెంచాలంటే ఒక స్పష్టమైన దీర్ఘకాలిక ప్రణాళిక, కార్యాచరణ అనివార్యం, దానికంటే ముందు ప్రస్తుత పాఠశాలలో వున్న కొద్దిపాటి విద్యార్థుల ప్రగతి పురోగమిస్తేనే తల్లిదండ్రులకు నమ్మకం కలుగుతుంది. ఏకోపాధ్యాయ పాఠశాలల పిల్లల ప్రగతి స్పష్టంగా కనబడితేనే ఎక్కువ మంది పిల్లలు చేరడానికి దోహదపడుతుంది. అందుకు ఉన్న అవకాశాలను ఉపయోగించుకొని వినూత్న వ్యూహాలతో ప్రతి విద్యార్థి ప్రగతి, అభ్యసనా సామర్థ్యాలను మెరుగుపరిస్తే పాఠశాల తానంతట తానే విద్యార్థులను ఆకట్టుకుంటుంది. సరిపడినన్ని తరగతి గదులు ఉన్నా లేకున్నా ఉన్న తరగతి గదులను పాఠశాలను చక్కటి రంగులతో, కాన్సెప్ట్ పెయింటింగ్ ద్వారా మౌలిక వసతుల మెరుగుదలతో సుందరికీరించాలి. నీరు, పారిశుధ్య వసతులు, తాగు నీటి సరఫరాలను మెరుగుపరచాలి. బాలికలకు ప్రత్యేక వసతులు కల్పించడం ద్వారా వైల్డ్‌ఫ్రెండ్లీ వాతావరణాన్ని ఏర్పరచాలి. పాఠశాల యాజమాన్య కమిటీలను నిరంతర సమావేశాలతోవారి భాగస్వామ్యాన్ని బలోపేతం చెయ్యాలి. చదువుతోపాటు క్రీడల పట్ల శ్రద్ధవహించి ప్రోత్సహించాలి. ముఖ్యమైన పండుగ దినాలను పాఠశాల ప్రాంగణంలో వేడుకలను నిర్వహించి తల్లిదండ్రుల భాగస్వామ్యాన్ని బలపరచాలి. ఒక విద్యార్థిని బడికి చేర్చడానికి జపాన్ ప్రభుత్వం బులెట్ ట్రైన్‌కు క్యుషిర్ టాకీస్టేషన్ వద్ద స్టాప్ ఏర్పరచి తన బాధ్యతను చాటుకున్న ఉదాహరణలను మనం తీసుకోవడం తప్పని సరి. ఫిన్లాండ్ మాదిరి సులభంగా బోధించేలా స్థానికతను జోడిస్తూప్రత్యేక కరికులంను రచించుకొనే ప్రతిపత్తిని ఏకోపాధ్యాయ పాఠశాలకు కల్పిస్తేశాశ్వత పరిష్కారంలభిస్తుందేమో యోచించాలి. ●



# ప్రజల ఆశీస్సులతోనే ఈ జర్నీ

## దేశంలోని ప్రతిపౌరునికి నాపై గొప్ప హక్కు ఉంది

## విజయ్‌సంకల్ప్ సభలో ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, అక్టోబరు 7:** ప్రభుత్వాధినేతగా తాను నిరంతరాయంగా 25 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశ ప్రజలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకమే తనకు అతిపెద్ద బాధ్యత అని, తనపై ఈ దేశంలోని ప్రతి పౌరుడికీ గొప్ప హక్కు ఉందని ఆయన అన్నారు. నేడు ఢిల్లీలో జరిగిన వికసిత్ భారత్ సంకల్ప్ సభలో పాల్గొన్న మోడీ, ఈ చారిత్రక మైలురాయి సందర్భంగా ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రధాని మోడీకి ప్రజలు ఘన స్వాగతం పలికారు. పూలు చల్లుతూ, బీజేపీ జెండాలు ఊపుతూ భారత్ మాతా కీ జై, స్వాగత్ హై భాయ్ స్వాగత్ హై, మోడీజీ కా స్వాగత్ హై అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. చాలామంది ఈ దృశ్యాలను తమ ఫోన్లలో బంధించేందుకు ఉత్సాహం చూపారు. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ "2001 అక్టోబర్ 7న గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినప్పుడు, ఎప్పటికైనా ఈ మైలు రాయిని చేరుకుంటానని అస్సలు ఊహించలేదు. ఇది ప్రజల నిరంతర ఆశీర్వాదానికి నిదర్శనం. ప్రజాస్వామ్యంపై అపారమైన విశ్వాసం ఉన్న భారతీయ జనతా పార్టీ, ఎన్డీఏ, ఇతర రాజకీయ సహచరులందరికీ నా కృతజ్ఞతలు. దేశ ప్రజలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను. అసెంబ్లీ లేదా లోక్‌సభ ఎన్నికలు ఏవైనా, గత 25 ఏళ్లుగా ప్రజలు నన్ను తమ సేవకుడిగా ఎంచుకున్నారని తెలిపారు. నాకు ప్రజలే దైవ స్వరూపం. లక్షలాది మంది దేశప్రజల నమ్మకం, కార్యకర్తల కష్టమే నాకు ఎప్పటికీ అతిపెద్ద బలం. ఈ దేశం నాకు ఎంతో ఇచ్చింది. అందుకే దేశం పట్ల నా బాధ్యత కూడా అతిపెద్దది. నాపై ఈ దేశంలోని ప్రతి పౌరుడికీ గొప్ప హక్కు ఉందని నేను మన స్ఫూర్తిగా నమ్ముతున్నానని మోడీ భావోద్వేగంగా ప్రసంగించారు. ఈ 25 ఏళ్ల ప్రస్థానం పూర్తయిన సందర్భంగా ఈరోజు ఉదయం ఢిల్లీలోని సరోజినీ నగర్‌లో ఉన్న వినాయక మందిరాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేసినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న తన కుటుంబ సభ్యుల (ప్రజల) సంతోషం, శ్రేయస్సు, ఆరోగ్యం కోసం ప్రార్థించినట్లు ఆయన వివరించారు. 2001 అక్టోబర్ 7న కేశూభాయ్ పటేల్ స్థానంలో నరేంద్ర మోడీ గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. వినాశకరమైన భూజ్ భూకంపం అనంతర పరిణామాలు, రాజకీయ, పరిపాలనాపరమైన సవాళ్లతో రాష్ట్రం సతమతమవుతున్న క్లిష్ట సమయంలో ఆయన ఆ పదవిని అలంకరించారు. 2014 వరకు ముఖ్యమంత్రిగా కొనసాగి, ఆ తర్వాత జాతీయ రాజకీయాల్లోకి ప్రవేశించి మూడుసార్లు ప్రధానమంత్రిగా ఎన్నికయ్యారు. ప్రధానమంత్రిగా మోడీ హయాంలో అంతర్జాతీయంగా భారత్‌కు గుర్తింపు గణనీయంగా పెరిగింది. ప్రభుత్వం దౌత్యపరమైన సంబంధాలను బలోపేతం చేయడం, ప్రపంచంలోని ప్రధాన దేశాలతో స్నేహపూర్వక సంబంధాలను కొనసాగించడం, గ్లోబల్ సౌత్ దేశాలకు భారత్‌ను కీలక గొంతుకగా నిలబెట్టడంలో ప్రత్యేక చొరవ తీసుకుంది.

## మోడీ జీవితంలో చిరస్మరణీయం అక్టోబరు 7



**న్యూఢిల్లీ,అక్టోబరు 7:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జీవితంలో అక్టోబర్ 7 చిరస్మరణీయంగా మిగిలిపోనుంది. సరిగ్గా పాతికేళ్ల కిందట అంటే 2001 అక్టోబర్ 7వ తేదీన ఆయన ప్రజా జీవితంలో అడుగు పెట్టారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఏకధాటిగా ప్రజా జీవితంలోనే కొనసాగుతున్నారు. అప్పుడా రాష్ట్ర ముఖ్యమంత్రిగా, ఇప్పుడు ప్రధానమంత్రిగా దేశానికి సేవలు అందిస్తూనే వస్తోన్నారు. ముఖ్యమంత్రిగా గానీ, ప్రధానిగా గానీ ఈ 25 సంవత్సరాల్లో ఒక్క రోజు కూడా విరామం రాలేదు. ఈ నేపథ్యంలో ప్రధాని మోడీ కొద్దిసేపటి కిందటే వినాయకుడి ఆలయానికి వెళ్లారు. 140 కోట్లమంది దేశ ప్రజల ప్రతినిధిగా ప్రత్యేక పూజలు చేశారు. శివలింగాన్నిఅభిషేకించారు. నవగ్రహ ప్రదక్షిణం చేశారు. సుమారు 40 నిమిషాల పాటు దైవచింతనలో మునిగిపోయారు. దేశ క్షేమాన్ని కాంక్షించారు. ఢిల్లీ సరోజినీ నగర్ లో ఉంటుందీ ఆలయం. ఈ ప్రత్యేక సందర్భాన్ని వేడుకగా జరుపుకొంటోంది భారతీయ జనతా పార్టీ. ఆ పార్టీకి చెందిన నాయకులు ప్రధాని మోడీ పేరిట దేశవ్యాప్తంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తోన్నారు. ప్రధాని మోడీ ఆయురారోగ్యాలతో జీవించాలని ప్రార్థిస్తోన్నారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ తో మోడీ రాజకీయ జీవితం ఆరంభమైంది. ఆ తర్వాత గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలను స్వీకరించారు. 2014 మే 22వ తేదీ వరకు ఆ పదవిలో కొనసాగారు. దాదాపు 12 సంవత్సరాల పాటు నిరాటంకంగా పరిపాలన చేశారు. ఆ కాలంలో రాజ్ కోట్ వెస్ట్, మణినగర్ నియోజకవర్గాలకు ప్రాతినిథ్యాన్ని వహించారు. రాజ్ కోట్ వెస్ట నుంచి ఒకసారి, మణినగర్ నుంచి వరుసగా నాలుగుసార్లు అసెంబ్లీకి ఎన్నికయ్యారు. బీజేపీ ప్రధానమంత్రి అభ్యర్థిగా 2014 నాటి సార్వత్రిక ఎన్నికల్లో తెరమీదికి వచ్చారు. ప్రచార బాధ్యతలను భుజనవేసుకున్నారు. బీజేపీని బంపర్ మెజారిటీతో గెలిపించారు. అదే ఏడాది మే 26వ తేదీన ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేశారు. అప్పటి నుంచి ఇప్పటివరకు నిరంతరాయంగా ఆ పదవిలో కొనసాగుతున్నారు. సుదీర్ఘకాలం ప్రధానిగా పని చేసిన వారి జాబితాలో మూడో స్థానంలో కొనసాగుతున్నారాయన. 16 సంవత్సరాల 286 రోజుల పాలనతో జవహర్ లాల్ నెహ్రూ అగ్రస్థానంలో ఉన్నారు. 15 సంవత్సరాల 350 రోజులతో ఇందిరాగాంధీ రెండోస్థానంలో ఉన్నారు. ప్రజా జీవితంలో మోడీ 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా గతనెల 17న ఆయన పుట్టినరోజున ప్రారంభించిన నెల రోజుల సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమం ద్వారా బీజేపీ పలు సామాజిక కార్యక్రమాలను నిర్వహించింది. దేశవ్యాప్తంగా రక్తదాన శిబిరాలు, పరిశుభ్రతా కార్యక్రమాలు, సంక్షేమ అవగాహన కార్యక్రమాలు, ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఇతర ప్రజా సేవా కార్యక్రమాలను చేపట్టారు ఆ పార్టీ నాయకులు. టార్చ్ మార్చ్‌లు, బైక్/సైకిల్ ర్యాలీలను నిర్వహించారు.

## సాధించి తీరాలనే సంకల్పమే దేశ ముఖ చిత్రాన్ని మార్చింది: ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, అక్టోబరు 7:** తాను అధికార బాధ్యతలు చేపట్టేటప్పుడు ఏది ఏమైనా సాధించి తీరాలి అనే దృఢ సంకల్పం తీసుకున్నానని, ఈరోజు దేశ ముఖచిత్రమే మారిపోయిందని ప్రధాని మోడీ సంతోషం వ్యక్తం చేశారు. గతంలో ఏదైనా చిన్న సంక్షోభం వస్తేనే భారత ఆర్థిక వ్యవస్థ కుదేలైపోయేదని, కానీ ఈ రోజు ఏ సంక్షోభం వచ్చినా భారత్ చూపిస్తున్న సామర్థ్యం గురించి ప్రపంచమంతా చర్చించుకుంటోందని గుర్తు చేశారు. ఒకప్పుడు దేశంలో నిర్ణయాలు తీసుకోలేని పరిస్థితిని పాలసీ పారాలిసిస్ అని విమర్శించేవారని, కానీ నేడు దేశంలో "రిఫార్మ్ ఎక్స్‌ప్రెస్ పరిగెడుతోందని తెలిపారు. పూర్వపు రోజుల్లో విదేశాల నుంచి దిగుమతులు (ఇంపోర్ట్) పెంచుకోవడానికి మార్గాలు వెతికేవారని, కానీ ఈ రోజు భారత్ స్వయంగా ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి (ఎక్స్‌పోర్ట్) చేస్తోందని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రజా సేవలో విజయవంతంగా 25 ఏళ్లు పూర్తి చేసుకున్నారు. ఈ చారిత్రాత్మక సందర్భాన్ని పురస్కరించుకుని ఆయన వికసిత్ భారత్ సంకల్ప్ సభలో మాటాడారు. ఈ సందర్భంగా 2014 కంటే ముందు దేశం ఉన్న పరిస్థితిని గుర్తుచేస్తూ.. ఆ రోజుల్లో ద్రవ్యోల్బణాన్ని అందరూ చేతులెత్తేసిన వ్యవహారం అని అనుకునేవారని అన్నారు. అప్పట్లో దేశానికి ఒక కొత్త ఉత్సాహం, కొత్త శక్తి అత్యవసరంగా కావాల్సి వచ్చిందని చెప్పారు. వ్యవసాయ రంగంలో వచ్చిన విప్లవాత్మక మార్పుల గురించి కూడా ప్రధాని మోడీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి చూసుకుంటే.. 2015 నుంచి 2025 మధ్య ఉన్న ఈ దశాబ్ద కాలం వ్యవసాయ రంగంలో పాత రికార్డులన్నింటినీ తిరగరాసి సరికొత్త రికార్డులను సృష్టించిందని అన్నారు. మన ఆలోచన, ఉద్దేశం స్పష్టంగా ఉండి (నియ్యత్ సాఫ్), విధానాలు నిఖార్సుగా ఉన్నప్పుడే (నీతి స్పష్ట్) ఇది సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. "సబ్ కా సాత్, సబ్ కా వికాస్ అనేది మంచి పాలనకు మూలస్తంభమని, అయితే దేశాన్ని చాలా కాలం పాటు కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే విడదీస్తూ వచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక భారత్ ఎక్కడా తగ్గేదే లేదని, అసలు ఆగేదే లేదని మోడీ ధీమా వ్యక్తం చేశారు.

మన దేశ ప్రాచీన వైభవాన్ని గుర్తుచేస్తూ ఒకప్పుడు భారత్ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలన్నింటికీ నాయకత్వం వహించేదని, అయితే విదేశీ దోపిడీదారుల పాలనలో దేశాన్ని దారుణంగా దోచుకున్నారని అన్నారు. ప్రపంచానికే మార్గదర్శనం చేసిన మన దేశంలో ఉన్న గొప్ప గ్రంథాలయాలను కూడా తగలబెట్టారని ఆవేదన చెందారు. ఈ సందర్భంగా స్వామి వివేకానందను గుర్తు చేసుకుంటూ ఏదో ఒక రోజు ఒక గొప్ప భారత్ పుట్టుకొస్తుందని వివేకానంద చెప్పిన మాటలను ప్రస్తావించారు.

## 'పశ్చిమ బంగ'గా బెంగాల్

### త్వరలో పేరు మార్చుతున్నట్లు ప్రకటించిన బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు



**కోల్‌కత్తా, అక్టోబరు 7:** పశ్చిమ బెంగాల్ పేరు మారబోతుంది. ఈ మేరకు రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సమిక్ భట్టాచార్య కీలక ప్రకటన చేశారు. పశ్చిమ బెంగాల్ పేరును పశ్చిమ బంగాగా మార్చనున్నట్లు తెలిపారు. రాష్ట్ర చారిత్రక గుర్తింపును ప్రతిబింబించేలా పేరును మార్చాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. త్వరలోనే అసెంబ్లీలో దీనికి సంబంధించిన బిల్లును ప్రవేశపెడతామని చెప్పారు. బుధవారం మీడియాతో మాట్లాడిన సమిక్ భట్టాచార్య ఇంకెన్ని సార్లు చెప్పాలి రాష్ట్రం పేరు పశ్చిమ బంగాగానే ఉంటుందని స్పష్టం చేశారు. రాష్ట్ర పేరును పశ్చిమ బంగాగా మార్చే ప్రక్రియ త్వరలో ప్రారంభమవుతుందని వెల్లడించారు. ఇకపై పశ్చిమ బంగ్లా, బంగ్లా, బంగా వంటి పేర్లను ఉపయోగించాల్సిన అవసరం ఉండదని అన్నారు. ఇకపై మీరు "పశ్చిమ బంగ్లా, బంగ్లా, బంగా వంటి పేర్లను వినాల్సిన అవసరం ఉండదు. పశ్చిమ బంగా రాబోతోందని వ్యాఖ్యానించారు. రాష్ట్ర చరిత్రతో దాని పేరుకు ఉన్న అనుబంధాన్ని కొనసాగించేలా అసెంబ్లీలో బిల్లును తీసుకురానున్నట్లు తెలిపారు. చాలా త్వరలోనే మా ప్రభుత్వం తొలి అసెంబ్లీ సమావేశంలోనే ఒక బిల్లును ప్రవేశ పెడుతుంది. ఈ రాష్ట్ర పేరు, రాష్ట్ర చరిత్రతో అంతర్గతంగా అనుసంధానమై ఉండేలా చూస్తాం. అదే రాష్ట్ర గుర్తింపుగా ఉంటుంది. అందుకే రాష్ట్రానికి పశ్చిమ బంగా అనే పేరు పెట్టబోతున్నాం అని సమిక్ భట్టాచార్య చెప్పారు. ప్రభుత్వాధినేతగా ప్రధాని మోడీ 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా చేసిన ప్రసంగంపై కూడా సమిక్ భట్టాచార్య స్పందించారు. మోడీ ప్రసంగాన్ని ప్రశంసించారు.

దేశంలోని అన్ని పరిపాలనా జిల్లాల్లో బీజేపీ కార్యకర్తలు, పార్టీ శ్రేయోభిలాషులు, ప్రభుత్వ అధికారులు సమావేశమై ప్రధాని ప్రసంగాన్ని విన్నారని తెలిపారు.

25 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ ప్రయాణం తర్వాత కూడా తన జీవితం దేశానికే అంకితమని మోడీ చెప్పారని పేర్కొన్నారు.

## నైరుతి పూర్తి.. శీతలగాలులు షురూ!

**న్యూఢిల్లీ, అక్టోబరు 7:** దేశవ్యాప్తంగా వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. నైరుతి రుతుపవనాలు దేశం నుంచి తిరోగమనం పూర్తైన వేళ, ఒకేసారి పలు ప్రాంతాల్లో రకరకాల వాతావరణ వ్యవస్థలు చురుగ్గా మారాయి. పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఆగ్నేయ ఉత్తర ప్రదేశ్, అరేబియా సముద్రంతో పాటు కేరళ పరిసరాల్లో ఏర్పడిన వాయుగుండాల ప్రభావంతో నేడు దేశంలోని పలు రాష్ట్రాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. కొన్ని చోట్ల ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరించారు. ఉత్తర భారతదేశంలో వెస్ట్రన్ డిస్టర్బెన్స్ ప్రభావం తీవ్రంగా ఉంది. దీనికారణంగా జమ్మూ కశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లోని ఎత్తైన ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలతో పాటు హిమపాతం కురిసే అవకాశం ఉంది. జమ్మూ కశ్మీర్‌లో గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉండగా, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ ప్రాంతాల్లో 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు విజృంభించే అవకాశం ఉంది.

అటు పంజాబ్, హర్యానా, పశ్చిమ ఉత్తర ప్రదేశ్ మైదాన ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు కురిసే అవకాశం ఉంది. మరోవైపు ఆగ్నేయ ఉత్తర ప్రదేశ్, ఈశాన్య మధ్యప్రదేశ్ పరిసర ప్రాంతాలలో వాతావరణ మార్పుల వల్ల భారీ వర్షాలు పడే అవకాశం ఉంది. బీహార్, సిక్కిం రాష్ట్రాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడతాయని ఐఎండీ తెలిపింది. ఈశాన్య రాష్ట్రాలైన నాగాలాండ్, మణిపూర్ ప్రాంతాలకు వాతావరణ శాఖ భారీ వర్ష హెచ్చరికలు జారీ చేసింది. ఈ తీవ్రమైన వాతావరణ పరిస్థితులు ఈనెల 8 వరకు కొనసాగే అవకాశం కనిపిస్తోంది. దక్షి ణ భారతదేశంలోనూ వాతావరణం మేఘావృతమై ఉండి వర్షాలు పడే సూచనలు స్పష్టంగా ఉన్నాయి.

## ఇరాన్‌యుద్ధంతో అమెరికాకు రూ.31వేల కోట్లునష్టం

**వాషింగ్టన్, అక్టోబరు 7:** ఇరాన్‌కు వ్యతిరేకంగా అమెరికా చేపట్టిన సైనిక చర్యల్లో ఆ దేశానికి భారీగా వైమానిక నష్టం వాటిల్లుతోంది. ఈ ఏడాది ఫిబ్రవరి 28న ప్రారంభమైన ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీలో ఇప్పటివరకు కనీసం 81 అమెరికా యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు, మానవ రహిత డ్రోన్లు (యూఏవీ) ధ్వంసం కావడం లేదా దెబ్బతినడం జరిగిందని అమెరికా కాంగ్రెషనల్ రీసెర్చ్ సర్వీస్ తన తాజా నివేదికలో వెల్లడించింది. ధ్వంసమైన ఈ పరికరాల స్థానంలో కొత్తవి సమకూర్చుకోవడానికి అయ్యే ఖర్చు 3.3 బిలియన్ డాలర్ల అంటే సుమారు రూ. 31 వేల కోట్లు వరకు ఉండొచ్చని అంచనా. ఈనెల 5న విడుదల చేసిన ఈ తాజా నివేదిక అమెరికా సైనిక ప్రకటనలు, మీడియా కథనాలు, రక్షణ శాఖ నివేదికల ఆధారంగా రూపొందింది. మే నెలలో విడుదల చేసిన నివేదికలో ఈ సంఖ్య 42గా ఉండగా, తాజా నివేదికలో ఇది 81కి చేరడం గమనార్హం. మే తర్వాత జరిగిన నష్టాలతో పాటు గతంలో లెక్కలోకి రాని ఘటనలను కూడా చేర్చడం వల్లే ఈ సంఖ్య పెరిగినట్లు నివేదిక స్పష్టం చేసింది.

దెబ్బతిన్న కొన్ని విమానాలు మరమ్మతుల అనంతరం తిరిగి విధుల్లో చేరాయని కూడా పేర్కొంది. సైనిక కార్యకలాపాలు ఇంకా కొనసాగుతుండ టంతో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ నష్టాల్లో మానవ రహిత డ్రోన్ల వాటానే అధికంగా ఉంది. నివేదిక ప్రకారం, కనీసం 45 ఎంక్యూ9 రీపర్ డ్రోన్లు ధ్వంసమయ్యాయి.

## సిఇసి, ఇసిల నియామకం చట్టాన్ని సవాల్ చేస్తూ వచ్చిన పిటిషన్లపై సుప్రీం విచారణ

**న్యూఢిల్లీ, అక్టోబరు 7:** కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్, ఇతర కమిషనర్ల నియామకాలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం 2023 లో తీసుకొచ్చిన చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై దేశ అత్యున్నత న్యాయస్థానం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ చట్టాన్ని విస్తృత రాజ్యాంగ ధర్మాసనానికి బదిలీ చేయాలా వద్దా అనే అంశంపై గతంలో వచ్చిన స్ప్లిట్ వర్డిక్ట్ తీర్పును ఉపసంహరించుకోవాలంటూ దాఖలైన దరఖాస్తును పునఃపరిశీలించడానికి అంగీకరించింది. సీఈసీ జ్ఞానేష్ కుమార్ వ్యవహారంపై దేశవ్యాప్తంగా ఉద్యమాలు చోటు చేసుకుంటోండటం, 2023 నాటి ఈ చట్టం ద్వారా ఈసీ నియామకాలను కేంద్రం తనకు అనుకూలంగా, ఏకపక్షంగా మార్చుకుందంటూ విమర్శలు వెల్లువెత్తుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో సుప్రీంకోర్టు ఈ నిర్ణయం తీసుకోవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. పాత చట్టంలో సమూల మార్పులు చేస్తూ తీసుకొచ్చిన ఈ యాక్ట్ పై న్యాయమూర్తులు ఎటువంటి నిర్ణయాలు తీసుకుంటారనేది చర్చనీయాంశమయింది. కేంద్రం 2023 లో తెచ్చిన చట్టం చెల్లుబాటును రాజ్యాంగ ధర్మాసనానికి రిఫర్ చేయాలా వద్దా అనే అంశంపై కిందటి నెల 23న జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ సతీష్ చంద్ర శర్మతో కూడిన ఇద్దరు న్యాయమూర్తులల ధర్మాసనం స్ప్లిట్ వర్డిక్ట్ ఇచ్చింది. భిన్నమైన తీర్పులను వినిపించింది. దీనిపై ఇద్దరు న్యాయమూర్తులు కూడా ఏకాభిప్రాయానికి రాలేకపోయారు. జస్టిస్ దత్తా బదిలీ అభ్యర్థనను తోసిపుచ్చగా జస్టిస్ సతీష్ చంద్ర శర్మ దీనిని సమర్థించారు. సీఈసీ, ఈసీల ఎంపిక ప్రక్రియలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మార్పులే. నూతన చట్టం ప్రకారం ఈసీల ఎంపిక కమిటీ నుండి సీజేఐని తొలగించారు. ప్రధాని, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు గానీ అతిపెద్ద ప్రతిపక్ష పార్టీ నేత, ప్రధాని నామినేట్ చేసిన కేంద్ర క్యాబినెట్ అధికారి. ఈ సెలెక్షన్ కమిటీలో సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ సీఈసీ, ఈసీ నియామకాలు చేపడుతుంది. ఈ కొత్త నిబంధనల వల్ల నియామక ప్రక్రియలో పారదర్శకత దెబ్బతింటుందని, ఎన్నికల సంఘం స్వయంప్రతిపత్తిని కేంద్రం తన ఆధీనంలోకి తీసుకునే ప్రమాదం ఉందంటూ పలు పిటీషన్లు దాఖలయ్యాయి. ఈ క్రమంలోనే సుప్రీంకోర్టు సీనియర్ అడ్వొకేట్ గోపాల్ శంకరనారాయణన్ రీకాల్ పిటిషన్ దాఖలు చేశారు. ఇద్దరు న్యాయమూర్తుల బెంచ్ ఇచ్చిన స్ప్లిట్ వర్డిక్ట్‌ను రీకాల్ చేయాలని అభ్యర్థించారు. సుప్రీంకోర్టు ప్రధాన జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ జాయ్మాల్యా బాగ్చీ, జస్టిస్ వీ మోహనతో కూడిన త్రిసభ్య ధర్మాసనం సమక్షానికి వచ్చిందీ రీకాల్ పిటిషన్. భిన్నాభిప్రాయాల తీర్పు నేపథ్యంలో ఈ రీకాల్ పిటిషన్‌ను అత్యవసరంగా విచారించాలని కోరారు. ఇదే వ్యవహారంపై ఓ క్యురేటివ్ పిటిషన్ కూడా దాఖలైందని గుర్తు చేశారు. తాము దాఖలు చేసిన రీకాల్ పిటీషన్ ఇంటెరిమ్ అప్లికేషన్ గా భావించాలని వివరించారు. క్యురేటివ్ పిటిషన్ తో దీన్ని క్లబ్ చేయవద్దని కోరారు. ఈ క్యురేటివ్ పిటీషన్ విచారణను సొంతంగానే కొనసాగించాలని, విచారణకు అది ఎంతవరకు అర్హమైనదనే విషయంపై స్పష్టత రావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

## సర్ పూర్తయిన 20 రాష్ట్రాల్లో ఓటర్ల నమోదు

**న్యూఢిల్లీ, అక్టోబరు 7:** ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై దేశవ్యాప్తంగా రాజకీయ వివాదం కొనసాగుతున్న వేళ ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయిన 20 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఓటర్ల నమోదుకు స్పెషల్ డ్రైవ్ ప్రారంభించింది. జాబితాలో పేర్లు లేకుండా పోయిన అర్హులైన ఓటర్లను తిరిగి చేర్చేందుకు ఈ చర్యలు చేపట్టింది. ఎస్ఐఆర్ పూర్తయిన రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఫారం6తో పాటు ఎస్ఐఆర్ సమయంలో తీసుకువచ్చిన అదనపు డిక్లరేషన్ సమర్పించాల్సిన అవసరం లేదని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఎస్ఐఆర్ జరుగుతున్న సమయంలోనే ఇది వర్తిస్తుందని చెప్పింది. ఎస్ఐఆర్ పూర్తయిన ప్రాంతాల్లో అర్హులైన ఓటర్లు సాధారణ ఫారం6 ద్వారా ఓటర్ల జాబితాలో తమ పేరు నమోదు చేసుకోవచ్చని ఈసీ పేర్కొంది. సర్ లేని సమయంలో రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎలెక్టర్స్ రూల్స్, 1960 ప్రకారం నిర్దేశించిన సాధారణ ఫారమ్‌లే వర్తిస్తాయని కమిషన్ స్పష్టం చేసింది. ఎస్ఐఆర్ సమయంలో జాబితాలో పేర్లు లేకుండా పోయిన ఓటర్లను గుర్తించి చేర్చేందుకు ఎన్నికల అధికారులు, ఎన్నికలఅధికారులు,ఎలక్టోరల్‌రిజిస్ట్రేషన్‌అధికారులుచర్యలు తీసుకోవాలన్నారు.

### గణిత శాస్త్రవేత్త మహేష్ కాక్డేకు

## రామానుజన్ అవార్డు

### బెంగళూరు ఐఐఎస్‌సి ప్రొఫెసర్‌కు అరుదైన గౌరవం



**న్యూఢిల్లీ, అక్టోబరు 7:** బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్‌సి)లో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న భారతీయ గణిత శాస్త్రవేత్త మహేష్ కాక్డే, సంఖ్యా శాస్త్రంలో చేసిన తన ముఖ్యమైన కృషికి గాను, అభివృద్ధి చెందుతున్న దేశాల యువ గణిత శాస్త్రవేత్తల కోసం ఉద్దేశించిన 2026 రామానుజన్ బహుమతిని అందుకున్నారు. ఈ బహుమతిని ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ థియరిటికల్ ఫిజిక్స్ (ఐసిటిపి), ఇంటర్నేషనల్ మ్యాథమెటికల్ యూనియన్ (ఐఎంయు) సంయుక్తంగా అందజేస్తాయి. అభివృద్ధి చెందుతున్న దేశాలలో పనిచేస్తూ అత్యుత్తమ పరిశోధనలు చేసిన 45 యేళ్లలోపు గణిత శాస్త్రవేత్తలను ఇది గుర్తిస్తుంది. బీజగణిత సంఖ్యా శాస్త్రంలో చేసిన ప్రాథమిక కృషికి, ముఖ్యంగా సంఖ్యలు ఎలా ప్రవర్తిస్తాయి. విభిన్న గణిత నిర్మాణాలు ఎలా అనుసంధానించబడి ఉంటాయి అనే విషయాలకు సంబంధించిన ముఖ్యమైన సమస్యలను పరిష్కరించినందుకు కాక్డే ఈ గుర్తింపు పొందారు. మహేష్ కాక్డే మహారాష్ట్రలోని అకోలాలో 1983లో జన్మించారు. అక్కడే విద్యాభ్యాసం చేసిన కాక్డే, బెంగళూరులోని ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్‌లో బ్యాచిలర్ ఆఫ్ మ్యాథమెటిక్స్ పూర్తి చేశారు. ఆ తర్వాత కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయానికి వెళ్లి, అక్కడ 2008లో శుద్ధ గణితశాస్త్రంలో తన మాస్టర్స్ డిగ్రీ, పిహెచ్‌డిని పూర్తి చేశారు. ఆ తర్వాత ఆయన ప్రిన్స్‌టన్ విశ్వవిద్యాలయం, యూనివర్సిటీ కాలేజ్ లండన్, కింగ్స్ కాలేజ్ లండన్‌లలో పనిచేసి, 2019లో ఐఐఎస్‌సిలో ప్రొఫెసర్‌గా చేరారు. కాక్డే పొందుతున్న గౌరవాల జాబితాలో రామానుజన్ బహుమతి కూడా చేరింది. ఆయన 2022లో గణిత శాస్త్రాలలో ఇన్ఫోసిస్ బహుమతిని అందుకున్నారు. అంతర్జాతీయ గణిత శాస్త్రవేత్తల సదస్సులో ఆహ్వానిత వక్తగా ప్రసంగించారు. 2023లో ఆయన 'ఏషియన్ సైంటిస్ట్ 100' జాబితాలో కూడా చోటు దక్కించుకున్నారు. 2005లో స్థాపించబడిన రామానుజన్ బహుమతి, 10,000 డాలర్ల నగదు బహుమతిని అందిస్తుంది. అభివృద్ధి చెందుతున్న దేశాలలో సవాలుతో కూడిన పరిస్థితులలో నిర్వహించబడిన అసాధారణ గణిత పరిశోధనలను గౌరవిస్తుంది.

## 45 కాదు 100 ఎఫ్‌ఐఆర్‌లు నమోదుచేసినా తగ్గేదిలేదు!

### కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ



**న్యూఢిల్లీ, అక్టోబరు 7:** ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా ప్రతిపక్షాల ఆందోళన కొనసాగుతోంది. కేంద్ర ఎన్నికల సంఘం, ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై నిరసన వ్యక్తం చేస్తున్న ప్రతిపక్ష ఎంపీలు బుధవారం ఢిల్లీలోని జంతర్ మంతర్‌కు వెళ్లనున్నట్లు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తెలిపారు. లోక్‌సభ, రాజ్యసభకు చెందిన సుమారు 300 మంది ఎంపీలు మంగళవారం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను కలిసేందుకు ప్రయత్నించినప్పటికీ ఆయనను కలిసేందుకు అవకాశం ఇవ్వలేదని రాహుల్ గాంధీ ఆరోపించారు. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ విపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. మంగళవారం నిరసనకు నిర్ణయించిన ప్రదేశానికి వెళ్లకుండా ఢిల్లీ పోలీసులు తమను అడ్డుకున్నారని రాహుల్ గాంధీ తెలిపారు. అక్కడ నిరసన చేపట్టేందుకు అనుమతి లేదని పోలీసులు చెప్పినట్లు పేర్కొన్నారు. నిన్న చెప్పినట్లుగానే లోక్‌సభ, రాజ్యసభకు చెందిన సుమారు 300 మంది ఎంపీలు సిఇసిని కలవాలని అనుకున్నారు. కానీ ఆయన మమ్మల్ని కలవలేదు. ఢిల్లీ పోలీసులు మమ్మల్ని అడ్డుకున్నారు. అక్కడ నిరసన చేయడానికి వీల్లేదని నిన్న చెప్పారు అని రాహుల్ గాంధీ తెలిపారు. దీంతో అధికారికంగా నిరసనలకు కేటాయించిన జంతర్ మంతర్‌కు వెళ్లి అక్కడే ఆందోళన చేపట్టాలని నిర్ణయించినట్లు చెప్పారు. తనపై కేసులు నమోదవుతున్న అంశంపైనా రాహుల్ గాంధీ స్పందించారు. తనపై 100 ఎఫ్ఐఆర్‌లు నమోదైనా తనకు అభ్యంతరం లేదని వ్యాఖ్యానించారు. "నాపై 100 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయండి.

ప్రతి ఎఫ్ఐఆర్ నాకు ఒక పతకం లాంటిదే అని అన్నారు. ఇప్పటికే తనపై 45 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బుధవారం ఢిల్లీలోని కనాట్ ప్లేస్‌లో ఉన్న సాగర్ రత్న రెస్టారెంట్‌లో కాంగ్రెస్ ఎంపీలు, ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీల నేతలకు విందు ఏర్పాటు చేశారు. ఈ సమావేశం అనంతరం రాహుల్ గాంధీ ఎన్నికల సంఘంపై ప్రతిపక్షాల ఆందోళనను కొనసాగించనున్నట్లు తెలిపారు.

# సంక్షిప్త వార్తలు

## ముంబయి నుంచి ఢిల్లీకి వేదిక మార్చిన సిజెపి




**ముంబయి, అక్టోబరు 7:** ఎస్ఐఆర్ లో అక్రమాలకు బాధ్యత వహిస్తూ సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నిరసనలకు దిగుతున్న కాక్రోచ్ జనతా పార్టీ ముంబై నుంచి ఢిల్లీకి మకాం మార్చబోతోంది. అక్టోబర్ 10న ముంబై నుంచి ఢిల్లీ జంతర్ మంతర్ కు చేరుకుని ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించింది. ఈ మేరకు ఢిల్లీలో ఏర్పాట్లు చేసుకుంటోంది. అయితే ఈ భారీ నిరసనకు అనుమతి లేదని పోలీసులు తెల్చిచెప్పేస్తున్న వేళ సీజేపీ నేత సౌరవ్ దాస్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈనెల 10న ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద చేపట్టే ఆందోళనలకు అనుమతులు తీసుకోవాలంటూ తమకు ఎదురవుతున్న ప్రశ్నలపై స్పందించిన సీజేపీ నేత సౌరవ్ దాస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేపట్టే నిరసనలకు తిరిగి ప్రభుత్వం అనుమతి ఎందుకని ప్రశ్నించారు.

## అరుణాచలం ఆలయంలో భక్తులకు కొత్త మార్గదర్శకాలు



**చెన్నై, అక్టోబరు 7:** తమిళనాడులోని ప్రముఖ పుణ్యక్షేత్రం తిరువణ్ణామలై (అరుణాచలం) ఆలయంలో భక్తుల రక్షణ, రద్దీ నియంత్రణ కోసం ఆలయ స్థానిక అధికారులు పలు కొత్త ఆంక్షలు మరియు నిబంధనలను అమలులోకి తీసుకు వచ్చారు. గర్భగుడి ప్రాంతం చాలా ఇరుకుగా ఉండటం వల్ల భక్తుల ఆరోగ్య భద్రత దృష్ట్యా ఆలయ బోర్డు కొత్త మార్గదర్శకాలను జారీ చేసింది. తాజా మార్గదర్శకాల మేరకు ఇక నుంచి గర్భగుడి అభిషేకంలో పాల్గొనాలనుకునే భక్తులకు అభిషేకం ప్రారంభానికి ఒక గంట ముందుగా ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. వీటిని తప్పని సరి చేసారు.

## ఆసుపత్రులు చేసే అతి ప్రకటనలకు మెడికల్ కమిషన్ కత్తెర!

**న్యూఢిల్లీ, అక్టోబరు 7:** దేశంలో వైద్యులు, ఆస్పత్రులు, వైద్య సంస్థలు చేసే ప్రచారాలు, ప్రకటనలపై నేషనల్ మెడికల్ కమిషన్ కొత్త నైతిక మార్గదర్శకాలను విడుదల చేసింది. వైద్య రంగాన్ని వాణిజ్యమయం చేయకుండా నిరోధించడం, తప్పుడు సమాచారం నుంచి రోగులను కాపాడటం, వైద్య వృత్తిలోని జవాబుదారీతనాన్ని పెంచడమే లక్ష్యంగా ఈ నిబంధనలను రూపొందించారు. ముఖ్యంగా బెస్ట్ డాక్టర్', నంబర్ వన్", 100 శాతం నయం చేస్తాం', నొప్పి లేని చికిత్స' వంటి వ్యాపార ధోరణిలో చేసే అతిశయోక్తి ప్రకటనలను పూర్తిగా నిషేధించారు.

NATIONAL MEDICAL COMMISSION INDIA
भारतीय राष्ट्रीय आयुर्विज्ञान आयोग

## ఇరాన్‌ను ఎవరు నడిపిస్తున్నారో తెలియడంలేదు :ట్రంప్



**వాషింగ్టన్, అక్టోబరు 7:** పశ్చిమాసియాలో అమెరికాఇజ్రాయెల్ దళాలు నిర్వహిస్తున్న యుద్ధం ఎనిమిదో నెలకు చేరుకున్న వేళ సంచలన పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఫిబ్రవరి చివర్లో ప్రారంభమైన ఈ తీవ్రస్థాయి పోరులో ఇరాన్ అగ్ర నాయకత్వం తుడిచిపెట్టుకుపోవడంతో, ప్రస్తుతం ఆ దేశాన్ని అసలు ఎవరు నడిపిస్తున్నారో ఎవరికీ తెలియడం లేదని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అగ్ర నాయకులు, వారి తర్వాతి స్థానాల్లో ఉన్న నేతలంతా హతమవ్వడంతో ఒక స్పష్టమైన నాయకత్వం లేక ఇరాన్ కొట్టుమిట్టాడుతోందని ట్రంప్ తీవ్రస్థాయిలో వ్యాఖ్యానించారు. అసలు ఇరాన్ ను ఎవరు నడిపిస్తున్నారో ఎవరికీ తెలియకపోవడమే ఇప్పుడు పెద్ద సమస్యగా మారింది అని ట్రంప్ అనడం అంతర్జాతీయంగా కలకలం రేపింది.

# ఇన్వెస్ట్ తెలంగాణ తొలి గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం

## పెట్టుబడులను ఆకర్షించేందుకు సమన్వయంతో సమర్థవంతమైన చర్యలు చేపట్టాలి: ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు



**హైదరాబాద్,అక్టోబరు7,ప్రభాతవార్త:** రాష్ట్రంలో పెట్టుబడులను మరింతగా ఆకర్షించడం, పారిశ్రామికాభివృద్ధిని వేగవంతం చేయడం, తెలంగాణను దేశంలోనే అత్యుత్తమ పెట్టుబడి గమ్యస్థానంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఇన్వెస్ట్ తెలంగాణ గవర్నింగ్ కౌన్సిల్ తొలి సమావేశం బుధవారం డా. బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణాన్ని మరింత బలోపేతం చేయడం, పారిశ్రామి కవేత్తలకు వేగవంతమైన అనుమతులు, మౌలిక వసతులు, అవసరమైన ప్రభుత్వ సహకారం అందించడం తదితర అంశాలపై సమావేశంలో సమీక్షించారు. తెలంగాణలో పెట్టుబడుల అవకాశాలను దేశీయ, అంతర్జాతీయ స్థాయిలో విస్తృతంగా ప్రచారం చేయడంతో పాటు, ఇప్పటికే పెట్టుబడులు పెట్టిన సంస్థలతో నిరంతరం సమన్వయం కొనసాగించాలని సీఎస్ అధికారులను ఆదేశించారు. పెట్టుబడుల ప్రతిపాద నలను వేగంగా పరిశీలించి, వివిధశాఖల మధ్య సమన్వయంతో నిర్ణీత కాల వ్యవధిలో కార్యరూపం దాల్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

తెలంగాణ రైజింగ్ లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్రాన్ని పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి కల్పనలో అగ్రగామిగా నిలిపేందుకు ఇన్వెస్ట్ తెలంగాణ కీలక వేదికగా పనిచేయాలని సీఎస్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, టిజిఐఐసి ఎండీ శశాంక, ఐటిఈ అండ్ సీ సంయుక్త కార్యదర్శి అనుదీప్, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓ, ఎండీ, అజిత్ రెడ్డి, నిఖిల్ చక్రవర్తి, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ విలీనానికి కట్టుబడి ఉన్నాం

## పెండింగ్ సమస్యలు పరిష్కరిస్తాం: పిసిసి చీఫ్ మహేష్‌గౌడ్

**హైదరాబాద్, అక్టోబరు 7, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వంతోనే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియ ముందుకు సాగుతుందని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. ఆర్టీసీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ఆర్టీసీ కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ, ఐఎన్‌టీయూసీ మద్దతు ఇస్తున్న తెలంగాణ వర్కర్స్ యూనియన్ (టిడబ్ల్యూయు) బాణం గుర్తుకు మద్దతు ఇవ్వాలని కార్మికులను కోరారు. ఆర్టీసీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం హైదరాబాద్ గౌలిగూడలోని సీబీఎస్ వద్ద టిడబ్ల్యూయు ఆధ్వర్యంలో వేలాది మంది కార్మికులతో భారీ బహిరంగ సభ నిర్వహించారు.



సమావేశంలో పాల్గొన్న పిసిసి చీఫ్ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ తదితరులు

టిడబ్ల్యూయు అధ్యక్షుడు మొగిళ్ల రాజిరెడ్డి అధ్యక్షతన జరిగిన సభకు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు జి.సంజీవరెడ్డి, ఎమ్మెల్సీలు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, రాములు నాయక్, టిడబ్ల్యూయు ప్రధాన కార్యదర్శి ఈ.అశ్వత్థామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ 97 డిపోల్లో జరుగుతున్న ఆర్టీసీ కార్మిక సంఘాల ఎన్నికల్లో టిడబ్ల్యూయుకు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆశీస్సులు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలపై ముఖ్యమంత్రితో చర్చించిన అనంతరం సానుకూల స్పందన రావడంతో అధికారికంగా మద్దతు ప్రకటించినట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. టిడబ్ల్యూయు అధ్యక్షుడు మొగిళ్ల రాజిరెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలన్నది కార్మికుల ప్రధాన డిమాండ్ అని తెలిపారు. ఈ డిమాండ్ నెరవేర్చేందుకు కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని కార్మికులను కోరారు. టిడబ్ల్యూయు నూతన ప్రధాన కార్యదర్శిగా ఈ. అశ్వత్థామరెడ్డిని ప్రకటించారు. ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో ఆర్టీసీ కార్మికులకు అండగా నిలిచిన తమకు, ప్రస్తుతం వారి హక్కులు, ప్రయోజనాల పరిరక్షణకు కూడా నిలబడాల్సిన బాధ్యత ఉందన్నారు. గతంలో ఆర్టీసీ సమ్మె సందర్భంగా కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తుచేశారు.

# రబీలో పంటల వైవిధ్యీకరణ

## కొత్తగా ఇన్నోవేషన్ టు ఇంపాక్ట్ పైలట్ ప్రాజెక్ట్

### రాష్ట్రంలోని 12 ప్రాంతాలు గుర్తింపు

### పప్పుధాన్యాలు, నూనె గింజల సాగుపై రైతులకు శిక్షణ

### రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం విసి జానయ్య

**హైదరాబాద్, అక్టోబరు 7, ప్రభాతవార్త:** ఎల్ నినో, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఈ రబీ సీజనులో ప్రత్యమ్నాయ పంటలను సాగు చేసేలా రైతులను సన్నద్ధం చేయాలని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం నిర్ణయించింది. ఇందులో భాగంగా పంటల వైవిధ్యీకరణలో రైతులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు ఇన్నోవేషన్ టు ఇంపాక్ట్ అనే సరికొత్త పైలట్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించింది. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు ఒకే రకమైన సాంప్రదాయ పంటలపై ఆధారపడకుండా, అధిక లాభాలనిచ్చే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసేలా ప్రోత్సహించడం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యమని విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య బుధవారం మీడియాకు తెలిపారు. ఈ రబీ సీజన్‌లో సాంకేతిక పరిజ్ఞాన వినియోగంలో ఉన్న లోపాలను పూడ్చడమే ఈ వ్యూహం యొక్క లక్ష్యమని తెలిపారు. దిగుబడిలో వ్యత్యాసాలను తగ్గించి, రైతుల ఆదాయాన్ని పెంచడమే ఈ ప్రయత్నమని పేర్కొన్నారు. పంటల వైవిధ్య కరణను ప్రోత్సహించడానికి రాష్ట్రంలోని 12 ప్రాంతాలను గుర్తించడం జరిగిందన్నారు. వీటిలో పాలెం, తాండూర్, మధిర, వరంగల్, కంపాసాగర్, రుద్రూర్, ఆదిలాబాద్, జగిత్యాల, తోర్నాల, కరీంనగర్, బసంత్‌పూర్, కునారం ఉన్నాయని వెల్లడించారు. ఈ ప్రాంతీయ వ్యవ సాయ పరిశోధనా కేంద్రాల ద్వారా ఇన్నోవేషన్ టు ఇంపాక్ట్ ప్రాజెక్ట్‌ను క్షేత్రస్థాయిలోకి తీసు కెళ్లనున్నారు. ప్రతి కేంద్రంలో నలుగురు శాస్త్రవే త్తలతో కూడిన ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఆ కేంద్రాల పరిధిలోని నాలుగు గ్రామాలను ఎంపిక చేస్తారు. వారిలో నుండి 20 నుండి 25 మంది ప్రగతిశీల రైతులను గుర్తించి, వారికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెస్తారు. పంట ఉత్పాదకతను మెరుగుపరచడానికి కొత్త రకాలను గుర్తిస్తారు. ఈ బృందాలు నేరుగా రైతుల పొలాల్లోనే ఆధునిక సాంకేతిక సాగు పద్ధతులపై శిక్షణ ఇస్తాయి. పంట సాగు ప్రారంభం నుండి కోతల వరకు ప్రతిదశలోనూ రైతులకు వీరు మార్గదర్శకత్వం వహిస్తారు. ప్రధానంగా పప్పుధాన్యాలు, నూనెగింజల సాగుపై దృష్టిసారిస్తారు. ఈ వైవిధ్యకరణలో భాగంగా మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న, తక్కువ నీటితో పండే పప్పుధాన్యాలు, నూనెగింజల సాగుపై రైతులకు ప్రధానంగా అవగాహన కల్పిస్తారు. పంట మార్పిడి ద్వారా భూమిలో పోషక విలువలను పెంచి, సాగు ఖర్చులను తగ్గించడం ద్వారా రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడమే ఈ ప్రాజెక్ట్ యొక్క ప్రాథమిక లక్ష్యంగా ప్రొఫెసర్ జానయ్య తెలిపారు.

# రోడ్డు ప్రమాదాలు తగ్గించేందుకు

# పోలీసు, రవాణా శాఖ ఉన్నతాధికారులతో డిజిపి భేటీ

## ఏడు జిల్లాల ఎస్పిలతో విడియో కాన్ఫరెన్స్

### ప్రమాదాల నివారణకు పక్కాగా వ్యవహరించాలని ఆదేశం



**హైదరాబాద్, అక్టోబరు 7, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలను, ప్రమాదాలలో మృతులను కనిష్ట స్థాయికి తగ్గించేందుకు అన్ని రాష్ట్రాలు కఠిన చర్యలు తీసుకోవాలని సుప్రీం కోర్టు ఆదేశించిన దరిమిలా రాష్ట్ర సర్కారు చర్యలకు ఉపక్రమించింది. దీనిపై డిజిపి ఆనంద్ బు ధవారం నాడు పోలీసు, రవాణా శాఖ ఉన్నతాధికారులతో తన కార్యాలయంలో భేటీ అవడంతో పాటు రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ఏడు జిల్లాల కమిషనర్లు, ఎస్పిలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలలో జీరో పాటాలిటీ లక్ష్యంగా జరిగిన ఈ భేటీలో డిజిపి ఆనంద్ మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు పక్కా కార్యాచరణ ప్రణాళికను అమలు చేయనున్నట్లు తెలిపారు. దేశ వ్యాప్తం గా వంద జిల్లాలలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుండగా ఇందులో ఏడు తెలంగాణలో వున్నాయని, ఇవన్నీ హైదరాబాద్‌కు సమీపంలోనే వు ండడం గమనించదగ్గ అంశమని ఆయన తెలిపారు. రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న జిల్లాలను సేఫ్ ఫౌండేషన్ ఎంపిక చే సిందని ఆయన తెలిపారు. రోడ్డు ప్రమాదాల వివరాలు, అందుకు గల కారణాలు, ఏ సమయంలో ఎక్కువగా జరుగుతున్నాయి...? అనే వివరా లను ఇకముందు మార్గదర్శక్ పోర్టల్, డ్యాష్ బోర్డులో కచ్చితంగా నమోదు చేయాలని డిజిపి ఏడు జిల్లాల కమిషనర్లు, ఎస్పిలను ఆదేశించారు . అందుబాటులో వున్న డేటాను విశ్లేషించడం ద్వారా ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి, నివారణ చర్యలను చేబట్టాలని ఆయన ఆదేశించారు. దేశ వ్యాప్తంగా ఏటా లక్షా 75 వేల మంది రోడ్డు ప్రమాదాలలో మరణిస్తున్నారని, రాష్ట్రంలో ఏడు వేలకు పైగా మరణా లు వున్నాయని ఆయన తెలిపారు. రోడ్డు ప్రమాదాలలో తెలంగాణ దేశంలో ఏడవ స్థానంలో వుందని డిజిపి తెలిపారు. ప్రమాదాల నివారణకు రోడ్ సేఫ్టీ బ్యూరోను ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. రాష్ట్రంలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ఏడు జిల్లాలలో 48 కారిడార్లను గు ర్తించామని డిజిపి తెలిపారు. సేఫ్ లైఫ్ ఫౌండేషన్ ఈ గణాంకాలను రూపొందించిందని ఆయన తెలిపారు. మేడ్చల్, మల్కాజిగిరి, రంగారెడ్డి, యాదాద్రి భువనగిరి, సంగారెడ్డి, హనుమకొండ, వరంగల్, జనగామ జిల్లాలలో ఈ 48 కారిడార్లు వున్నాయని ఆయన తెలిపారు. ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలలో రహదారుల ఇంజనీరింగ్ లోపాలు వుంటే వాటిని సరిచేయాలని, దీంతో పాటు 4ఈ విధానంతో ప్రమా దాలను కట్టడి చేయాలని ఆయన ఆదేశించారు. ఎడ్యుకేషన్, ఇంజనీరింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎమ్మర్జెన్సీ సపోర్ట్ అంశాలు 4ఈలో ముఖ్యాంశాల ని ఆయన అన్నారు. ప్రమాదాలు జరిగిన వెంటనే బాధితులను ఆసుపత్రులకు తరలించి వైద్య సేవలు అందేలా చూడాలని ఆయన ఆదేశించా రు. దీంతో పాటు ప్రమాదాలు జరిగిన ప్రతీసారి ఎలక్ట్రానిక్ డిజిటల్ యాక్సిడెంట్ రిపోర్ట్ (ఈ..డార్) నమోదు చేయాలని ఈ సమావేశంలో పా ల్గొన్న రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి ఆదేశించారు. ఎక్కువగా ప్రమాదాలు జరిగిన ప్రాంతాలను జియో ట్యాగింగ్ చేయాలని ఆయన సూచి ంచారు. కాగా నవంబరు మూడవ తేదీన చెన్నైలో జరగనున్న సదస్సులో రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాల నివారణకు చేబ ట్టిన చర్యలపై చీఫ్ సె క్రటరీ సంజయ్ జాజు సమగ్ర నివేదికను ఇవ్వనున్నారని డిజిపి తెలిపారు. ఈ సమావేశంలో ఐజిలు చంద్రశేఖర్ రెడ్డి, రమేష్ నాయుడు సహా రవాణా శాఖ ఉన్నతాధికారులు, సేఫ్ ఫౌండేషన్ ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

# రైతులకు అదనపు ఆదాయ అవకాశాలపై అవగాహన కల్పించాలి

## సిద్దిపేట కిసాన్ మేళాలో పాల్గొన్న రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి

**హైదరాబాద్, అక్టోబరు 7, ప్రభాతవార్త:** రైతుల సమస్యలను క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా తెలుసుకునే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం కోదండరెడ్డి తెలిపారు. సిద్దిపేట జిల్లాలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కిసాన్ మేళా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయి మాట్లాడుతూ రాష్ట్రంలోని రైతు సమస్యలను తెలుసుకోవడమే కాకుండా సంబంధిత శాఖల సమన్వయంతో వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడమే ప్రధాన ఆశయమన్నారు. రైతులకు ప్రభుత్వ పథకాలు, ఆధునిక వ్యవసాయ సాంకేతికత, వ్యవసాయ అనుబంధ రంగాల ద్వారా అదనపు ఆదాయ అవకాశాలపై మరింత అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా చైర్మన్ గారు కిసాన్ మేళాలో ఏర్పాటు చేసిన వివిధ వ్యవసాయ, అనుబంధ శాఖల స్టాళ్లను సందర్శించారు. వ్యవసాయం, ఉద్యానవనం–పట్టు, పశుసంవర్ధక, మత్స్య, వ్యవసాయ మార్కెటింగ్, సహకార శాఖలతో పాటు రైతులకు ఉపయోగపడే వివిధ సాంకేతికతలు, పథకాలు, ఉత్పత్తుల ప్రదర్శనలను పరిశీలించారు. సిద్దిపేట జిల్లాలో వ్యవసాయం, ఉద్యానవనం–పట్టు, మార్కెటింగ్, సహకారం, మత్స్య, పశుసంవర్ధక తదితర శాఖలు జిల్లా స్థాయిలో పనిచేస్తున్నాయి. కార్యక్రమంలో జిల్లా కలెక్టరు కె హైమావతితో పాటు, జిల్లా వ్యవసాయ శాఖతో పాటు వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, రైతులు,రైతుప్రతినిధులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనుల్లో ఆల్‌టైమ్ రికార్డు

## అక్టోబర్‌లో రోజుకు 2.54 లక్షల మందికి పైగా పనులకు హాజరు

### ఫలితాలిస్తున్న ప్రభుత్వ ప్రత్యేక చర్యలు

### వేజ్ సీకర్ల సంఖ్య మరింత పెంచాలని మంత్రి సీతక్క ఆదేశం

**హైదరాబాద్,అక్టోబరు7,ప్రభాతవార్త:** గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పనుల ద్వారా కూలీలకు నిరంతర ఉపాధి కల్పించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ఎల్‌నినో ప్రభావంతో వ్యవసాయ పనులు తగ్గుతున్న పరిస్థితుల్లో గ్రామీణ కూలీలకు ప్రత్యామ్నాయంగా ఉపాధి హామీ పనులను విస్తృతంగా అందు బాటులోకి తీసుకురావడంలో ప్రభుత్వం చేపట్టిన చర్యలు ఫలితాలను ఇస్తున్నాయి. అక్టోబర్ నెలలో ఉపాధి హామీ పనులకు హాజరవుతున్న కూలీల సంఖ్య గతంతో పోలిస్తే భారీగా పెరిగింది. మంగళవారం ఒక్కరోజే 2,54,812 మంది కూలీలు పనులకు హాజరయ్యారు. వీబీ–జీ రామ్ జీ అమలు ప్రారంభమైన తర్వాత రాష్ట్రంలో నమోదైన అత్యధిక రోజువారీ కూలీల హాజరు ఇదే. గత ఐదేళ్ల అక్టోబర్ నెలలో రోజువారీ సగటు వేజ్ సీకర్ల సంఖ్యను పరిశీలిస్తే ఈ పెరుగుదల స్పష్టంగా కనిపిస్తోంది.

2025 అక్టోబర్‌లో రోజుకు సగటున కేవలం 24,750 మంది ఉపాధి హామీ పనులకు హాజరవగా, 2026అక్టోబర్‌లో ఈ సంఖ్య 2.16 లక్షలకు చేరింది. అంటే గత ఏడాదితో పోలిస్తే రోజువారీ సగటు వేజ్ సీకర్ల సంఖ్య ఘననీయంగా పెరిగింది. ఎల్ నినో కారణంగా వ్యవసాయ పనులు తగ్గుతున్న సమయంలో గ్రామీణ కుటుంబాలకు ఆదాయ భద్రత కల్పించేందుకు ఉపాధి హామీ పనులను విస్తృతం చేయాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించడంతో పాటు జిల్లా అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో పని కోరుతున్న ప్రతి కుటుంబానికి వీలైనంత త్వరగా పని కల్పించాలని, వేజ్ సీకర్ల సంఖ్యను మరింత పెంచేలా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు. కొత్తగా ఉపాధి హామీ కార్డులు కోరుతున్న వారికి 15 రోజుల్లోగా జాబ్ కార్డులు అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పనికోరే కూలీలను గుర్తించి, వారికి అందుబాటులో ఉన్న పనుల వివరాలను తెలియజేసి, ఎక్కువ సంఖ్యలో కూలీలు పనుల్లో పాల్గొనేలా చూడాలని స్పష్టం చేశారు. దీంతో ఉపాధి హామీ పనులకు హాజరవుతున్న కూలీల సంఖ్య పెరుగుతూ మంగళవారం రికార్డును నెలకొల్పింది.

# రబీలో వరి బదులు ఆరుతడి పంటలే మేలు

## భూగర్భ జలాలను బట్టే ఎంపిక

### వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్రమోహన్

**హైదరాబాద్, అక్టోబరు 7, ప్రభాతవార్త:** ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షాలు, ఉష్ణోగ్రతల్లో హెచ్చుతగ్గులు ఉండే అవకాశం ఉన్నందున యాసంగిలో రైతులు వరికి బదులు తక్కువ నీటితో పండే పంటల వైపు మళ్లేలా చూడాలని వ్యవసాయ శాఖ కార్యదర్శి కె. సురేంద్రమోహన్ సూచించారు. రబీ 202627 కార్యాచరణ ప్రణాళికపై బుధవారం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ, నీటి లభ్యత తక్కువగా ఉండే పరిస్థితుల్లో వరి సాగు రైతులకు నష్టం కలిగించే ప్రమాదం ఉందన్నారు. అందువల్ల స్వల్పకాలిక పప్పుధాన్యాలు, నూనెగింజల పంటలతో పాటు, మంచి ఆదాయాన్నిచ్చే కూరగాయల సాగును ప్రోత్సహించాలని సూచించారు. ప్రతి రైతూ తన ప్రాంతంలోని భూగర్భ జలాల లభ్యతను చూసుకున్న తరువాతే పంటను ఎంచుకునేలా క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. పప్పుధాన్య, నూనెగింజల, కూరగాయల పంటలకు అనువైన విత్తన కాలాలను దృష్టిలో ఉంచుకుని సాగు చేయాలన్నారు. వ్యవసాయ, ఉద్యాన విశ్వవిద్యాలయాల శాస్త్రవేత్తలు ఈ సీజన్‌లో రైతులు సాగు చేయడానికి అనువైన పంట రకాలను సిఫార్సు చేశారు. విత్తనాలు, ఎరువుల సరఫరాపై సమీయాసంగి సీజన్‌లో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో, సరిపడా అందుబాటులో ఉండేలా సరఫరా పరిస్థితిని కూడా సమీక్షి ంచారు.

కిసాన్ హెల్ప్‌లైన్ అరచేతిలో రైతన్న పరిష్కారం

క్షేత్రస్థాయి విస్తరణ సేవలకు తోడుగా, మొబైల్ ఫోన్ ద్వారా మరో ముందడుగని చెప్పారు. వ్యవసాయ విస్తరణ అధికారి నుంచి కమిషనరేట్ స్థాయి అధికారుల వరకు రైతులకు ఇప్పటికే వ్యవసాయ విస్తరణ సేవలు అందుతున్నాయని తెలిపారు. వీటికి అదనంగా, రైతులు తమ సమస్యల పరిష్కారం కోసం అరచేతిలోని మొబైల్ ఫోన్ ద్వారానే సలహాలు పొందేందుకు వీలుగా కిసాన్ హెల్ప్‌లైన్ పనిచేస్తుందని వెల్లడించారు. పంటకు తెగులు సోకినా, ఎరువు ఎంత వేయాలో తెలియకపోయినా, ప్రభుత్వ పథకం అందక పోయినా రైతులు టోల్ ఫ్రీ నంబర్ 1800180 1551 కు ఫోన్ చేస్తే తెలుగులోనే తక్షణ సలహా, సమాచారం అందుతాయని పేర్కొన్నారు. సలహాలతో పాటు, వ్యవసాయ పథకాలకు సంబంధించిన రైతుల ఫిర్యాదులను కూడా ఇదే నంబర్ ద్వారా తెలియజేయవచ్చన్నారు. ఈ సేవలు మారుమూల గ్రామాల్లోని ప్రతి రైతుకూ తెలిసేలా, క్షేత్రస్థాయి వ్యవసాయ విస్తరణ అధికారులు, మండల వ్యవసాయ అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో వ్యవసాయ శాఖ డైరక్టర్ డాక్టర్ బి. గోపి తదితరులు పాల్గొన్నారు.

# గురుకులాల్లో సమూల మార్పులకు శ్రీకారం

## పనితీరుపై నిత్య పర్యవేక్షణ

### ఎస్సీ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి రవి

**హైదరాబాద్, అక్టోబరు 7, ప్రభాతవార్త:** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ పరిధిలోని విద్యాసంస్థల్లో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచే లక్ష్యంతో ఉన్నట్లు ఆ సంస్థ కార్యదర్శి గుగులోతు రవి తెలిపారు. అలాగే విద్యార్థులకు నాణ్యమైన విద్య, పోషకాహారం, మెరుగైన మౌలిక వసతులు, భద్రత, ఆరోగ్యం, పరిశుభ్రత వంటి అన్ని సౌకర్యాలు సమర్థవంతంగా అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. హైదరాబాద్ మాసాబ్‌ట్యాంక్‌లోని సంక్షేమ భవన్‌లో బుధవారం గురుకుల విద్యాలయాల సంస్థ ప్రధాన కార్యాలయం నుంచి జూమ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ పరిధిలోని గురుకుల విద్యాసంస్థల విద్యా, పరిపాలనా, మౌలిక వసతులు, విద్యార్థుల సంక్షేమానికి సంబంధించిన అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. విద్యార్థులకు కేవలం సిలబస్ పూర్తి చేయడంపైనే కాకుండా తరగతిలో బోధించిన అంశాలను వారు ఎంతవరకు అర్థం చేసుకున్నారనేదానిపై దృష్టిసారించాలన్నారు. హాస్టళ్లలో పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా తరగతులు వినే ప్రక్రియలో ఎలాంటి అంతరాయం కలగకుండా ఇంటర్నెట్ సదుపాయాన్ని నిరంతరం అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. డిజిటల్ విద్యకు అవసరమైన సాంకేతిక వసతుల్లో లోపాలు ఉంటే వాటిని వెంటనే గుర్తించి పరిష్కరించాలని సూచించారు. ఈ జూమ్ మీటింగ్ లో జాయింట్ సెక్రటరీ కంభంపాటి శారద, అకడమిక్ జాయింట్ సెక్రటరీ సక్రు నాయక్, అడిషనల్ సెక్రటరీ విజయ తదితరులు పాల్గొన్నారు.

# వైద్య చికిత్సకు రూ.2 లక్షల ఆర్థిక సాయం: కోమటిరెడ్డి

**హైదరాబాద్, అక్టోబరు 7,ప్రభాతవార్త:** రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి మరోసారి తన మానవతా హృదయాన్ని చాటుకున్నారు. కష్టాల్లో ఉన్న ఓ కుటుంబానికి అండగా నిలిచి, అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నారికి వైద్య చికిత్స అందించేందుకు ఆర్థిక సహాయం చేయడంతో పాటు, ఆ కుటుంబానికి ధైర్యం చెప్పారు. ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన పనిగిరి గ్రామ నివాసులు జంపాల మహేష్ కుమార్, రజిత దంపతులు ఇద్దరూ మూగ, చెవిటి వారు. వారికి జన్మించిన బిడ్డ కూడా మూగ, చెవిటి తనంతో పుట్టడంతో ఆ తల్లిదండ్రుల జీవితాల్లో తీవ్ర విషాదం నెలకొంది. తమ బిడ్డకు సరైన వైద్యం అందిస్తే మాట్లాడే అవకాశం ఉందని వైద్యులు చెప్పడంతో ఆ కుటుంబంలో కొంత ఆశ చిగురించింది. అయితే, ఇందుకు లక్షల్లో ఖర్చవుతుందని వైద్యులు చెప్పడంతో, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆ దంపతులు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని ఆశ్రయించారు. వారి పరిస్థితిని తెలుసుకున్న మంత్రి ఎంతో ఆప్యాయతతో స్పందించారు. చిన్నారిని స్వయంగా ఎత్తుకుని అక్కున చేర్చుకుని, తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు. చిన్నారి వైద్య చికిత్స కోసం రూ.2 లక్షల తక్షణ ఆర్థిక సహాయాన్ని అందించారు. అంతేకాకుండా, చిన్నారికి మెరుగైన వైద్యం అందించే విషయంలో వైద్యులతో స్వయంగా మాట్లాడుతానని మంత్రి హామీ ఇచ్చారు.

# గ్రామీణ ఉపాధికి చేనేత, హస్తకళలు కీలకం

## కళా, వస్త్రాలకు తెలంగాణ గొప్పవారసత్వం

### మార్కెట్ విలువ పెంపు, జీవనోపాధి బలోపేతం

### రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా



**హైదరాబాద్, అక్టోబరు 7, ప్రభాతవార్త:** హస్తకళలు, చేనేత రంగం కేవలం సంప్రదాయానికి నిధి మాత్రమే కాదని, గ్రామీణ ఉపాధికి కీలకమని రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా అన్నారు. తెలంగాణ గొప్ప కళా, వస్త్ర వారసత్వానికి ప్రతీకని తెలిపారు. నాబార్డు తెలంగాణ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న గ్రామీణ భారత్ మహోత్సవాన్ని బుధవారం ప్రారంభించిన తదుపరి మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఈ రంగంలో 64 లక్షలకు పైగా కళాకారులు, నేత కార్మికులు పనిచేస్తున్నారని చెప్పారు. వారిలో మహిళలు గణనీయమైన వాటాను కలిగి ఉన్నట్లు తెలిపారు. రాష్ట్రంలో గద్వాల్, పోచంపల్లి ఇక్కత్, గొల్లభామ చీరలు, వరంగల్ దుర్రీలు, నిర్మల్ చిత్ర కళలు, పెంబర్తి లోహ కళ, చర్యాల్ పెయింటింగ్స్ తదితర కళలను ప్రస్తావిస్తూ ముడి సరుకుల ధరల పెరుగుదల, యంత్రాలతో తయారైన ఉత్పత్తుల నుండి పోటీ, పరిమిత మార్కెట్ అనుసంధానం, బ్రాండింగ్, డిజిటల్ అను సంధానం వంటి సవాళ్లను పరిష్కరించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. కళాకారుల సంస్థలను బలోపేతం చేయడం, భౌగోళిక సూచిక (జీఐ) ఉత్పత్తులను ప్రోత్సహించడం, గ్రామీణ పారిశ్రామిక ఉత్పత్తి దారుల సంఘాలు, హస్తకళా క్లస్టర్లు, మహిళా నేతృత్వంలోని జీవనోపాధి కార్యక్రమాలకు నాబార్డ్ అందిస్తున్న మద్దతును ప్రశంసించారు జీఐ నమోదు కోసం చేస్తున్న ప్రయత్నాల వల్ల మార్కెట్ విలువను పెంచడానికి, గ్రామీణ జీవనోపాధిని బలోపేతం చేయడానికి, రాష్ట్ర సాంస్కృతిక, వ్యవసాయ వారసత్వాన్ని పరిరక్షించడానికి దోహదపడతాయని తెలిపారు. రిజర్వ్ బ్యాంక్ తెలంగాణ ప్రాంతీయ డైరక్టర్ చిన్మయ్ కుమార్ మాట్లా డుతూ దేశ వ్యాప్తంగా ఉన్న గ్రామీణ కళాకారులు, నేత కార్మికులను ఒకే వేదికపై తీసుకొచ్చి, వారికి మార్కెటింగ్ అవకాశాలను కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో 20కి పైగా రాష్ట్రాల నుండి 36 ప్రత్యేక భౌగోళిక సూచిక ఉత్పత్తులతో కూడిన ప్రత్యేక జీఐ పెవిలియన్ కూడా ప్రదర్శించబడుతోందని నాబార్డు అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నాబార్డు జనరల్ మేనేజర్ పి రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# దేశంలో మరో సత్యాగ్రహ పోరాటం మొదలు

**రాహుల్, ప్రియాంక గాంధీ అరెస్ట్ బిజెపి నిరంకుశ పాలనకు నిదర్శనం**

**ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న కేంద్రప్రభుత్వం**

**రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి కోమటిరెడ్డి**

**హైదరాబాద్,అక్టోబరు7,ప్రభాతవార్త:** లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలతో పాటు ఇండియా కూటమి ఎంపిలు, కాంగ్రెస్ నాయకుల అరెస్ట్‌లను రాష్ట్ర రోడ్లు భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. పోలీసులను అడ్డుపెట్టుకొని కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని బుధవారం విలేఖరులతో మాట్లాడుతూ ఆగ్రహం వ్యక్తం చేసారు. రాజ్యాంగబద్ధ సంస్థల పరిరక్షణపై రాహుల్ గాంధీ పోరాటం ద్వారా దేశంలో మరో సత్యాగ్రహ పోరాటం మొదలైందన్నారు. అందుకే బిజెపి భయపడి దేశ రాజధానిలో ఆంక్షలు విధించిందన్నారు.

ప్రజాస్వామ్యంలో నిరసన తెలపడం రాజ్యాంగబద్ధమైన హక్కు. కానీ బిజెపి పోలీసు బలగాలను అడ్డుపెట్టుకొని ప్రజాస్వా మ్యాన్ని నిర్బంధించాలని యత్నిస్తోందన్నారు ఇసి కార్యాలయం వైపు శాంతియుతంగా ర్యాలీగా వెళ్తున్న రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, పా ంల్ల వె ం ట్ న భ్యులకాం గ్రెన్ శ్రేణుల పట్ల పోలీసులు ప్రవర్తించిన తీరు అత్యంత హేయ మైనదన్నారు

ఎన్ని అణచివేత చర్యలకు పాల్పడినా, పోలీసు బలగాలతో నిర్బంధాలు విధిం చినా కాంగ్రెస్ పార్టీ ప్రజల తరఫున, రాజ్యాంగం, రాజ్యాంగబద్ధసంస్థల పరిరక్షణ కోసం పోరాటాన్ని ఆపేది లేదని మంత్రి స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి రాహుల్ గాంధీ నాయకత్వంలో జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేసే వరకు పోరాటం కొనసాగుతుందని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి తేల్చి చెప్పారు.

# ఊపందుకున్న యంగ్ ఇండియా స్కూళ్ల నిర్మాణాలు

## రాష్ట్ర వ్యాప్తంగా 105 నియోజకవర్గాల్లో స్కూళ్లకు ప్లాన్

## 87 చోట్ల వివిధ దశల్లో పాఠశాలల పనులు

## నిర్మాణాలకు రూ. 1,144.85 కోట్ల నిధులు విడుదల

## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కార్యాలయ ప్రకటన

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధిహైదరాబాద్,అక్టోబరు7:** విద్యా రంగానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎనలేని ప్రాముఖ్యతనిస్తున్నారు. చదువుతోనే అన్ని రంగాల్లో మార్పు సాధ్యమని నమ్మిన సీఎం విద్యా శాఖను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని బాల,బాలికలకు నాణ్యమైన విద్యనందించాలనే లక్ష్యంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల (వైఐఐఆర్ఎస్) ఏర్పాటుకు సీఎం శ్రీకారం చుట్టారు. విద్యార్థుల్లో సమైక్యత, సమగ్రత చిన్నతనం నుంచే పెంపొందించాలనే భిన్నమైన ఆలోచనతో, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలతో పాటు ఇతర వెనుకబడిన వర్గాల విద్యార్థులందరినీ ఒకే చోట కలిపి కులమతాలకతీతంగా అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందించేలా వైఐఐఆర్ఎస్‌లకు రూపకల్పన చేశారు. ప్రతి శాసనసభనియోజకవర్గంలో రెండు వైఐఐఆర్ఎస్‌లు నిర్మించనున్నారు. ఇందులో ఒకటి బాలికలకు, మరొకటి బాలురకు కేటాయిస్తారు. తొలి విడతలో 105 నియోజకవర్గాల్లో ఒక్కో వైఐఐఆర్ఎస్ నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో ఇప్పటికే 87 పాఠశాలలు నిర్మాణాలు వివిధ దశల్లో ఉండగా, మిగిలిన 18 పాఠశాలలకు పరిపాలన అనుమతుల ప్రక్రియ తుది దశకు చేరుకుంది. వీటి నిర్మాణాలకు ప్రభుత్వం ఇప్పటివరకు రూ.1,144.85 కోట్లు విడుదల చేసింది. ఈ మేరకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి కార్యాలయం బుధవారం సాయంత్రం ఓ ప్రకటన విడుదల చేసింది.

గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందించేలా వైఐఐఆర్ఎస్‌లకు రూపకల్పన చేశారు. ఆధునిక తరగతి గదులు, డిజిటల్ బోధనఅభ్యసన సౌకర్యాలు, అత్యాధునిక ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, విశాలమైన డార్మిటరీలు, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన క్రీడా మైదానాలు, డైనింగ్ బ్లాక్‌లు, బోధన, బోధనేతర సిబ్బందికి నివాస గృహాలతో ఈ పాఠశాలలను నిర్మిస్తున్నారు.ఇంజినీరింగ్ డిజైన్లు, ప్రస్తుత షెడ్యూల్ ఆఫ్ రేట్స్ ను ఆధారంగా చేసుకుని వైఐఐఆర్ఎస్ నిర్మాణ వ్యయ అంచనాలను పారదర్శకంగా రూపొందించారు. గతంలో నిర్మించిన సమీకృత జిల్లా కార్యాలయాల కంటే తక్కువ నిర్మాణ వ్యయంతోనే అత్యాధునిక వసతులు కలిగిన ఈ విద్యాసంస్థలను నిర్మిస్తున్నారు. 20 నుంచి 25 ఎకరాల్లో నిర్మించే ఒక్కో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్‌లో సుమారు 2,650 మంది విద్యార్థులకు వసతి కల్పించనున్నారు. మొత్తం నిర్మాణ విస్తీర్ణం సుమారు 5.36 లక్షల చదరపు అడుగులు ఉండేలా ప్రణాళిక రూపొందించారు.

ప్రభుత్వం తొలి దశల్లో 87 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లకు ప్రభుత్వం పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. వీటిలో 79 పాఠశాలల నిర్మాణ పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తయింది. వీటిలో 70 నియోజకవర్గాల్లో కాంట్రాక్టర్లు పాఠశాలల నిర్మాణ పనులు మొదలు పెట్టారు. రాష్ట్రవ్యాప్తంగా పనులు వేగంగా జరుగుతున్నాయి. పాలకుర్తి, ఆసిఫాబాద్, గజ్వేల్, ముథోల్, వరంగల్ పశ్చిమ నియోజకవర్గాల్లోని వైఐఐఆర్ఎస్‌లకు టెండర్ల ప్రక్రియ పూర్తయింది. కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. బోథ్, నిర్మల్ నియోజకవర్గాల్లో టెండర్ల పరిశీలన ప్రక్రియ కొనసాగుతోంది. శేరిలింగంపల్లి, సిర్పూర్, కామారెడ్డి, దుబ్బాక, సిరిసిల్ల, చంద్రాయణగుట్టలో పాఠశాలల నిర్మాణానికి అవసరమైన స్థలాలను ఇటీవలే కేటాయించారు. ప్రస్తుతం వాటికి సంబంధించిన డీపీఆర్‌ల తయారీలో యంత్రాంగం కసరత్తు చేస్తోంది. మహబూబ్‌నగర్, మిర్యాలగూడ, వర్ధన్నపేట, నర్సంపేట నియోజకవర్గాల్లో అనువైన స్థలాల కోసం అన్వేషణ సాగుతోంది.మొత్తం 105 నియోజకవర్గాల్లో ఇప్పటికే 87 పాఠశాలల నిర్మాణాలు వివిధ దశల్లో ఉండగా, మిగిలిన 18 నియోజకవర్గాలకు సంబంధించిన ప్రక్రియ కూడా వేగంగా ముందుకు సాగుతోంది. కోరుట్ల, జనగామ, హుజురాబాద్, కరీంనగర్, అలంపూర్, సిద్దిపేట, నర్సాపూర్, సంగారెడ్డి, జహీరాబాద్, ఎల్బీ నగర్, మహేశ్వరం, సూర్యాపేట, ఉప్పల్, బాల్కొండ, నిజామాబాద్, కూకట్‌పల్లి, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల్లో ఏర్పాటు చేయనున్న యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లకు సంబంధించిన అంచనాలు పూర్తయ్యాయి. ఈ పాఠశాలలకు త్వరలోనే పరిపాలనపరమైన అనుమతులను ప్రభుత్వం మంజూరు చేయనుంది. అనుమతులు లభించిన వెంటనే ఆ నియోజకవర్గాల్లోనూ టెండర్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థులకు ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలకు ఏమాత్రం తీసిపోని స్థాయిలో విద్యా వాతావరణం కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణాన్ని అత్యంత ప్రాధాన్యంతో ముందుకు తీసుకెళుతోంది. పరిపాలన అనుమతులు, టెండర్లు, నిధుల విడుదల, నిర్మాణాల పురోగతి అన్నీ సమాంతరంగా సాగుతుండటంతో రాష్ట్రవ్యాప్తంగా ఈ ఆధునిక విద్యా ప్రాంగణాలు త్వరలోనే అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

# సమర్థవంతంగా పని చేసి మంచి పేరు తేవాలి

## ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అవినాశ్ మహంతి

**హైదరాబాద్, అక్టోబరు 7,ప్రభాతవార్త:**ఎక్సైజ్‌శాఖ సిబ్బంది సమర్థవంతంగా పనిచేసి శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఎక్సైజ్ ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అవినాశ్ మహంతి అన్నారు. ఈమేరకు బుధవారం ఎక్సైజ్‌శాఖలో గంజాయి, డ్రగ్స్, ఆల్ప్రజోలం,నాన్‌డ్యూటి పెయిడ్ లిక్కర్‌ను పట్టుకున్న టీమ్‌లకు నగదు రివార్డులను అందించారు. ఖమ్మం, మల్కాజిగిరి, సైబరాబాద్, నల్లగొండ, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాలో 16 టీమ్‌లకు నగదు రివార్డులను డైరెక్టర్ అందించారు. ఎక్సైజ్ శాఖ టీమ్‌లతో కలిసి పని చేసిన డ్రగ్ ఇన్‌స్పెక్టర్ చైతన్యకు కూడ ప్రసంశపత్రంతోపాటు క్యాష్ రావార్డును అందించారు. ఈకార్యక్రమంలో ఎక్సైజ్ జాయింట్ డైరెక్టర్ జి.అంజన్‌రావు, అసిస్టెంట్ కమిషనర్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నాగేందర్‌రెడ్డిలు ఉన్నారు.



# ఢిల్లీలో నాలుగు అంతస్తుల భవనం కూలి చిన్నారి మృతి

**న్యూఢిల్లీ, అక్టోబరు 7:** ఈశాన్య ఢిల్లీలోని సీమాపురి ప్రాంతంలో బుధవారం నాలుగు అంతస్తుల భవనం కుప్పకూలిన ఘటనలో ఓ చిన్నారి మృతి చెందింది. ఇప్పటివరకు ఎనిమిది మందిని సహాయక బృందాలు సురక్షితంగా బయటకు తీసినట్లు అధికారులు తెలిపారు. ఘటనపై డీసీపీ రాజేంద్ర ప్రసాద్ మీనా మాట్లాడుతూ భవనం కూలిన ఘటనలో చిన్నారి తల తెగిపోయి మృతి చెందినట్లు వెల్లడించారు. భవనం శిథిలాల కింద మరికొందరు చిక్కుకుని ఉండొచ్చన్న అనుమానంతో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో భవనం కూలిపోయినట్లు ఢిల్లీ ఫైర్ సర్వీస్‌కు సమాచారం అందింది. వెంటనే అగ్నిమాపక వాహనాలు, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని గాలింపు, సహాయక చర్యలు చేపట్టారు.

# ఓటర్ల జాబితా సవరణలో అక్రమాలు: తెలంగాణలో తొలి ఎఫ్ఐఆర్

## ముషీరాబాద్ నియోజకవర్గంలో 30ఓట్ల తొలగింపు?

## బిజెపి బూత్ లెవెల్ ఏజెంట్‌పై చిక్కడపల్లి ఠాణాలో కేసు నమోదు

## క్షేత్రస్థాయి విచారణలో నిజాలు నిర్ధారించిన ఎన్నికల అధికారులు

## సిట్ విచారణకు కాంగ్రెస్, ఎంఐఎం డిమాండ్.. ఆరోపణలను ఖండించిన బిజెపి

**హైదరాబాద్(చిక్కడపల్లి), అక్టోబరు 7 ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ఫారం7 దుర్వినియోగానికి సంబంధించి తెలంగాణలోనే తొలిసారిగా పోలీసు కేసు నమోదైంది. ముషీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో 30 మంది ఓటర్ల పేర్లను జాబితా నుంచి అక్రమంగా తొలగించేందుకు కుట్ర పన్నారనే ఆరోపణలపై భారతీయ జనతా పార్టీ (బీజేపీ) బూత్ లెవెల్ ఏజెంట్ ఎస్. బాలచందర్‌పై చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ దాఖలైంది. ముషీరాబాద్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఈఆర్ఓ) టి. ప్రవీణ్ కుమార్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ముషీరాబాద్ నియోజకవర్గంలోని సూర్యనగర్ పోలింగ్ స్టేషన్ (నెం. 210) పరిధిలో సెప్టెంబర్ 28న ఈ ఘటన చోటుచేసుకుంది. సంబంధిత పోలింగ్ స్టేషన్ పరిధికి చెందిన 30 మంది ఓటర్లు శాశ్వతంగా వేరే ప్రాంతానికి తరలివెళ్లారని చూపుతూ, వారి ఓట్లను తొలగించాలంటూ బీజేపీ బూత్ ఏజెంట్ ఎస్. బాలచందర్ ముద్రించిన 30 ఫారం7 దరఖాస్తులను సమర్పించారు. అయితే ఈ దరఖాస్తులను మూకుమ్మడిగా స్వీకరించేందుకు అధికారులు నిరాకరించడంతో ఆయన ఆ పత్రాలను అక్కడే వదిలివెళ్లినట్లు సమాచారం. ముషీరాబాద్ నియోజకవర్గంలోని సూర్య నగర్ పోలింగ్ స్టేషన్ నెం. 210 పరిధిలో ఎస్. బాలచందర్ అనే బీజేపీ బూత్ ఏజెంట్, 30 మంది ఓటర్ల పేర్లను తొలగించాలని కోరుతూ సెప్టెంబర్ 28న ఫారం7 దరఖాస్తులను సమర్పించారు. బాధితులంతా ముస్లిం వర్గానికి చెందినవారే. అధికారులు వాటిని మూకుమ్మడిగా స్వీకరించేందుకు నిరాకరించడంతో, అతను ఆ పత్రాలను అక్కడే వదిలివెళ్లినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై ముషీరాబాద్ నియోజకవర్గ ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి టి. ప్రవీణ్ కుమార్ చిక్కడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్షేత్రస్థాయిలో ఎన్నికల అధికారులు జరిపిన విచారణలో ఆ 30 మంది ఓటర్లు వారి చిరునామాల్లోనే నివసిస్తున్నట్లు నిర్ధారణ అయింది. దీంతో, దురుద్దేశంతోనే బాలచందర్ ఈ చర్యకు పాల్పడ్డారని ఈఆర్ఓ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు బాలచందర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఎలాంటి ఆధారాలు లేకుండా, తప్పుడు సమాచారంతో అధికారులను తప్పుదారి పట్టించి ఓట్లను తొలగించేందుకు దురుద్దేశపూర్వకంగానే ఈ చర్యకు పాల్పడ్డారని ఈఆర్ఓ నిర్ధారణకు వచ్చారు. దీంతో ఆయన ఇచ్చిన అధికారిక ఫిర్యాదు ఆధారంగా చిక్కడపల్లి పోలీసులు ఏజెంట్ బాలచందర్ తో పాటు మరికొందరిపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 217 (ప్రభుత్వ అధికారికి అసత్య సమాచారం ఇవ్వడం), సెక్షన్ 318(2) (చీటింగ్/మోసం) ప్రజా ప్రాతినిధ్య చట్టం 1950 లోని సెక్షన్ 31 (ఓటర్ల జాబితా విషయంలో తప్పుడు ప్రకటనలు చేయడం) కింద కేసులునమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. తెలంగాణలో ఫామ్7 దుర్వినియోగంపై నమోదు అయిన తొలి పోలీసు కేసు ఇది కావడం గమనార్హం.

**చట్టపరమైన నిబంధనలకు కట్టుబడి విచారణ చేపడుతున్నాం: చిక్కడపల్లి ఏసీపీ రణవీర్ రెడ్డి**

బి.ఎన్.ఎస్ సెక్షన్లు 217, 318(2) ప్రజా ప్రాతినిధ్య చట్టం 1950 సెక్షన్ 31 కింద బాలచందర్‌పై నమోదైన కేసుపై చిక్కడేపల్లి అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ రణవీర్ రెడ్డి స్పందించారు. ఈ కేసుకు సంబంధించి చట్టపరమైన ప్రక్రియ వివరాలను ఆయన ప్రభాతవార్తకు వెల్లడించారు. భారతీయ నాగరిక్ సురక్ష సంహిత చట్ట నిబంధనల ప్రకారం తమ పరిధికి లోబడి విచారణ జరుపుతున్నామన్నారు. నిందితుడికి బిఎన్ఎస్ఎస్ సెక్షన్ 35 కింద అధికారికంగా నోటీసు జారీ చేసి విచారణకు హాజరుకావాలని ఆదేశించడం జరుగుతుందన్నారు. నాన్‌కాగ్నిజబుల్ కేసు కావడంతో సంబంధిత జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ అనుమతి ఆదేశాల మేరకే తదుపరి చర్యలు ఉంటాయన్నారు. విచారణకు సహకరించని పక్షంలో లేదా కోర్టు ప్రత్యేకంగా అరెస్ట్ వారెంట్ జారీ చేస్తే తప్పసాధారణ పరిస్థితుల్లోఅరెస్టుఉంటుం దన్నారు.

**రాజకీయ కలకలం - తీవ్ర స్థాయిలో విమర్శలు:కాంగ్రెస్, ఎంఐఎం నిరసనలు:** ఈ ఘటన హైదరాబాద్‌తో పాటు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర కలకలం రేపింది. ముస్లిం మైనారిటీల ఓట్లను లక్ష్యంగా చేసుకుని ముందస్తు ప్రణాళికతోనే ఈ కుట్రకు పాల్పడ్డారని కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలు మండిపడ్డాయి. దీనివెనుక ఉన్న ప్రధాన సూత్రధారులను తేల్చేందుకు ప్రత్యేక విచారణ బృందం తో సమగ్ర దర్యాప్తు జరిపించాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. ఈ ఆరోపణలను బీజేపీ తీవ్రంగా ఖండించింది. నిబంధనల ప్రకారమే ఏజెంట్లు సమాచారాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్తారని, కావాలనే తమ పార్టీపై బురద జల్లేందుకు ప్రయత్నిస్తున్నారని బీజేపీ నేత లు స్పష్టం చేశారు.ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఫారం7 దుర్వినియోగంపై తెలంగాణలో నమోదైన తొలి ఎఫ్ఐఆర్ ఇదే కావడంతో ఎన్నికల యంత్రాంగం కూడా ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణిస్తోంది.



# ప్రధాని మోడీకి సెర్బియా మాజీ అధ్యక్షుడు ప్రశంస

**న్యూఢిల్లీ, అక్టోబరు 7:** భారత ప్రధాని నరేంద్ర మోడీపై సెర్బియా మాజీ అధ్యక్షుడు అలెగ్జాండర్ వుచిచ్ చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. మోడీపై ప్రశంసలు కురిపించిన ఆయన, ఇదే సమయంలో మోడీని బలహీనపరిచేందుకు, ఆయన ప్రతిష్టను దెబ్బతీసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. మోడీ నాయకత్వంతో భారత్ అంతర్జాతీయ వేదికపై కీలక శక్తిగా ఎదిగిందని అన్నారు. ఓ పోడ్‌కాస్ట్‌లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోడీ ప్రభుత్వ అధినేతగా 25 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా వుచిచ్ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా, ఆ తర్వాత ప్రధానమంత్రిగా దేశానికి సేవలందిస్తూ 25 ఏళ్ల మైలురాయిని చేరుకున్నారని ప్రశంసించారు. నరేంద్ర మోడీ వంటి నాయకుడిని బలహీన పరిచేందుకు ఇప్పుడు ప్రయత్నాలు జరుగుతున్నాయి. మోడీ భారత్‌ను ఉన్నత స్థాయికి తీసుకెళ్లారు. మహాత్మా గాంధీ బోధనలను అనుసరించేందుకు ఆయన ప్రయత్నిస్తున్నారని అన్నారు. మోడీ కారణంగానే ప్రపంచవేదికపై భారత ప్రాధాన్యత పెరిగిందని వుచిచ్ పేర్కొన్నారు. భారత్ ఒక గొప్ప శక్తిగా ఎదిగిందని, మోడీ ఎన్నో గొప్ప పనులు చేశారని, అయినప్పటికీ ఆయన విఫలమయ్యారని, ఆయనకు ఏమీ తెలియదని చెప్పడం ద్వారా ఆయనను కిందకు దించేందుకు ప్రయత్నిస్తున్నారని వ్యాఖ్యానించారు.అయితే, మోడీని ఎవరు బలహీనపరుస్తు న్నారో, ఆ ప్రయత్నాలుఎలా జరుగుతున్నాయనే వివరాలను ఆయన ప్రస్తావించలేదు. ప్రస్తుతం ఆయన చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ వీడియోను బీజేపీ శ్రేణులు షేర్ చేస్తున్నాయి. ప్రపంచ నాయకులు మోడీ గురించి ఇలా మాట్లాడుతున్నారంటే అన్నీ అర్థమవుతున్నాయి, మోడీ నాయకత్వంలో భారత్ ఎదుగుతోందని, దీనిని ప్రపంచం గమనిస్తోందని బీజేపీ పేర్కొంది. కాక్రోచ్ జనతా పార్టీ, విపక్షాలు ఆందోళన నిర్వహిస్తున్న ఈ సమయంలో వుచిచ్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

# మూసీ ఒడ్డున ఓంకారేశ్వర ఆలయ అభివృద్ధికి రూ.1,108 కోట్లు

## పరిపాలనా అనుమతులు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసిన సర్కార్

**హైదరాబాద్,అక్టోబరు7,ప్రభాతవార్త:** హైదరాబాద్ నగర శివారులో మూసీ నది పరివాహక ప్రాంత అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. గండిపేట మండలం మంచిరేవుల పరిధిలోని ఓంకారేశ్వర స్వామి ఆలయ సముదాయ అభివృద్ధికి భారీ మొత్తంలో నిధులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆలయ అభివృద్ధితో పాటు ఆరు లేన్ల రోడ్డు నిర్మాణానికి భారీగా నిధులను కేటాయించింది. మొత్తం రూ.1,108.27 కోట్లకు పరిపాలనా అనుమతులు మంజూరు చేస్తూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం సోమవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జీవో నంబర్ 928ను విడుదల చేసింది. మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధిలో భాగంగా చేపట్టనున్న ఈ పనులతో మంచిరేవుల ఓంకారేశ్వర ఆలయానికి మెరుగైన మౌలిక వసతులు, రహదారి కనెక్టివిటీ కల్పించనున్నారు. ఆలయ సముదాయ అభివృద్ధికి ప్రత్యేకంగా రూ.948.65 కోట్లు కేటాయించగా.. ఆరు లేన్ల రహదారి నిర్మాణానికి రూ.159.62 కోట్లు కేటాయించారు. మంచిరేవులలో ప్రతిపాదించిన ఓంకారేశ్వర స్వామి ఆలయ సముదాయంలో పలు నిర్మాణాలు చేపట్టనున్నారు. రాజగోపురాలు, యాగశాల, పుష్కరిణి వంటి నిర్మాణాలతో ఆలయ ప్రాంగణాన్ని సుందరంగా అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

మూసీ నది తీర ప్రాంతాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలన్న ప్రణాళికలో భాగంగానే ఈ ఆలయ సముదాయాన్ని నిర్మిస్తున్నారు. గతంలో మంచిరేవులలోని పురాతన వీరభద్రస్వామి ఆలయ ప్రాంగణంలో ఓంకారేశ్వర మందిర నిర్మాణానికి సంబంధించిన ప్రణాళికలను ప్రభుత్వం ప్రకటించింది. ఆలయానికి మెరుగైన రహదారి సౌకర్యం కల్పించేందుకు 6 లేన్ల రోడ్డును నిర్మించనున్నారు. సుమారు 30 మీటర్లు అంటే 100 అడుగుల వెడల్పుతో ఈ రహదారి నిర్మాణం చేపట్టనున్నారు.

ఇస్తానా విల్లాస్ నుంచి కీర్తి వెస్ట్‌విండ్ విల్లాస్ వరకు సుమారు 2.50 కిలోమీటర్ల మేర ఈ రహదారి నిర్మించనున్నారు.

ఈ మార్గం గ్రేహౌండ్స్, యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ ప్రాంతాలకు కూడా అనుసంధానం కానుంది. అలాగే మూసీ రివర్‌ఫ్రంట్ రోడ్ నెట్‌వర్క్‌తో ఓంకారేశ్వర ఆలయ సముదాయానికి మెరుగైన కనెక్టివిటీ ఏర్పడనుంది. ఓంకారేశ్వర ఆలయ అభివృద్ధి పనుల కోసం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక టెక్నికల్ కమిటీని కూడా ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి ఆర్‌అండ్‌బీ ఇంజినీరింగ్ చీఫ్ ఛైర్మన్‌గా వ్యవహరించనున్నారు.

పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ చీఫ్ కో ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించనున్నారు. ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని టెక్నికల్ అంశాలు, నిర్మాణ పనులు, మౌలిక వసతులపై ఈ కమిటీ పర్యవేక్షణ చేయనుంది.

మూసీ నది పరివాహక ప్రాంతాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక, సాంస్కృతిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పలు ప్రణాళికలను రూపొందించింది.

మంచిరేవులలోని పురాతన ఆలయాల అభివృద్ధితో పాటు ఓంకారేశ్వర ఆలయ నిర్మాణాన్ని కూడా ఈ ప్రణాళికలో భాగంగా తీసుకున్నారు. మూసీ నది తీరాన్ని అంతర్జాతీయ స్థాయి పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్తోంది. ఇందులో భాగంగా బాపూఘాట్ వద్ద గాంధీ సరోవర్, మహాత్మా గాంధీ విగ్రహం, మ్యూజియం, ధ్యాన కేంద్రం వంటివి నిర్మించాలనే ప్రతిపాదనలు కూడా ఉన్నాయి.

అదే సమయంలో మూసీ పరివాహక ప్రాంతంలో మత సామరస్యానికి ప్రతీకగా వివిధ ప్రార్థనా స్థలాలను అభివృద్ధి చేయాలన్న ప్రణాళికలు కూడా రేవంత్ రెడ్డి ప్రభుత్వం వెల్లడించింది.

ఈ నేపథ్యంలో మంచిరేవుల ఓంకారేశ్వర ఆలయ ప్రాజెక్టుకు ప్రాధాన్యం ఏర్పడింది. మొత్తంగా రూ.1,108.27 కోట్లతో ఆలయ సముదాయం, 6 లేన్ల రహదారి నిర్మాణానికి పరిపాలనా అనుమతులు రావడంతో మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధిలో ఈ ప్రాజెక్టు కీలకంగా మారనుంది.

# మహిళా సాధికారతకు కొత్త అడుగు.. జిల్లాల్లో ఇందిరా మహిళా శక్తి భవనాలు: సీఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్,అక్టోబరు7,ప్రభాతవార్త:** తెలంగాణలో మహిళా శక్తికి సరికొత్త వేదికలు రూపుదిద్దుకున్నాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. రాష్ట్రంలోని జిల్లాల వారీగా నిర్మాణం పూర్తిచేసుకుని ప్రారంభానికి ముస్తాబైన ఇందిరా మహిళా శక్తి భవనాలు మన ఆడబిడ్డల ఆత్మగౌరవానికి, ఆర్థిక స్వావలంబనకు సరికొత్త నిలయాలుగా మారబోతున్నాయని పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా సీఎం పోస్టు పెట్టారు. మన స్వయం సహాయక సంఘాల మహిళా సోదరీమణులను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో.. శిక్షణ, ఉపాధి అవకాశాలు, ఉత్పత్తుల తయారీ నుంచి గ్లోబల్ మార్కెట్లలో విక్రయాల వరకు అవసరమైన ప్రతి అవకాశాన్ని ఒకే వేదికపై అందించేందుకు ఈ భవనాలు కీలక కేంద్రాలుగా నిలవనున్నాయని తెలిపారు. ఒక ఆడబిడ్డకు అవకాశం లభిస్తే.. ఒక కుటుంబం భవిష్యత్తు మారుతుందని ఉద్ఘాటించారు. రాష్ట్రంలో మహిళలకు అవకాశాలు పెరిగితే.. తెలంగాణ మరింత అభివృద్ధి చెందుతుందని ముఖ్యమంత్రి వివరించారు. 'మహిళా ఉన్నతి తెలంగాణ ప్రగతి అనే ఆశయంతో.. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం మహిళల ఆర్థిక సాధికారతకు మరింత ఊతమిస్తూ, తెలంగాణ ప్రగతి ప్రయాణాన్ని మరింత వేగవంతం చేస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# రంగు రుచి వాసన కల్తీ

>>సందర్శింస్తే వాంతులు రావడం ఖాయం. ఏమాత్రం పరిశుభ్రతను పాటించకుండా, బొద్దింకలు, ఈగలు వాలు తూ కనిపిస్తాయి. ఇక ఆహార పదార్థాలను పరిశీలిస్తే కడుపు తిప్పి స్పృహ కోల్పోయే పరిస్థితి ఎదురౌతుంది. వారం, పదిరోజుల క్రితం వంటకు సిద్ధం చేసిన చికెన్, మటన్, చేపలు అక్కడ కనిపిస్తాయి. అవి పూర్తిగా కుళ్లిపోయి దుర్గంధం వెలుడుతూ ఉంటాయి. ఈ దుర్గంధాన్ని నివారించేందుకు పరిశ్రమల్లో వాడే కెమికల్స్ వేసి వాటిని తాజాగా కనిపించేలా చేస్తారు. ఇక నూనెల విషయానికి వస్తే పశువుల మాంసం నుంచి తీసిన నూనెలను కొందరు వాడుతుంటే, నాలుగైదు రోజులుగా ఒకే నూనెను పదేపదే వాడుతూ కేన్సర్‌ను ఆహ్వానించే రీతిలో వంటకాలు కొనసాగిస్తున్నారు. హోటళ్ళు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు విషాహారాన్ని అందిస్తున్నాయని ఫిర్యాదులు రావడంతో ప్రభుత్వం హైదరాబాద్ ఫుడ్ అడల్టరేషన్ సర్వైలెన్స్ టీమ్ (హెచ్ ఫాస్ట్) అధికారుల బృందాన్ని ఏర్పాటుచేసింది. ఈ బృందం జరుపుతున్న దాడుల్లో అనేక దారుణాలు వెలుగులోకి వస్తున్నాయి, మసాలా దినుసుల నుంచి మాంసం, పన్నీర్, నెయ్యి, టీ పొడి, అల్లం వెల్లుల్లి పేస్ట్ వరకు పలు ఆహార పదార్థాల్లో కల్తీ వ్యవహారాలు బయటపడటం ఆందోళన కలిగిస్తోంది. హైదరాబాద్ పోలీసుల సమాచారం ప్రకారం, హెచ్ ఫాస్ట్ ఏర్పాటైన తొలి 140 రోజుల్లో నగరవ్యాప్తంగా 659 దాడులు నిర్వహించి 202 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో సుమారు 246 టన్నుల కల్తీ లేదా నాణ్యత లేని ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. మరో 232 కేసులను తదుపరి నియంత్రణ చర్యల కోసం ఆహార భద్రత అధికారులకు పంపించారు. ఈ గణాంకాలు నగరంలో ఆహార భద్రత పర్యవేక్షణ ఎంత కీలకంగా మారిందో తెలియజేస్తున్నాయి. హోటళ్లలో వాడే ప్రతి వంటల తయారీలో నిల్వ, ప్రాసెసింగ్, సరఫరా, విక్రయ కేంద్రాలు అన్నీ కుళ్లిన, రసాయనాలు కలిపిన పదార్థాలు ఉంటున్నాయని గుర్తించారు.

**మసాలా దినుసుల్లో పారిశ్రామిక రంగులు:** ఆగస్టు 2026లో నిర్వహించిన ప్రత్యేక దాడుల్లో సుమారు 25 టన్నుల కల్తీ మసాలా దినుసులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. జీలకర్ర, వాము, లవంగాలు, షాజీరా, ఆవాలు వంటి పదార్థాల్లో సింథటిక్ రంగులు కలిపి నాణ్యమైనవిగా కనిపించేలా చేయడం, మసాలాలకు ఆకర్షణీయమైన రూపం తీసుకురావడానికి పారిశ్రామిక రంగులు ఉపయోగించడం వంటి అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. ఈ వ్యవహారంలో ముగ్గురిని అరెస్టు చేసి, ప్రమాదకర రసాయనాలతో కూడిన కల్తీకి సంబంధించి భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్ 110ను కూడా ప్రయోగించారు.

**కుళ్లిన మాంసం నుంచి నకిలీ పన్నీర్ వరకు:** అధికారుల తనిఖీల్లో అల్లంవెల్లుల్లి పేస్ట్ తయారీలో కుళ్లిన ఉత్పత్తులు, రసాయనాలు ఉపయోగించినట్లు గుర్తించి 27 టన్నులకు పైగా పేస్ట్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. అదేవిధంగా 12 టన్నులకు పైగా కుళ్లిన చికెన్, మటన్‌ను హోటళ్లు ఉపయోగిసునతన్నట్లు గుర్తించారు. సుమారు 60 టన్నుల దుర్వాసన వస్తున్న చికెన్ వ్యర్థాలు, రసాయనాలతో మగ్గించినట్లు పరీక్షల్లో తేలింది. 25.8 టన్నుల పండ్లు, 9.2 టన్నుల కల్తీ ఊరగాయలు, 3.8 టన్నుల కల్తీ టీ పొడిని స్వాధీనం చేసుకున్నారు. యూరియా, డిటర్జెంట్లు, పామాయిల్ వంటి పదార్థాలతో సింథటిక్ పన్నీర్ తయారు చేస్తున్నట్లు కూడా గుర్తించారు. నెయ్యి కల్తీపై కూడా అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. నగరంలో 39 నెయ్యి తయారీ యూనిట్లు, 91 రిటైల్ విక్రయ కేంద్రాలు కలిపి 130 సంస్థల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 25.5 టన్నుల కల్తీ నెయ్యి, 8.7 టన్నుల పాల క్రీమ్, 1,200 లీటర్ల పామాయిల్, 600 లీటర్ల వనస్పతి తదితర పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. సేకరించిన నమూనాలను ప్రయోగ శాలలకు పంపి పరీక్షలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. హోటళ్లు, స్వీట్ల తయారీ కేంద్రాలు, బేకరీలు, క్యాటరింగ్ సంస్థలకు ఇలాంటి ఉత్పత్తులు సరఫరా అయ్యే అవకాశం ఉన్నందున సరఫరా వ్యవస్థపై నిఘా అవసరమని ఈ వ్యవహారం సూచిస్తోంది.

**ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాల్లోనూ ఉల్లంఘనలు:** చాంద్రాయణగుట్ట లోని రెండు చైనీస్ ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాల్లో నిర్వహించిన తనిఖీల్లో తిరిగి ఉపయోగించిన వంటనూనె, కృత్రిమ రంగులు కలిపిన చికెన్, పరిశుభ్రతా లోపాలను అధికారులు గుర్తించారు. సుమారు 20 లీటర్ల తిరిగి ఉపయోగించిన నూనెతో పాటు ఇతర పదార్థాలను స్వాధీనం చేసుకుని రెండు కేసులు నమోదు చేశారు. ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. మరోవైపు, చార్మినార్ ప్రాంతంలోని లైసెన్స్ లేని ఆహార నిల్వ కేంద్రంలో సుమారు 110 కిలోల తయారుచేసిన చికెన్, 90 లీటర్ల వంటనూనె, కృత్రిమ రంగులను స్వాధీనం చేసుకున్నారు. కలుషిత ఆహారం వల్ల వాంతులు, విరేచనాలు, కడుపునొప్పి, ఆహార విషబాధ వంటి సమస్యలు తలెత్తవచ్చు. ఆహారానికి అనుమతిలేని పారిశ్రామిక రంగులు, రసాయనాలు కలపడం వల్ల మరింత తీవ్రమైన ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది. అయితే ప్రతి ఉల్లంఘనకు ఒకే స్థాయి ప్రమాదం ఉండదని, పదార్థం స్వభావం, పరిమాణం, వినియోగ వ్యవధి ఆధారంగా ప్రభావం మారుతుందని నిపుణులు సూచిస్తున్నారు. ఇప్పటికే నగరంలోనే అనేక హోటళ్లు, రెస్టారెంట్లను సీజ్ చేశారు. అధికారుల దాడులతో ఆహార కల్తీ విషయంలో అటు హోటల్ నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కుళ్లిన, విషపదార్థాలు కలిపిన, నాసిరకం ఆహారఉత్పత్తులను వినియో గించకుండా చర్యలుచేపడుతున్నారు. అయినప్పటికీ మెజారిటీ హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు మాత్రం ఇంకా యథేచ్ఛగా నిబంధనలు అతిక్రమి స్తున్నారు. కల్తీ విషయంలో ప్రజలు కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ఎక్కడైనా ఆహారం కల్తి జరిగిందనో, కుళ్లిన పదార్థాలు ఉన్నాయనో అనుమానం కలిగితే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరు తున్నారు.

**హెచ్ ఫాస్ట్ బృందంలో సమన్వయం చేసే అధికారులు, విధులు**

**హైదరాబాద్ సిటీ పోలీసులు:** నిఘా, దాడులు, కేసులు అరెస్టులు **ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్:** ఆహార నమూనాలు, ఎఫ్ఎస్ఎస్ఏఐ నిబంధనలు, సీజ్ చేయడం, నియంత్రణ చర్యలు **జిహెచ్ఎంసి ఫుడ్ సేఫ్టీ విభాగం: హోటళ్లు, రెస్టారెంట్లు, తయారీ కేంద్రాల తనిఖీలు**

**జిహెచ్ఎంసి వెటర్నరీ విభాగం:** మాంసం, చికెన్, మటన్, జంతు ఉత్పత్తుల నాణ్యతకు సంబంధించిన తనిఖీలు

**లాబొరేటరీ /ఫుడ్ టెస్టింగ్ విభాగం :** సేకరించిన ఆహార నమూనాలు శాస్త్రీయ పరీక్షలు, పరీక్షల ఫలితాల ఆధారంగా తదుపరి చర్యలు.

# దుబాయ్ బతుకమ్మ వేడుకలకు బిఆర్ఎస్ ప్రతినిధుల బృందం

హైదరాబాద్,అక్టోబరు7,ప్రభాతవార్త:తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను దుబాయ్‌లో ఘనంగా నిర్వహించనున్న రెండు ప్రత్యేక బతుకమ్మ వేడుకలకు బీఆర్ఎస్ ప్రతినిధుల బృందం హాజరుకానుంది.ఎమిరేట్స్ తెలంగాణ కల్చరల్ అసోసియేషన్(ఇటిసిఏ)గల్ఫ్ తెలంగాణ ఫెడరేషన్(జిటిఎఫ్) ప్రతినిధులు చేసిన అహ్వానాల మేరకు,బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాలతో ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేల బృందం ఈ వేడుకల్లో పాల్గొననుంది.ఇటిసిఏ ప్రతినిధులు గత నెలలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసి దుబాయ్‌లో నిర్వహించనున్న బతుకమ్మ వేడుకలకు ఆహ్వానించారు. అదే విధంగా గల్ఫ్ తెలంగాణ ఫెడరేషన్(జిటిఎఫ్) కూడా తమ ఆధ్వర్యంలో నిర్వహించే జిటిఎఫ్ బతుకమ్మ సంబరాలు-2026 కార్యక్రమానికి కేటీఆర్‌ను ఆహ్వానించింది. రెండు సంస్థల ఆహ్వానాలను స్వీకరించిన కేటీఆర్, బీఆర్ఎస్ ప్రతినిధుల బృందం ఈ వేడుకల్లో పాల్గొనాలని సూచించారు.అక్టోబర్ 11, ఆదివారం దుబాయ్‌లోని శబాబ్ అల్ అహ్లీ స్పోర్ట్స్ క్లబ్‌లో మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఇటిసిఏ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించనున్నారు. అదే రోజు జిటిఎఫ్ ఆధ్వర్యంలో జిటిఎఫ్ బతుకమ్మ సంబరాలు-2026" కార్యక్రమం అల్ ఖుసైస్‌లోని అమిటీ స్కూల్‌లో మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు జరగనుంది.తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, తెలంగాణ సంస్కృతి-సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మను ఎడారి దేశమైన దుబాయ్‌లో వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. రెండు కార్యక్రమాల్లోనూ దుబాయ్‌లోని తెలంగాణ ప్రవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొననున్నారు.ఈ వేడుకల్లో మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి (బాల్కొండ ఎమ్మెల్యే), కల్వకుంట్ల సంజయ్ కుమార్ (కోరుట్ల ఎమ్మెల్యే), బాజిరెడ్డి గోవర్ధన్ (మాజీ ఎమ్మెల్యే, నిజామాబాద్ రూరల్), ఆశన్నగారి జీవన్ రెడ్డి (మాజీ ఎమ్మెల్యే, ఆర్మూర్), బిగాల గణేష్ గుప్తా (మాజీ ఎమ్మెల్యే, నిజామాబాద్ అర్బన్), సురేందర్ (మాజీ ఎమ్మెల్యే, ఎల్లారెడ్డి), షకీల్ అహ్మద్ (మాజీ ఎమ్మెల్యే, బోధన్) తదితరులు పాల్గొననున్నారు.

# ఢిల్లీలో రాహుల్ నిరసనకు అఖిలేష్ దూరం

**న్యూఢిల్లీ, అక్టోబరు 7:** ఢిల్లీలో ఎన్నికల సంఘం నిర్వహించి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌కు వ్యతిరేకంగా, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం కాంగ్రెస్ నేతృత్వంలో ఇండియా కూటమి నేతలు భారీ నిరసన చేశారు. జంతర్ మంతర్ వద్ద నిరనసన తెలిపేందుకు వెళ్లిన రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీలతో పాటు కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష ఎంపీలను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ నిరసనల్లో సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) పాల్గొనలేదు. అఖిలేష్ యాదవ్ ఈ నిరసనలకు దూరంగా ఉన్నారు. పార్టీ నేతలు కూడా ఎవరూ ఢిల్లీలో కనిపించలేదు. దీంతో రెండు పార్టీల మధ్య విభేదాలు తారాస్థాయికి వెళ్లాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. మరోవైపు, ఎస్పీ నేతలు బుధవారం నిరసనల గురించి తమకు సమాచారం లేదని చెప్పడం గమనార్హం. ఢిల్లీలో కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఏర్పాటు చేసిన లంచ్ మీటింగ్‌కు తమకు సమాచారం లేదని తొలుత కొందరు ఎస్పీ నేతలు చెప్పగా, కాంగ్రెస్ అగ్ర నాయకత్వం నుంచి తమకు ప్రత్యేకంగా సమాచారం లేదని మరో ఎస్పీ వర్గం చెబుతోంది. అయితే, ఈ వాదనల్ని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ ఖండించారు. ఇండియా కూటమిలోని అన్ని పార్టీలను లంచ్‌కు ఆహ్వానించామని, అయితే మంగళవారం రాత్రి ఆలస్యంగా కార్యక్రమాన్ని ఖరారు చేసి సమాచారం ఇవ్వడంతో కొన్ని పార్టీలు హాజరుకాలేకపోయాయని చెప్పారు. 2027 ఉత్తర్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్‌ఎస్పీల మధ్య సీట్ల పంపకాల పంచాయతీ ముదిరింది. ఉత్తర్ ప్రదేశ్‌లో మొత్తం 403 స్థానాలు ఉంటే, కనీసం 150 సీట్లు తమకు కావాలని కాంగ్రెస్ నేతలు ఎస్పీపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు కాంగ్రెస్‌కు 50 సీట్లే ఎక్కువ అని ఎస్పీ నేతలు బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు. క్షేత్రస్థాయిలో బలాన్ని చూసుకుని సీట్లు అడగాలని అంటున్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఆ మాత్రం ఎంపీ సీట్లు రావడానికి ఎస్పీతో పొత్తే కారణమని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ఆ ఎన్నికల్లో రెండు పార్టీలు కలిసి పోటీ చేస్తే ఎస్పీ 37, కాంగ్రెస్ 06 ఎంపీ సీట్లు గెలుచుకున్నాయి.

## సిబిఐ అధికారులపై కేసు నమోదుచేయాలని ఆదేశం

## తప్పుడు కేసులు నమోదుచేయడంపై హైకోర్టు ఆగ్రహం




**న్యూఢిల్లీ, అక్టోబరు 7:** మాజీ ఐఆర్ఎస్ అధికారి అశోక్ కుమార్ అగర్వాల్ తనపై కేసులు నమోదుచేసిన వైనంపై దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు, సీబీఐ అధికారులు సుశీల్ దివాన్, వినీత్ వినాయక్, అమిత్ కుమార్, రమణ్ త్యాగి, ప్రేమ్ కుమార్ గౌతమ్, ఎండి ఆజాద్లపై లిఖితపూర్వక ఫిర్యాదు దాఖలు చేయాలని సీబీఐ ప్రత్యేక న్యాయమూర్తిని ఆదేశించింది. ఐపీసీ సెక్షన్లు 191 (తప్పుడు సాక్ష్యం ఇవ్వడం), 193 (తప్పుడు సాక్ష్యాలను సృష్టించడం), 209 (కోర్టులో మోసపూరితంగా తప్పుడు వాదనలు చేయడం) కింద ఈ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. అశోక్ కుమార్ అగర్వాల్‌పై ఉద్దేశపూర్వకంగా సీబీఐ అధికారులు ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. అయితే 2016 జనవరిలో ఆయనపై నమోదు చేసిన ప్రాసిక్యూషన్ చెల్లదని ఢిల్లీ హైకోర్టు తీర్పునిచ్చింది. దీనిపై సుప్రీంకోర్టులో సవాలు చేయాలని సీబీఐ అంతర్గతంగా భావించింది. కానీ అందుకు తగిన ఆధారాలు లేవని కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ, న్యాయశాఖ 2016 జూలైలోనే సీబీఐ ప్రతిపాదనను తోసిపుచ్చాయి. అనంతరం అగర్వాల్ తన దగ్గర జప్తు చేసిన డాక్యుమెంట్లను తిరిగి ఇవ్వాలని కోర్టును ఆశ్రయించారు. దీనిపై సమాధానం ఇస్తూ, ప్రభుత్వం నుంచి అప్పీలు దాఖలు చేయడానికి నివేదికలు ఇంకా పరిశీలనలో ఉన్నాయని సీబీఐ అధికారులు అబద్ధం చెప్పారు. కోర్టు ఈ విచారణలో సీబీఐ అంతర్గత ఫైళ్లను సేకరించి పరిశీలించగా, అసలు విషయం బయటపడింది. దీంతో అప్పీలును ప్రభుత్వం తిరస్కరించిందనే నిజమైన డ్రాఫ్ట్ రాతలను కొట్టివేసి, కావాలనే సంప్రదింపులు జరుగుతున్నాయనే తప్పుడు వాక్యాన్ని చేర్చినట్లు హైకోర్టు నిర్ధారించింది. అనంతరం సీబీఐ అధికారులు తాము తర్వాత తమ తప్పును సరిదిద్దుకున్నామని, దీనివల్ల అగర్వాల్‌కు ఎలాంటి నష్టం కలగలేదని వాదించారు. అయితే వాదనతో విభేదించిన కోర్టు. ప్రభుత్వ వ్యవస్థల తరఫున కోర్టుల్లో వాదనలు వినిపించే అధికారులు అత్యంత బాధ్యతాయుతంగా ఉండాలని, ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారాన్ని సమర్పించడం చట్టపరంగా తీవ్రమైన నేరమని స్పష్టం చేసింది. దీంతో ప్రత్యేక న్యాయమూర్తి చేసిన ఫిర్యాదును 4 వారాల్లోగా అధికారిక మేజి ట్ కోర్టుకు పంపాలని ఆదేశించింది.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ తక్షణమే విడుదల చేయాలి

### ప్రభుత్వం నిర్లక్ష్యం వీడకపోతే ముఖ్యమంత్రి ఇంటిని ముట్టడిస్తాం

### బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య


ధర్నానుద్దేసించి ప్రసంగిస్తున్న ఆర్.కృష్ణయ్య

**ధర్నాచౌక్, అక్టోబర్ 7, ప్రభాతవార్త:** ఫీ రియంబర్స్‌మెంట్ తక్షణమే విడుదల చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బుధవారం బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ గ్రేటర్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు ముఖ్య అతిథిగా హాజరై ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ విద్యార్థుల ఫీ రియంబర్స్‌మెంట్ విడుదల చేయటానికి నిధులు లేవని ప్రభుత్వం చెప్పటం హాస్యాస్పదంగా ఉందని, వేల కోట్ల అప్పులు తెస్తున్న ప్రభుత్వం విద్యార్థుల కోసం మరో 8వేల కోట్లు అప్పు తీసుకురాలేరా అని ప్రశ్నించారు. ఫీ రియంబర్స్‌మెంట్ విడుదల చేయకపోవటంతో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్ధకంగా మారుతోందని, కోర్సులు పూర్తి చేసుకున్న విద్యార్థులకు యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వటం లేదని, దీనివల్ల పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోలేకపోతున్నారని, పీజీ కళాశాలలో సీట్లు ఖాళీగా మిగిలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ఇదే వైఖరి అవలంబిస్తే, ప్రభుత్వాన్ని దించేశామని, ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని, లేనిపక్షం విద్యార్ధులతో కలసి ముఖ్యమంత్రి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచి, ఫీజు రియంబర్స్‌మెంట్ సాధించుకోవాలని పిలుపునిచ్చారు. మన పోరాటం, ఆరాటం అంతా విద్యార్థుల కోసమేనని, విద్యార్థుల కోసం చేస్తున్న పోరాటానికి తమ పూర్తి మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. రియంబర్స్‌మెంట్ విడుదల చేయకపోతే అన్ని రాజకీయ పార్టీలతో ఆయా బహుజన సంస్థలతో హైదరాబాద్‌ను దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. బీసీ జేఏసీ నాయకులు వి.జి.ఆర్.నారగోని మాట్లాడుతూ విద్యకు నిధులు కేటాయించటం అంటే దానికి వెయ్యి రెట్లు లబ్ధి చేకూరుతుందని, చదువు అనేది దేశ అభివృద్ధి అని, అది మన దేశ జిడిపిని పెంచుతుందని స్పష్టం చేశారు. బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ ఛైర్మన్ డాక్టర్ విశారదన్ మహారాజ్ మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి క్రూరత్వం కుల అహంకారం, పక్షపాతం ఎవరి కోసమో పదే పదే స్పష్టమవుతోందని అన్నారు. రియంబర్స్‌మెంట్ ఇవ్వాలని ఆందోళన చేసిన కాలేజీ యాజమాన్యంపై విజిలెన్స్ అధికారులను పంపటం వంటి బ్లాక్‌మెయిల్ రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. ఫీరియంబర్స్‌మెంట్ బకాయిలు పెరిగిపోవటం వల్ల రూరల్ కళాశాలలు ఇప్పటికే మూతపడే పరిస్థితి ఏర్పడిందని, తక్షణమే రూరల్ కాలేజీల బకాయిలు చెల్లించి, ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పేద పిల్లల చదువుపట్ల చిన్న చూపు చూస్తే రేవంత్‌రెడ్డి రాజ్యాన్ని కూలుస్తామని హెచ్చరించారు. పిల్లి సంజయ్‌కిరణ్ అధ్యక్షతన జరిగిన ఈ ధర్నా కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు తోట్ల రాఘవేంద్రముదిరాజ్, ప్రధాన కార్యదర్శి రాజ్‌కమల్ మహరాజ్, రాసాల వినోద్‌యాదవ్, రాము యాదవ్, పూసల సాయిబాబా, బాలయ్య ముదిరాజ్ పాల్గొన్నారు.

## సాంస్కృతిక సలహాదారుగా బాలీవుడ్ నటుడు మిథున్ చక్రవర్తి

### స్వయంగా ప్రకటించిన మహారాష్ట్ర సిఎం సువేందు అధికారి



**కోల్‌కత్తా, అక్టోబరు 7:** బాలివుడ్ నటుడు, బీజేపీ నేత మిథున్ చక్రవర్తికి పశ్చిమ బెంగాల్‌లో కీలక పదవి లభించింది. రాష్ట్ర ప్రభుత్వ కల్చరల్ అడ్వైజర్‌గా నియమిస్తున్నట్లు ముఖ్యమంత్రి సువేందు అధికారి ప్రకటించారు. బెంగాల్ సినీ, సాంస్కృతిక రంగాలపై ప్రభుత్వం మరింత దృష్టి సారిస్తున్న నేపథ్యంలో ఈ నియామకం ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రముఖ బెంగాలీ నటుడు ఉత్తమ్ కుమార్ శతజయంతి వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సువేందు అధికారి ఈ ప్రకటన చేశారు. న్యూ టౌన్‌లో ఉత్తమ్ కుమార్ ఫిల్మ్ సెంటర్‌కు శంకుస్థాపన కార్యక్రమం సందర్భంగా మిథున్ చక్రవర్తి పేరును సమాచార, సాంస్కృతిక వ్యవహారాల శాఖలో సలహాదారుగా ప్రకటించారు. ఉత్తమ్ కుమార్ ఫిల్మ్ సెంటర్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.25 కోట్లు కేటాయించింది. ఇందులో థియేటర్లు, యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, స్టూడియోలు, ఫిల్మ్ పోస్ట్ ప్రొడక్షన్ వంటి సదుపాయాలు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. బెంగాల్ ఒకప్పుడు భారతీయ సినీ రంగంలో కీలక స్థానంలో ఉండేదని సువేందు అధికారి పేర్కొన్నారు. మిథున్ చక్రవర్తి భారతీయ సినీ రంగంలో ప్రముఖ నటుడిగా గుర్తింపు పొందడంతో పాటు బీజేపీ నేతగా కూడా కొనసాగుతున్నారు. పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో పార్టీ తరఫున ఆయన ప్రచార కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. 2026 పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ మిథున్ చక్రవర్తి బీజేపీ తరఫున విస్తృతంగా ప్రచారం చేశారు. ఎన్నికల అనంతరం రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడి, సువేందు అధికారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. తాజా నియామకంతో మిథున్ చక్రవర్తికి ప్రభుత్వ సాంస్కృతిక వ్యవహారాల్లో అధికారిక పాత్ర లభించినట్లయింది. బెంగాల్ సినిమా, కళలు, సాంస్కృతిక కార్యక్రమాలకు సంబంధించిన విధానాలు, ప్రాజెక్టుల్లో ఆయన అనుభవం ఉపయోగపడే అవకాశం ఉంది.

# ఉన్నత విద్యాసంస్థలు డిజిటల్ విద్యపై దృష్టి సారించాలి

### అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ సేవలు భేష్ : గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా


కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, చిత్రంలో ఘంటా చక్రపాణి తదితరులు

**జూబ్లీహిల్స్, అక్టోబరు 7, ప్రభాతవార్త:** విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించడంతోపాటు డిజిటల్ విద్యపై ఉన్నత విద్యాసంస్థలు ప్రత్యేక దృష్టి సారించాలని తెలంగాణ రాష్ట్ర గవర్నర్, యూనివర్సిటీ ఛాన్సలర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. గ్రామీణ, మారుమూల ప్రాంతాలు, వెనుకబడిన వర్గాల విద్యార్థులకు ఉన్నత విద్యను చేరువ చేయడంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అందిస్తున్న సేవలు అభినందనీయమని ఆయన అభినందించారు. యూనివర్సిటీ ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన 27వ స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథిగా గవర్నర్ హాజరయ్యారు. పరిశోధక విద్యార్థులకు పీహెచ్‌డీ, ఎం.ఫిల్ పట్టాలు, బంగారు పతకాలు, బుక్ ప్రైజ్‌లు అందజేశారు. ప్రముఖ సినీ దర్శకుడు, కవి, నటుడు బి. నర్సింగ్‌రావుకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఇప్పటివరకు 25 లక్షలకు పైగా విద్యార్థులకు విద్యావకాశాలు కల్పించిందని గవర్నర్ తెలిపారు. నిరుపేదలు, వెనుకబడిన వర్గాలు, గిరిజనులకు సమత పథకం ద్వారా ఉచిత విద్యను అందిస్తూ వీసీ ప్రొ. ఘంటా చక్రపాణి ఆదర్శంగా నిలిచారని ప్రశంసించారు. జాతీయ విద్యా విధానం-2020 స్ఫూర్తికి అనుగుణంగా యూనివర్సిటీ పనిచేస్తోందన్నారు. పట్టభద్రుల్లో సగానికి పైగా మహిళలే ఉండటం అభినందనీయమన్నారు. కుటుంబంలో ఒక మహిళ విద్యావంతురాలైతే ఆ కుటుంబాన్ని అభివృద్ధి వైపు నడిపించగలదన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, రోబోటిక్స్, ఆటోమేషన్, డిజిటల్ సాంకేతికతలు పరిశ్రమలు, ఉపాధి అవకాశాల స్వరూపాన్ని మారుస్తున్నాయని శివ ప్రతాప్ శుక్లా అన్నారు. ఐటీ, ఔషధ రంగాల్లో హైదరాబాద్ వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి వికసిత్ భారత్-2047 నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. విద్యను మరింత అందుబాటులోకి, సరళంగా, ఆసక్తికరంగా మార్చేందుకు సాంకేతికతను వినియోగించాలని సూచించారు. విద్యార్థులు డిగ్రీలను కొత్త ప్రయాణానికి నాందిగా భావించి లక్ష్యాలను నిర్దేశించుకుని క్రమశిక్షణతో పనిచేయాలని, సమాజ సేవకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. డిజిటల్ సాంకేతికతను సామాజిక లక్ష్యంతో మిళితం చేస్తూ సమ్మిళితత్వం, నాణ్యత, ఉపాధి అవకాశాలు కల్పించే విద్యా కార్యక్రమాలను ప్రవేశపెడుతున్నామని వీసీ ప్రొ. ఘంటా చక్రపాణి తెలిపారు. బోధి, డిజిటల్ కంటెంట్, మూల్యాంకనం, అభ్యాసకుల సేవలు, డిజిటల్ ధ్రువపత్రాలను ఏకీకృతం చేస్తూ సమగ్ర ఓపెన్ డిజిటల్ విశ్వవిద్యాలయంగా సంస్థను తీర్చిదిద్దుతున్నామన్నారు. విద్యార్థుల ఉపాధి అవకాశాల కోసం నైపుణ్యాభివృద్ధి, ఇంటర్న్‌షిప్, అప్రెంటిస్‌షిప్ అవకాశాలను విస్తరిస్తున్నామన్నారు. ఓపెన్ యూనివర్సిటీలు అన్ని వయసుల వారికి, వివిధ సామాజిక నేపథ్యాల వారికి ఉన్నత విద్యను చేరువ చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని న్యాక్ పూర్వ డైరెక్టర్, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ పూర్వ వీసీ ప్రొ. వి.ఎస్. ప్రసాద్ అన్నారు.

**38 బంగారు పతకాలు.. 36,145 మందికి పట్టాలు**

27వ స్నాతకోత్సవంలో 23 మంది పరిశోధక విద్యార్థులకు పీహెచ్‌డీ, ఒకరికి ఎం.ఫిల్ పట్టా అందజేశారు. యూజీలో 16, పీజీలో 22 కలిపి మొత్తం 38 బంగారు పతకాలను ప్రదానం చేశారు.

వీరిలో 29 మంది మహిళలు, తొమ్మిది మంది పురుషులు ఉన్నారు. యూజీలో బొజ్జనపల్లి శ్రీ ఆశ్రిత మూడు బంగారు పతకాలు సాధించగా, కడియాల సాయిభాను, హాజీరా బేగం, శివ పార్వతి చిప్పల చెరో రెండు పతకాలు అందుకున్నారు. పీజీలో మంతెన శ్రీదేవి, తోట శ్వేత చెరో రెండు బంగారు పతకాలు సాధించారు. స్నాతకోత్సవంలో మొత్తం 36,145 మంది విద్యార్థులకు డిగ్రీ, పీజీ, డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సుల పట్టాలు అందజేశారు.

చెర్లపల్లి, రాజమండ్రి, కడప సెంట్రల్ జైళ్లకు చెందిన 26 మంది పురుష ఖైదీలు, ఒక మహిళా ఖైదీ కలిపి 27 మంది పట్టాలు అందుకున్నారు. రాజమండ్రి సెంట్రల్ జైలుకు చెందిన నుకపెయ్యి సురేష్ అన్ని సబ్జెక్టుల్లో అత్యధిక మార్కులతో ఉత్తీర్ణుడై బంగారు పతకంతో పాటు బుక్ ప్రైజ్ అందుకోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ ఎల్వీకే రెడ్డితోపాటు ఆచార్యులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## సైబర్ నేరగాళ్లపై ఆరు రాష్ట్రాల్లో టిజిసిఎస్‌బి దాడులు

### దేశ వ్యాప్తంగా 1172 నేరాలతో సంబంధం ఉన్న 101 మంది నేరగాళ్ల అరెస్టు

**హైదరాబాద్, అక్టోబరు 7, ప్రభాతవార్త:** తెలంగాణలో సైబర్ నేరాలను నివారించే క్రమంలో నేరగాళ్లపై ఉక్కుపాదం మోపుతున్న సైబర్ సెక్యూ రిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) ఆరు రాష్ట్రాలలో ఏకకాలంలో నిర్వహించిన దాడుల్లో దేశ వ్యాప్తంగా 17 కోట్ల రూపాయల మోసాలకు సంబంధించి 1172 సైబర్ నేరాలతో సంబంధం వున్న 101 మంది నేరగాళ్లు పట్టుబడ్డారు. వీరిలో 18 మంది మహిళలు వున్నారు. తెలంగాణ, ఎపి, కర్నా టక, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరిలో ఈ దాడులు జరిగాయి. సెప్టెంబరు నెలాఖరు నుంచి రెండు వారాల పాటు ఈ దాడులు జరిగాయి. ప ట్టుబడ్డ నేరగాళ్లు అనేక రకాల ఆర్థిక నేరాలకు పాల్పడినట్లు తేలింది. అరెస్టయిన వారిలో కేరళలో 35 మంది, ఎపిలో 22 మంది, తమిళనా డులో 14 మంది, కర్ణాటకలో 17 మంది, తెలంగాణలో 12 మంది పుదుచ్చేరిలో ఒకడు వున్నారు. వీరిలో 19 మంది ఏజెంట్లుగా, 81 మంది మ్యూల్ ఖాతాతా దారులున్నారు. అరెస్టయిన నేరగాళ్లలో 50 మంది ఐదుకు పైగా నేరాలతో సంబంధం వున్నవారు వుండగా ఒక ఎంబిబిఎస్ వై ద్యుడు, మరో మాజీ సైనికుడు, 34 నేరాలతో సంబంధం వున్న ఓ వ్యాపారి వున్నాడు. అరెస్టు చేసిన వారిని ట్రాన్సిట్ వారంట్‌పై ఆయా రా ష్ట్రాల నుంచి హైదరాబాద్‌కు తరలించి బుధవారం నాడు ఇక్కడి కోర్టులో హాజరు పరిచి చంచల్‌గూడ జైలుకు తరలించారు. కాగా సైబర్ నేరాల పట్ల అన్ని వర్గాల వారు నిరంతరం అప్రమత్తంగా వుండాలని టిజిసిఎస్‌బి డైరక్టర్ శిఖా గోయల్ కోరారు. ఎవరైనా మోసపోయిన పక్షంలో వెంటనే 1930కి ఫోన్ చేయాలనిసూచించారు.

## అదృశ్యమైన మహిళ మృతదేహం లభ్యం

- మంగ మృతిపై కూతురి అనుమానం
- మంగది హత్య! ఆత్మహత్యా?
- వివరాలు సేకరిస్తున్న క్లూస్ టీం


మృతురాలు మంగా (ఫైల్ ఫోటో)

**ఎల్.బి.నగర్, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త:** వేరే ప్రాంతానికి చెందిన మహిళ మృతదేహం లభించడం స్థానికంగా కలకలం రేపింది. పది రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిన మహిళ శవమై తేలింది. మహిళ మృతి అనుమానస్పదంగా మారింది. ఈ సంఘటన నాగోల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన విగ్రహాల ప్రకారం ఉస్మానియా యూనివర్సిటీ మానికేశ్వర్ నగర్ కు చెందిన మంగ(46) సెప్టెంబర్ 28వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్ళింది. మంగ ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ అయినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా బుధవారం ఉదయం తట్టిఅన్నారం ప్రాంతంలో స్థానికులు మార్నింగ్ వాకింగ్ చేస్తుండగా చెట్ల వద్ద కుక్కలు సంచరిస్తున్నట్లు కనపడ్డాయి. వాకర్లు అక్కడికి వెళ్లి చూడగా గుర్తుతెలియని మహిళ మృతదేహం వారికి కనబడింది. వెంటనే వారు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో నాగోల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. వెంటనే క్లూస్ టీమ్ కూడా అక్కడికి రప్పించారు. మృతదేహాన్ని పరిశీలించగా పోలీసులు మంగా అని గుర్తించారు. వెంటనే మృతురాలి బంధువులకు పోలీసులు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న మంగ కుమార్తె జ్యోతి తన తల్లి మృతిపై పలు అనుమానాలు ఉన్నట్లు పోలీసులకు తెలిపింది. మిస్సింగ్ కేసు ఫిర్యాదు సమయంలోనే కొందరిపై అనుమానం ఆమె వ్యక్తం చేసింది మృతదేహం వద్ద మద్యం బాటిళ్లు కూడా ఉన్నట్లు సమాచారం. మృతదేహం వద్ద ఇతర కొన్ని ఆధారాలు కూడా దిరికినట్లు విశ్వాసనీయ సమాచారం. కాగా మంగ హత్య గురైందని ఇప్పటివరకు ఎటువంటి నిర్ధారణ కాలేదని ఎల్బీనగర్ ఏసిపి రవీందర్‌రెడ్డి, ఇన్స్పెక్టర్ మక్బూల్‌జానీ తెలిపారు.

## బీరుపై నో ఎల్‌నినో ఎఫెక్ట్ - నీటి కొరతలేకుండా ఉత్పత్తి

## బ్రూవరీలకు పూర్తి స్థాయిలో నీరు సరఫరా

**హైదరాబాద్, అక్టోబరు 7, ప్రభాతవార్త** రాష్ట్రంలో వర్షపాతం లోటు కారణంగా నీటి వనరులు తగ్గిపోతున్నప్పటికీ, ఎల్ నినో ప్రభావం వల్ల బీరు ఉత్పత్తి, సరఫరాకు ఎలాంటి ఆటంకం కలగదు. రాష్ట్ర ఖజానాకు అధిక ఆదాయాన్ని తెస్తున్న ఎక్సైజ్ శాఖపై వర్షాభావ పరిస్థితులు పడకుండా సర్కార్ చర్యలు తీసుకుంటోంది. రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదు, వర్షాభావ పరిస్థితుల మధ్య పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడానికి గాను బీరు ఉత్పత్తి చేసేందుకు బ్రూవరీలకు ఏ మాత్రం నీటి కొరత లేకుండా అవసరమైన మేరకు సరఫరా చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితుల దృష్ట్యా, రాబోయే మూడు నెలల్లో బీరు తయారీకి అవసరమయ్యే నీటి పరిమాణంపై సంగారెడ్డి ప్రాంతంలోని అన్ని బ్రూవరీల నుంచి ప్రభుత్వ అధికారులు నివేదిక కోరినట్లువ వెల్లడైంది. సింగూర్ డ్యామ్, మంజీరా ప్రాజెక్ట్, పెద్ద బ్రూవరీలను నిర్వహిస్తున్న బ్రూవరీస్ సంస్థ (కింగ్‌ఫిషర్), కార్ల్స్‌బర్గ్ వంటి ప్రధాన అంతర్జాతీయ, దేశీయ పానీయాల కంపెనీలకు బీర్ ఉత్పత్తికి అవసరమైన నీటిని అందిస్తున్నాయి. వర్షపాతం లోటు, సాగునీటి ప్రాజెక్టులలో నీటి నిల్వలు తరిగిపోతున్న దృష్ట్యా, రాబోయే రోజుల్లో బ్రూవరీలకు నీటి కొరత ఏర్పడుతుందేమోనని ప్రభుత్వం ఆందోళన చెందుతోంది. సాధారణ రోజుల్లో, సింగూర్, సమీపంలోని ఇతర ప్రాజెక్టులలో ఎనిమిది వేల మిలియన్ క్యూబిక్ ఫీట్ల నీరు అందుబాటులో ఉంటుంది. బీర్ ఉత్పత్తికి అవసరమైన రోజువారీ అవసరాలను తీర్చడానికి, అక్కడి నుండి బ్రూవరీలకు నీటిని సరఫరా చేస్తారు. సింగూర్‌లో నీటిమట్టాలు తగ్గిపోతున్నందున, బ్రూవరీలకు నీటి సరఫరాకు ప్రత్యామ్నాయాలను కనుగొనడం పెద్ద సవాలుగా మారుతుందని అధికారులు భావిస్తున్నారు. హైదరాబాద్ చుట్టుపక్కల పారిశ్రామిక ప్రాంతాలలో బలమైన నీటి సరఫరా నెట్‌వర్క్‌ను కలిగి ఉన్న హైదరాబాద్ వాటర్ బోర్డ్ నుండి నీటిని వినియోగించుకోవడం ప్రధాన ప్రత్యామ్నాయాలలో ఒకటిగా భావిస్తున్నారు. మరోపక్క అందుబాటులో ఉన్న బీర్ నిల్వలు డిసెంబర్ నెలాఖరు వరకు రాష్ట్ర అవసరాలను తీరుస్తాయి.

నీటి సరఫరా సరిపోకపోతే, జనవరి నుంచే రాష్ట్రం బీర్ కొరతను ఎదుర్కొంటుంది. ప్రాజెక్టులలో తగినంత నీరు అందుబాటులో లేకపోతే, వచ్చే వేసవిలో భారీ బీర్ కొరత ఏర్పడుతుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఈ సంక్షోభాన్ని అధిగమించడానికి ఉత్తమ మార్గం, ఈ ఏడాది చివరి వరకు అందుబాటులో ఉన్న నీటి వనరులను ఉపయోగించుకుని బీర్‌ను నిల్వ చేసుకోవాలనే ఆలోచన చేస్తున్నట్లు తెలియవచ్చింది.

# సింగరేణి లాభాల వాటాలో జాప్యం తగదు

### న- 35 శాతం వాటా వెంటనే ప్రకటించాలి - లాభాల వాటాపై శ్వేతపత్రం విడుదల చేయాలి - హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ హైమద్


సమావేశంలో మాట్లాడుతున్న కార్యదర్శి రియాజ్ హైమద్

**మందమర్రి, అక్టోబరు 7, ప్రభాతవార్త :** సింగరేణి సంస్థలో పనిచేస్తున్న కార్మికులకు వెంటనే 35 శాతం లాభాల వాటాను ప్రకటించాలని హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ హైమద్ డిమాండ్ చేశారు. బుధవారం హెచ్ఎంఎస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లాభాల వాటా ప్రకటించడంలో ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం జాప్యం చేయడం తగదన్నారు. ఇప్పటికే లాభాల వాటా ప్రకటనలో తీవ్ర జాప్యం జరిగిందని పేర్కొన్నారు. సింగరేణి లాభాల వాటాపై యాజమాన్యం వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గుర్తింపు సంఘంతో పాటు ప్రాతినిధ్య సంఘాలు కార్మికుల సమస్యలపై యాజమాన్యం, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంలో విఫలమవుతున్నాయని రియాజ్ హైమద్ విమర్శించారు. ఫలితంగా కార్మికులకు తీరని అన్యాయం జరుగుతోందన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతున్న ఏకైక యూనియన్ హెచ్ఎంఎస్ అని పేర్కొన్నారు. ఇప్పటికే పీఎల్ఆర్ బోనస్ రూ.1,10,250 ప్రకటించిన విషయం తెలిసిందేనన్నారు. దసరా పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో కార్మికుల ఆర్థిక అవసరాలను దృష్టిలో పెట్టుకుని 35 శాతం లాభాల వాటాతో పాటు దసరా అడ్వాన్స్‌ను కూడా వెంటనే విడుదల చేయాలని రియాజ్ హైమద్ డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మందమర్రి ఏరియా వైస్ ప్రెసిడెంట్ సిద్ధంశెట్టి సాజన్, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ పార్వతి రాజీ రెడ్డి, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ సుదర్శన్, బ్రాంచ్ సెక్రెటరీ శ్రీనివాస్ రెడ్డి, శ్రీరాంపూర్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ అనిల్ రెడ్డి, నాయకులు హరీష్, నవీన్, కార్తీక్, హర్ష, గౌతమ్, క్రాంతి, కాజీపేట వన్ ఫీట్ సెక్రెటరీ ప్రీత్ పాల్ సింగ్, అసిస్టెంట్ ఫీట్ శ్రవణ్, కేకేఓసీ మహేష్, కేకే ఫై రవి, పాల్గొన్నారు.

# పెట్రోలు బంక్ సీజ్ చేసేందుకువెళ్లిన అధికారి హత్య

**మహారాష్ట్రలో దారుణ ఘటన**

హింగోలి, అక్టోబరు 7: మహారాష్ట్రలో దారుణ ఘటన చోటుచేసుకుంది. పెట్రోల్ బంక్‌ను సీజ్ చేసేందుకు వెళ్లిన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ అధికారిని కత్తితో పొడిచి హత్య చేశారు. హింగోలీ జిల్లాలో జరిగిన ఈ ఘటనలో ఇండియన్ ఆయిల్ సేల్స్ మేనేజర్ మహేశ్ షెల్కే ప్రాణాలు కోల్పోయారు. పెట్రోల్ బంక్ ఆపరేటర్ కుటుంబంతో తలెత్తిన వివాదం ఈ హత్యకు దారితీసినట్లు తెలుస్తోంది. ముందురోజు సాయంత్రం చోంధి గ్రామంలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ దగ్గరకు మహేశ్ షెల్కేతో పాటు కంపెనీ అధికారులు వెళ్లారు. సాంకేతిక సమస్యల కారణంగా ఆ పెట్రోల్ బంక్ గత మూడు నెలలుగా మూసి ఉంది. దీంతో కంపెనీ నిబంధనల ప్రకారం బంక్‌ను సీజ్ చేసేందుకు అధికారులు అక్కడికి వెళ్లినట్లు సమాచారం. ఈ పెట్రోల్ బంక్‌ను సాహెబ్రావ్ పాండవ్‌వీర్ నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అధికారులు సీజ్ ప్రక్రియ చేపట్టే సమయంలో మరో నెల రోజుల గడువు ఇవ్వాలని ఆపరేటర్ కుటుంబ సభ్యులు కోరినట్లు సమాచారం. అయితే అధికారులు అందుకు అంగీకరించకపోవడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. వాగ్వాదం తీవ్రరూపం దాల్చడంతో సాహెబ్రావ్ పాండవ్‌వీర్ కుమారుడు ఉమేశ్ పాండవ్‌వీర్.. మహేశ్ షెల్కేపై కత్తితో దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడు ఆయనను ఏకంగా ఏడుసార్లు కత్తితో పొడిచినట్లు వెల్లడించారు. ఈ దాడిలో మహేశ్ షెల్కే పొత్తికడుపు, వీపు, ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. తీవ్ర రక్తస్రావంతో అక్కడికక్కడే కుప్పకూలిన ఆయన.. చికిత్స అందించేలోపే ప్రాణాలు కోల్పోయారు. దాడి అనంతరం నిందితుడు ఉమేశ్‌తో పాటు మరికొందరు వ్యక్తులు రెండు కార్లలో అక్కడి నుంచి పరారైనట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సీసీటీవీ కెమెరాల్లో రికార్డయ్యాయి. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా నిందితుల ఆచూకీ కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. ఈ ఘటనపై కురుందా పోలీస్ స్టేషన్‌లో హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మహేశ్ షెల్కే మృతిపై ఇండియన్ ఆయిల్ చైర్మన్ అర్విందర్ సింగ్ సహ్నీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. విధులు నిర్వర్తిస్తున్న సమయంలోనే తమ సహోద్యోగిపై దాడి చేసి హత్య చేయడం దారుణమని పేర్కొన్నారు. మహేశ్ షెల్కే కుటుంబానికి కంపెనీ అండగా ఉంటుందని తెలిపారు. నిందితులపై వేగంగా, కఠిన చర్యలు తీసుకోవాలని మహారాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లినట్లు వెల్లడించారు. కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీ కూడా ఈ ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మహేశ్ షెల్కే హత్యను షాకింగ్, ఆమోదయోగ్యం కాని హింసాత్మక చర్యగా అభివర్ణించారు. హింగోలీ జిల్లాలో ఇండియన్ ఆయిల్ రిటైల్ అవుట్‌లెట్‌ను కంపెనీ స్వాధీనం చేసుకునే ప్రక్రియలో భాగంగా వెళ్లిన అధికారుల బృందంలో మహేశ్ షెల్కే ఉన్నారని పూరీ తెలిపారు.

విధులు నిర్వర్తిస్తున్న సమయంలోనే పదునైన ఆయుధంతో ఆయనపై దాడి చేసి హత్య చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. నిందితులపై చట్ట ప్రకారం వేగంగా, కఠిన చర్యలు తీసుకునేలా మహారాష్ట్ర ప్రభుత్వం, పోలీసుల ఉన్నతాధికారులతో ఈ అంశాన్ని చర్చించినట్లు పూరీ తెలిపారు. దేశానికి ఇంధన సేవలు అందించేందుకు పనిచేస్తున్న సిబ్బంది భద్రత, గౌరవం, రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని ఆయన పేర్కొన్నారు.

## అభివృద్ధి అవకాశాలను వెలుగులోకి తేవడమే ప్రాంతీయ సదస్సుల లక్ష్యం

### ఎపి పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్. యువరాజ్

**విశాఖపట్నం, అక్టోబర్ 07ప్రభాత వార్త :** ఆయా ప్రాంతాల్లోని పెట్టుబడులు, ఎంఎస్ఎంఈలు, స్టార్టప్‌లు, పరిశ్రమల అభివృద్ధి అవకాశాలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు యువతకు ఉపాధి, నైపుణ్య, విద్య, పారిశ్రామిక అవకాశాలను అందుబాటులోకి తీసుకురావడమే ప్రాంతీయ సదస్సుల ప్రధాన ఉద్దేశమని రాష్ట్ర పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్. యువరాజ్ అన్నారు. మంత్రి టీజీ భరత్ తో పాటు విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన రాష్ట్రంలో తొలిసారిగా ఐదు ప్రాంతాల్లో ప్రాంతీయ సదస్సులు నిర్వహిస్తున్నామని, విశాఖపట్నంతో ప్రారంభమైన ఈ సదస్సులు కాకినాడ, గుంటూరు, తిరుపతి, అనంతపురం లోనూ నిర్వహించనున్నట్లు చెప్పారు. భారీ పెట్టుబడులు, ఏపీఐఐసీ పార్కుల్లో పరిశ్రమల ఏర్పాటు, కొత్త ఎంవోయూలు, ఇప్పటికే కేటాయించిన భూముల్లో పరిశ్రమల గ్రౌండింగ్ తదితర అంశాలపై ప్రాంతీయ సదస్సుల్లో ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నట్లు వివరించారు. ఎంఎస్ఎంఈలకు ప్రోత్సాహం కల్పించేందుకు ప్రత్యేకంగా ఎగ్జిబిషన్లు కూడా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 600 ఎంఎస్ఎంఈలు దరఖాస్తు చేసుకోగా, ఉత్తరాంధ్ర ప్రాంతం నుంచి సుమారు 150 సంస్థలు దరఖాస్తు చేసుకున్నాయని ఎంపిక చేసిన ఉత్పత్తులను ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించామన్నారు.



# గాయత్రీ.. నీకు వందనమమ్మా !

నిజమే: గాయత్రీ పెద్ద మనసును చూసును చూసి ఎవరూ మెచ్చుకోకుండా ఉండలేరు. ఈ కాలం.. కలి కాలం ! తల్లికి బిడ్డ.. బిడ్డకు తల్లి రుణానుబంధాలు ఆత్మీయ బందాలు.. కానరాని రోజులివి. మానవత్తవపు పరిమళాలు వెల్లివెరిసిన వేళ ఆ రోజు ద్వారకా తిరుమల ఆలయ నిత్యాన్న ప్రసాద కేంద్రమంతా అన్నర్తులతో నిండిపోయి ఉంది. ఎవరి సీట్లలో వారు కూర్చున్నారు. అందరూ భోజనానికి ఉపక్రమించినా భీమడోలు మండలం పాతూరు గ్రామానికి చెందిన వాడపల్లి రాంబాబు అనే దివ్యాంగుడు అన్నం తినలేక, తినేందుకు చేతుల్లేక ఆకులో పెట్టినవి ఏమీ నోటి వరకు వచ్చేదారిలేక అలాగే చూస్తూ ఉండి పోయాడు. అది చూసిన అన్నదాన కేంద్ర సేవకురాలు గాయత్రి అనే మహిళ అతని వద్దకు వెళ్లి అతనికి ముద్దలు తినపించడం, అందరి ప్రశంసలు అందుకొంది. 'మానవ సేవే మాధవ సేవ' అని నమ్మిన వారు మాత్రమే ఇలాంటి సేవలను బాధ్యతగా స్వీకరిస్తారు. తరిసానతరు. వెంటనే గమనించిన భక్తులు ఆమెను ప్రశంసిస్తూనే ఫొటోలు తీసి సోషల్ మీడియాలో పెడితే, అది చూసి ముఖ్యమంనరతి గాయత్రీ నీకు వందనమ్మా! అటు తన 'ఎక్స్' ట్విట్టర్ ఖాతాలో పోస్టు చేశారు. గాయత్రి సేవాభావాన్ని మాటల్లో చెప్పలేక వారు సైతం మనసులోనే అభినందించారు. దేవాలయ కార్యనిర్వాహణాధికారి కూడా తన సిబ్బందిలో ఆణిముత్యం ఉన్నందుకు ఎంతగానో సంతోషించారు. అమ్మ మాత్రమే చేయగలిగిన సేవను గాయనరతీలోని అమ్మ మనసును వెన్ను తట్టి లేపింది. □

# 'తెర' వదల్లేరా ?



చిన్న చిన్నవీ గుర్తుంచుకోలేకపోతున్నారు. అంతేనా, ఏకాగ్రత నిలపలేక పోతున్నారు. నెలసరి, అనారోగ్యాలతో సంబంధం లేకుండా ఊరికే అలసిపోతున్నామంటున్నారు. రాత్రంతా నిద్రపోయినా ఇదే పరిస్థితి. ఎందుకిలా అంటే 'బ్రెయిన్ బర్నవుట్' అంటున్నారు నిపుణులు. చదువు, ప్రాజెక్టులు, వెంటనే ఉద్యోగా లంటూ పరుగు తీస్తున్న అమ్మాయిలే ఎక్కువ. ఈ క్రమంలో పదే పదే పలకరించే నోటిఫికేషన్లు, విరామం, పని ఏదైతేనేం తెరలకే ఎక్కువగా అతుక్కుపోవడం, ఒకే సమయంలో అనేక పనులు చేయడం, ఏ సమయంలోనైనా అందుబాటులో ఉండాల్సి రావడం... ఇవన్నీ వెరసి మెదడును అలసిపోయేలా చేస్తున్నాయట. నోటిఫికేషన్లు, పని... వీటి మధ్య మాటిమాటికీ దృష్టి మరలుతూ ఉండటం వల్ల ఏకాగ్రత సన్నగిల్లుతోంది. దీర్ఘకాల ఒత్తిడి కూడా తోడై మెమరీపై ప్రభావం పడుతోంది. 'బ్రెయిన్ బర్నవుట్' బారినపడుతున్నారు. ఫలితమే చిన్న వయసులోనే మర్చిపోవడం, సరైన నిర్ణయాలు తీసుకోక పోవడం, చిరాకు, దేన్నీ త్వరగా అర్థం చేసుకోలేక పోవడం వగైరాలన్నీ. ఇరవైల్లో ఇదెక్కువగా కనిపిస్తోందట. అదే సమస్య. తప్పించుకోవాలంటే విశ్రాంతిపై దృష్టి పెట్టాల్సిందేనట. కేవలం ఏడు గంటల నిద్రే సరిపోదు. పని మధ్యలో తప్పక చిన్న చిన్న విరామాలు తీసుకోవాలి. ఎప్పుడూ తెరకూ, నోటిఫికేషన్లకూ దూరంగా ఉండాలి. ఇంకా పుస్తకం చదవడం, నడక, బయట ఎక్కువసేపు గడపడం వంటి చిన్న చిన్న వ్యాపకాలకూ చోటివ్వాలి. సమస్య మరీ ఎక్కువగా కనిపిస్తే నిపుణులనూ కలవాలి. వయసు పెరిగేకొద్దీ మార్పులు సహజం. కానీ ఇరవైల్లోనూ కనిపిస్తోందంటే జాగ్రత్త తీసుకోవాల్సిందే. □

# ఆరోగ్యం పట్ల ఆందోళన వద్దు!



ఎన్.బి.సుధాకర్‌రెడ్డి
సైకాలజిస్టు

వ్యథ

**ప్రశ్న :** మాకు ఒక స్నేహితురాలు ఉంది. ఆమె ఆరోగ్య జాగ్రత్తల గురించి చాలా చెబుతుంది. 50 నుంచి 60 ఏళ్ల వయసున్న పది మంది ప్రతిరోజూ గురువు సమక్షంలో యోగా చేస్తుంటాము. అయితే ఆమె మా కళ్లను, ఒళ్లను, నడకను గమనించి ఏదో ఒక జబ్బు ఉందని ఊహించి చెబుతుంది. డాక్టర్లను కలిసి పరీక్షలు చేయించు కోవాలని సూచిస్తుంది. ఆమె బలవంతం చేయడంతో ఇటీవల నేను రూ.50 వేలు ఖర్చు చేసి అన్ని రకాల వైద్య పరీక్షలు చేయించుకున్నాను. నాకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేవని వైద్యులు చెప్పారు. ఈ విషయాన్ని ఆమెకు చెప్పగా, నా సలహా వల్ల మీకు ఎలాంటి సమస్యలు లేవని తెలిసింది కదా.. మంచిదే అంటూ తనను తాను సమర్థించుకుంది. ఆమె కూడా తరచూ ఆరోగ్య పరీక్షలు చేయించుకుం టుంది. ప్రతి ఒక్కరికీ ఇలాగే ఆరోగ్య జాగ్రత్తలు చెబుతుంది. ఇటీవల ఆమె భర్త సైకాల జిస్ట్ వద్దకు తీసుకెళ్లగా, ఆమెకు ఆరోగ్యం పట్ల భయం, అతిగా శ్రద్ధ ఉన్నట్లు గుర్తిం చారని, ఇతరుల్లో కూడా ఆందోళన కలిగించే అలవాటు ఉందని చెప్పి కాగ్ని టివ్ బిహేవియర్ థెరపీ ఇచ్చారట. ఆమె వల్ల నాకు రూ.50 వేలు ఖర్చ య్యాయి. ఇలాంటి వారిని ఎలా గుర్తించాలి?



– పద్మావతి, గుంటూరు

**జవాబు:** అమ్మా, మీ స్నేహితురాలిలో ఆరోగ్య జాగ్రత్త కంటే ఆరోగ్యం పట్ల అతిగా ఆందోళన చెందే స్వభావం ఉన్నట్లు అనిపిస్తుంది. కొంత మంది తమ ఆరోగ్యం గురించి ఎక్కువగా భయపడుతూ, శరీరంలో కనిపించే ప్రతి చిన్న మార్పును కూడా వ్యాధి లక్షణంగా భావిస్తుం టారు. అలాంటి వ్యక్తులు తమలోని ఆందోళనను ఇతరుల ఆరోగ్యం పైకి కూడా మళ్లించే అవకాశం ఉంటుంది. దీనిని సాధారణంగా 'ఆందోళన బదిలీ'గా చెప్పవచ్చు. ఇతరుల కళ్లను, నడకను, శరీరాకృతిని గమనించి వ్యాధులను ఊహించ డం, వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఒత్తిడి చేయడం ఇందుకు కొన్ని సూచనలు.ముఖ్యంగా వైద్య అర్హత లేని వ్యక్తి 'మీకు ఈ వ్యాధి ఉండొచ్చు' వెంటనే అన్ని పరీక్షలు చేయించుకోండి" అంటూ పదేపదే భయపెడుతుంటే జాగ్రత్తగా ఉండాలి. ఒకసారి వైద్య పరీక్షల్లో ఎలాంటి సమస్య లేదని తేలినా, మళ్లీ మళ్లీ అనుమానాలు వ్యక్తం చేయడం కూడా ఆందోళనకు సంకేతం కావచ్చు. అయితే ఆరోగ్య సలహా చెప్పే ప్రతి వారినీ అనుమానించ కూడదు. ఇతరులు చెప్పారని మాత్రమే ఖరీదైన పరీక్షలు చేయించు కోవాల్సిన అవసరం లేదు. ముందుగా నిజంగా ఏదైనా లక్షణం ఉందా, వైద్యపరంగా పరీక్ష అవసరమా అనే విషయాన్ని వైద్యుడిని అడిగి నిర్ణయించుకోవాలి.అదే సమయంలో ఇటువంటి వ్యక్తులను ఎగతాళి చేయడం సరికాదు. వారికి తమ భయం నిజమైనదిగానే అనిపించవచ్చు. ఆరోగ్యంపై శ్రద్ధ మంచిదే. కానీ భయాన్ని ఆరోగ్య జాగ్రత్తగా మార్చి ఇతరులపై రుద్దడం మాత్రం మంచిది కాదు. మన ఆరోగ్య నిర్ణయాలు భయాల ఆధారంగా కాకుండా, వైద్యుల సలహా, శాస్త్రీయ ఆధారాల ఆధారంగా ఉండాలి. □

# కాటన్ బాల్స్‌తో..



**కాటన్ బాల్స్..** ముఖానికి రోజ్ వాటర్ రాసుకోవడానికైనా, వేసుకున్న మేకప్ తొలగించు కోవడానికైనా, నెయిల్ పాలిష్‌ని తొలగించుకునే క్రమంలో.. ఇలా అతివల సౌందర్య సంరక్షణలో ఇవి చాలా రకాలు గానే ఉపయోగపడ తాయని చెప్పచ్చు. ఇలా కేవలం బ్యూటీ విషయంలోనే కాదు.. ఈ కాటన్ బాల్స్‌ని ఇంట్లో మరిన్ని అవసరాల కోసం కూడా వాడచ్చంటున్నారు నిపుణులు.

**ఇంటి అవసరాల కోసం...**

ఇంట్లో చీమల బెడదను తగ్గించుకోవాలంటే కొన్ని వేడి నీళ్లలో కొద్దిగా చక్కెర వేసి.. అందులో టీస్పూన్ బోరాక్స్ పొడి వేసి కలపాలి. ఇందులో ముంచిన కాటన్ బాల్‌ని చీమలున్న చోట పెడితే అవి చచ్చిపోతాయి. కొన్ని చుక్కల వెనీలా ఎక్స్‌ట్రాక్ట్‌ని కాటన్ బాల్‌పై వేసి వార్డ్‌రోబ్‌లో ఓ మూల ఉంచితే దుస్తులు సవాసనలు వెదజల్లుతాయి. అలాగే రిఫ్రిజిరేటర్‌లో నుంచి వచ్చే దుర్వాసన లు పోగొట్టడానికీ ఈ చిట్కాను పాటించచ్చు. వంటింట్లో అప్పుడప్పుడూ దుర్వాసనలు రావడం మామూలే. ఇలాంటి సమయాల్లో కొన్ని కాటన్ బాల్స్‌ని ఏదైనా ఎసెన్షియల్ ఆయిల్‌లో కాసేపు ఉంచి.. ఆ గిన్నెను ఓ మూలన ఉంచడం వల్ల ఫలితం ఉంటుంది. స్విచ్ బోర్డులు, డోర్ నాబ్స్, డోర్ స్టాపర్స్.. వంటి చిన్న చిన్న వస్తువుల్ని శానిటైజ్ చేయడా నికి పెద్ద, పెద్ద క్లాత్స్ కంటేచిన్న కాటన్ బాల్స్ ఉపయోగిస్తే సులభంగా పని పూర్తవుతుంది. ఎలుకలు, ఉడతలు, వంటివి గార్డెన్‌ను పాడుచేస్తుంటే.. వెనిగర్‌లో ముంచిన కొన్ని కాటన్ బాల్స్‌ని గార్డెన్ అక్కడక్కడా వేయండి. సమస్య ఇట్టే పరిష్కారమవుతుంది. □

# ఎవరు ధర్మాత్ముడు ?

ఒకసారి 'గురవర్యా! ధర్మాత్ముడైన రాజు ఎవరో కాస్త తెలియజేయండి అంటే సూతమహర్షిని అడిగాడో ముని. అప్పుడు లోకంలో ఎందరు రాజులున్నా ధర్మాతుడైన రాజు మాత్రం జనమేజయుడు. రాజు అన్ని పనులూ చేయనవసరం లేదు. కర్తవ్యాలను నిర్వర్తిసే చాలు. దేశరక్షణ మొదటిది. తాను కానీ, తన పరివారం కానీ ప్రజల కష్టాలు తీర్చడం రెండోది. వీటిని సమర్థంగా పోషించా డాయన. సంవత్సరం పొడవునా యజ్ఞయాగాదులు నిర్వహించి లోక శ్రేయస్సు కలిగించేవాడు. ఆయనోసారి సత్రయాగం తలపెట్టినప్పుడు ఆవరణను పరిచారకులు శుభ్రం చేయసాగారు. అప్పుడు సరమ దేవత కొడుకు సారమేయుడు శునక రూపం ధరించి అక్కడి ఏర్పాట్లు చూస్తున్నాడు. కుక్క యజ్ఞ భూమిలో ఉండటం అపశకునం కనుక దాన్ని రాజు సోదరులు శ్రుత, భీమ, ఉగ్రసేనులు గాయపరిచి తరిమేశారు. సరమకు విషమం తెలిసి రాజు వద్దకు వచ్చి 'ఏ తప్పు చేయని నా బిడ్డ నీ తమ్ముళ్లు గాయపరిచారు కనుక నీకూ, నీ ప్రజలకూ, నీ సోదరులకూ పాపం కలుగుతుంది. దీనివల్ల ప్రకృతి వైపరీత్యాలు కలుగుతాయి' అని శపించి వెళ్లింది. రాజు ఆలోచించాడు. అంటే వ్యాధులూ, వరదలూ, భూకంపాలూ రావచ్చు. అలాంటి ప్రమాదాలు సంభవించకుండా ప్రకృతిని ప్రసన్నం చేసుకోవాలను కున్నాడు. సోమశ్రవుడు అనే పురోహితుడి సాయంతో వైపరీత్యాల నుంచి కాపాడుకున్నాడు. అందుకే మహాభారత కథ జనమేజయుడు, అతణ్ణి ధర్మమార్గన నడిపించిన శునకంతో ఆరంభమైంది. అదే కుక్క యమ ధర్మరాజు రూపంలో పాండవులను ధర్మమార్గన నడిపి భారతానికి సమాప్తం పలికింది. ఈ కారణంగానే భారతం ధర్మంతో, శునకంతో మొదలై అవే అంశాలతో పరిసమాప్తమయ్యింది. అందువల్ల శక్తి ఉంది కదాని బలహీనులను అవమానించకూడదు. అదే ఈ కథలో సందేశం అంటూ వివరించాడు సూతమహర్షి. □

# బ్రెడ్ పకోడి



శనగపిండి: ఒక కప్పు, పచ్చిమిర్చి: ఆరు, జీలకర్ర: ఒక టీస్పూన్, కారం: ఒక టీస్పూన్, అల్లంవెల్లుల్లి పేస్ట్: అర టీస్పూన్, పసుపు, చాట్‌మసాలా, గరం మసాలా: పావు టీస్పూన్ చొప్పున, కొత్తిమీర, పుదీనా తరుగు: పావు కప్పు చొప్పున, వంటసోడా: చిటికెడు, ఉప్పు: తగినంత, నూనె: వేయించడానికి సరిపడా.

తయారీ : మిక్సీ జార్‌లో పుదీనా, కొత్తిమీర, పచ్చిమిర్చి, జీలకర్ర, ఉప్పు వేసి కొద్దిగా నీళ్లుపోసి మెత్తగా గ్రైండ్ చేయాలి. ఒక గిన్నెలో శనగపిండి, కారం, అల్లం వెల్లుల్లి పేస్ట్, పసుపు, చాట్ మసాలా, గరం మసాలా, ఉప్పు, వంటసోడ వేసి.. కొద్దిగా నీళ్లుపోసి బజ్జీల పిండిలా జారుగా కలపాలి. బ్రెడ్ ముక్కలపై పుదీనా మిశ్రమం రాసి ఒకదానిపై ఒకటి పెట్టి అంచులు కట్ చేసి.. మూలగా రెండు ముక్కలు చేసి పెట్టుకోవాలి. స్టవ్‌మీద కడాయి పెట్టి వేయించడానికి సరిపడా నూనెపోసి, వేడయ్యాక బ్రెడ్ ముక్కలను శనగ పిండిలో ముంచి విడివిడిగా వేయిస్తే వేడివేడి బ్రెడ్ పకోడీ సిద్ధం. □

# 'ది ట్రెయిటర్స్'కు హోస్ట్‌గా ఎంజాయ్ చేశాను :తేజ సజ్జ



భారతదేశంలో ప్రత్యేక ఒరిజినల్స్‌కు పేరుపొందిన ప్రముఖ స్ట్రీమింగ్ సర్వీస్ ప్రైమ్ వీడియో 'ది ట్రెయిటర్స్ తెలుగు' తో అలరించబోతోంది. విభిన్న రంగాలకు చెందిన 20 మంది సెలబ్రిటీలు ఈ గేమ్‌లో పాల్గొంటున్నారు. మొత్తం 10 ఎపిసోడ్లుగా రూపొందిన ఈ సిరీస్‌లో పోటీదారులు నమ్మకమే ప్రమాదంగా మారే ఒక ప్రపంచంలోకి అడుగుపెడతారు.

**వరుసగా సూపర్ హిట్ సినిమాలు చేస్తున్నారు కదా.. ది ట్రెయిటర్స్ కి హోస్ట్ గా మారడం ఎలా అనిపించింది?**
ట్రెయిటర్స్ గ్లోబల్‌గా చాలా పెద్ద హిట్ ఫ్రాంచైజ్. 20కి పైగా దేశాల్లో, 25కి పైగా భాషల్లో చేశారు. హిందీలో కరణ్ జోహార్ చేసినప్పుడు నాకు దాని గురించి పెద్దగా ఆలోచన లేదు. ఒక ఎపిసోడ్ చూడడం మొదలుపెట్టి రెండు రోజుల్లో మొత్తం సీజన్ పూర్తి చేశాను

**ఎన్ని రోజులు షూట్ చేశారు? హోస్ట్ క్యారెక్టర్ ఎలాంటి ఎక్స్ పీరియన్స్ ఇచ్చింది?**
11 రోజులు షూట్ చేశాం. మొత్తం పది ఎపిసోడ్లు. నేను హిందీ వెర్షన్ చూస్తున్నప్పుడు అందులో నాకు పార్టిసిపెంట్స్‌తో ఎలాంటి ఎమోషనల్ కనెక్షన్ లేదు.వాళ్లు ఎవరో కూడా నాకు పరిచయం లేదు.

**గేమ్ షో ఎలా ఉండబోతుంది?** ఇందులో మొదటి మూడు ఎపిసోడ్లు వస్తాయి. ఆ మూడు ఎపిసోడ్లు చూసిన తర్వాత ఈ గేమ్ షోపై ఒక క్లారిటీ వచ్చేస్తుంది. ఇదంతా ఒక మర్డర్ మిస్టరీ లాగా ఉంటుంది. తెలుగులో ఇప్పటివరకు చూసిన ఏ రియాలిటీ షోతో దీనికి పోలిక ఉండదు. చాలా కొత్త ఫార్మాట్. నిజంగా ఒక రియల్ గేమ్‌లాగా ఉంటుంది.

**ఇది కొత్త గేమ్ షో అంటున్నారు కదా? ప్రేక్షకులకు ఈజీగా అర్థమవుతుందా?**మొదటి మూడు ఎపిసోడ్లు రిలీజ్ అవుతాయి. ఆ మూడు ఎపిసోడ్లు చూస్తే అసలు ఏం, ఎలాఉండ బోతుందో ఒక క్లారిటీ వచ్చేస్తుంది. ఎవరిని నమ్మాలి? ఎవరిని అనుమానించాలి?ఎవరు ట్రెయిటర్స్? ఎవరు అమాయకులు? అనే కోణంలో నడిచే ఈ గేమ్ ఒక థ్రిల్లర్ లా వుంటుంది.

**ఇందులో కంటెస్టెంట్స్‌ను ఎలా సెలెక్ట్ చేశారు?**దీనికిగేమ్ ఆడే వాళ్లు చాలా ముఖ్యం. మానిపులేట్ చేయగలగాలి, నమ్మించగలగాలి, గేమ్స్‌లోని రూల్స్ తెలిసి ముందుకెళ్లగలగాలి. దాదాపు అన్ని రంగాల్లో ఉన్న వాళ్లని ఒక్కొక్కరుగా సెలెక్ట్ చేయడం జరిగింది. సెలబ్రిటీగా ఉండటం అనేది దీని ప్రియారిటీ కాదు.గేమ్ ఆడటం అనేది ప్రియారిటీ.

**కోటి రూపాయలు ప్రైజ్ మనీ అంటున్నారు కదా? ప్రైజ్ మనీ డిస్ట్రిబ్యూషన్ ఎలా ఉంటుంది?** అది మీరు గేమ్ షో చూసి తెలుసుకోవాలి.

తెర

# 'బా బా బ్లాక్ షీప్'కు మేఘాలయ సీఎం కాన్రాడ్ కె. సంగ్మా ప్రశంసలు

అక్టోబర్ 9న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్ కానున్న క్రైమ్ కామెడీ ఈ నేపథ్యంలో మేఘాలయ



ముఖ్యమంత్రి కాన్రాడ్ కె. సంగ్మా.. బా బా బ్లాక్ షీప్ చిత్ర యూనిట్‌ను ప్రత్యేకంగా అభినందిస్తూ వీడియో విడుదల చేశారు. 'ఇది మా రాష్ట్రానికి గర్వకారణమైన క్షణం' అని పేర్కొంటూ.. మేఘాలయలో పూర్తిగా చిత్రీకరించిన తొలి దక్షిణ భారత చలన చిత్రం ఇదేనని, ఇది రాష్ట్ర అందాలను మన కొండలకు ఆవల ఉన్న ప్రేక్షకులకు చేరువ చేస్తుందని ఆయన పేర్కొన్నారు. పొగతో నిండిన మంచు కొండలు, అద్భుతమైన జలపాతాలు, స్వచ్ఛమైన నదులు, సజీవ వేర్ల వంతెనలను ఆయన ప్రస్తావిస్తూ."మన నేలను ప్రపంచంతో పంచుకునేందుకు సినిమా మరో చక్కని అవకాశం" అని చెప్పారు.నిర్మాత వేణు దోనేపూడికి, చిత్రాలయం స్టూడియోస్‌కు, నటీనటులకు, సాంకేతిక బృందానికి సంగ్మా అభినందనలు తెలిపారు. 'సినిమా చిత్రీకరణ కోసం మేఘాలయ రాష్ట్రాన్ని ఎంచుకున్నందుకు, నమ్మకం ఉంచినందుకు, దాని అందాలను వెండితెరపైకి తెచ్చినందుకు ధన్యవాదాలు" అన్నారు. మరింత మంది సినీ నిర్మాతలను రాష్ట్రానికి ఆహ్వానించేందుకు ఎదురు చూస్తున్నామని సంగ్మా పేర్కొన్నారు.

# 9న 'హనుమాన్ అంశ్' తెలుగులో విడుదల



ప్రముఖ ఆధ్యాత్మిక గురువు నీమ్ కరోలి బాబా, భక్తులు ప్రేమగా మహా రాజ్‌జీ అని పిలుచుకునే ఆయన జీవితం, బోధనల స్ఫూర్తితో రూపొం దిన హనుమాన్ అంశ్ చిత్రం..ఈ ఏడాది డివైన్ బ్లాక్ బస్టర్ విజయాన్ని అందు కున్న చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. ఈ సినిమా దేశవ్యాప్తంగా ప్రేక్షకాదరణ ను సొంతం చేసుకుంది. విశ్వాసం, భక్తి, ఆధ్యాత్మిక పరివర్తన వంటి అంశాలు అన్ని తరాల ప్రేక్షకు లను ఆకట్టుకున్నాయి. డాక్టర్ విశాల్ చతుర్వేది రచన, దర్శకత్వంలో హనుమాన్ అంశ్ తెరకెక్కింది. నీమ్ కరోలి బాబా పాత్రలో శోభినవ్ సత్య నటించారు. చందన్ ఆనంద్, పూర్ణిమా తివారీ తదితరులు కీలక పాత్రల్లో కనిపించారు. హిందీ లో విజయవంతమైన థియేట్రికల్ జర్నీ అనంత రం ఇప్పుడు ఈ చిత్రం తెలుగు ప్రేక్షకుల ముందు కు రాబోతోంది. . అక్టోబర్ 9న 'హనుమాన్ అంశ్' తెలుగు వెర్షన్ థియేటర్లలో విడుదల కానుంది. ప్రెస్ మీట్ లో హీరో శోభి నవ్ సత్య మాట్లాడుతూ.. జై సీతారాం. విశాల్ మన భారతీయ సంస్కృతికి చాలా కీలకమైన, ముఖ్య మైన సినిమాని తీశారు. ఆయన వల్లే ఈ సినిమా ఎక్కడ వరకు చేరింది. డైరెక్టర్ విశాల్ మాట్లాడుతూ.. జై సీతారాం. హైదరాబాద్ రావడం చాలా ఆనందంగా ఉంది. తెలుగు ప్రేక్షకులు సినిమాని తెలుగులో విడుదల చేయాలని కోరుకున్నారు. ఇందులో హోంబలే ఫిలిమ్స్ భాగస్వామి అయినందుకు చాలా ఆనం దంగా ఉంది. తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడ చూసినా సరే భారీ భారీ హనుమంతుల వారి విగ్రహా లు కనిపిస్తాయి. మనందరం కూడా బజరంగ్‌బలి భక్తులమే. ప్రొడ్యూసర్ రాగిణి మాట్లాడుతూ.. హోంబలే ఫిల్మ్స్‌కి థాంక్యూ. ఇది నార్త్ ఇండియా లో ఎంత గొప్ప విజయాన్ని సాధించిందో, ఇక్కడ కూడా అదే గొప్ప విజ యాన్ని సాధిస్తుందని నమ్మకం ఉంది. మైత్రి మూవీ మేకర్స్ నిర్మాత రవిశంకర్ మాట్లాడుతూ.. ఈ సినిమా హిందీలో ఎంత పెద్ద సంచలనం సృష్టించిందో మనందరికీ తెలుసు. ఇందులో కథానాయకుడిగా చేసిన సత్య అద్భుతంగా నటించారు. మైత్రి శశిధర్ రెడ్డి మాట్లాడుతూ... ఈ సినిమాని హిందీలో చూసిన ప్రేక్షకులు తెలుగులో ఎప్పుడు వస్తుందో అని ఎదురు చూశారు.

# 'మయూఖ' ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుంది :శ్రీ తేజ్ ఎస్.కె



పాయల్ చెంగప్ప ప్రధాన పాత్రలో నటిస్తున్న సినిమా "మయూఖ".ఈ చిత్రాన్ని శ్రీ తేజ్ ఎస్.కె. దర్శకత్వం వహిస్తున్నారు, ప్రశ్విత ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్ పై శశిధర్ నల్ల నిర్మిస్తున్నారు. సినిమా బండి ప్రొడక్షన్స్ బ్యానర్ పై పలు ఇంట్రెస్టింగ్ మూవీస్ నిర్మించిన శ్రీకాంత్ కాండ్రేగుల శ్రీతేజ్ ఎస్.కె. గా స్క్రీన్ నేమ్ మార్చుకుని ఈ చిత్రానికి దర్శకత్వం వహించడం విశేషం. "మయూఖ" సినిమా ఈ నెల 9న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. మా మయూఖ సినిమాకు ఇటీవల న్యూయార్క్ ఫిలిం ఫెస్టివల్ లో బెస్ట్ మిస్టరీ మూవీగా అవార్డ్ వచ్చింది. థ్రిల్లర్ కేటగిరిలో సెకండ్ బెస్ట్ వచ్చింది. ఈ అవార్డ్ వస్తుందని మేము ఎక్స్ పెక్ట్ చేయలేదు. మా మూవీ అవార్డ్ కు సెలెక్ట్ అయ్యిందని తెలిసి టీమ్ అంతా హ్యాపీగా ఫీలయ్యాం. మేము కేన్స్ ఫిలిం ఫెస్టివల్ కు కూడా మా మూవీని అప్లై చేశాం. మీరు మా మూవీ ప్రమోషనల్ కంటెంట్ చూస్తే కొరియన్, హాలీవుడ్ మూవీ తరహా స్టోరీ టెల్లింగ్, కలర్ గ్రేడింగ్ కనిపిస్తుంటుంది. ఈ కథను మొదట నటి మహేశ్వరి (గులాబీ ఫేమ్) కి చెప్పాం. ఆమె మేము చెప్పిన రెండు కథలు విన్నారు. ఈ స్టోరీతో పాటు మరొక కథ ఆమెకు బాగా నచ్చింది. ఆ కథకు ఆమె లాక్ అయ్యారు. పాయల్ కన్నడలో మంచి ఎంటర్ టైనింగ్ మూవీస్ చేశారు. ఆమె మా కథలోని క్యారెక్టర్ కు బాగా సరిపోతా రని అనిపించింది. ఆమె చేసిన వెబ్ సిరీస్ లతో ఇప్పటికే తెలుగు ఆడియెన్స్ కు రీచ్ అయ్యారు. ఇలాంటి తరహా థ్రిల్లర్స్ గతంలో వచ్చినా మా మూవీలో స్క్రీన్ ప్లే, సినిమా స్టోరీని ప్రెజెంట్ చేసే విధానం కొత్తగా ఉండి ఆకట్టుకుంటుంది. ప్రెజెంటేషన్ కొత్తగా ఉంది కాబట్టే న్యూయార్క్ ఫిలిం ఫెస్టివల్ లో బెస్ట్ థ్రిల్లర్ గా అవార్డ్ దక్కింది. ఇక్కడే మా ప్రయత్నం సక్సెస్ అయ్యిందనే నమ్మకం మొదలైంది. ఎక్కడో స్మశానంలో దెయ్యాలు ఉన్నాయంటే ముందే మనసు ప్రిపేర్ అవుతుంది కానీ మనం నివసించే చోట, రోజు ఉండే చోట ఎవరో అపరిచిత వ్యక్తి ఉన్నారంటే ఇంకా ఎక్కువ భయపడతాం. మయూఖ హారర్ సినిమా కాదు థ్రిల్లర్ మూవీ.

# 'సమ్మర్ హాలిడేస్' 'ఫ్రెండ్షిప్ సాంగ్' రిలీజ్



కథా బలమున్న చిత్రాలను ప్రేక్షకులకు అందిస్తూ సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్ గా, డిస్ట్రిబ్యూటర్ గా పేరు తెచ్చుకున్నారు ధీరజ్ మొగిలినేని. ఆయన తన ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్ పై 'సమ్మర్ హాలిడేస్' అనే చిల్డ్రన్ మూవీని నిర్మిస్తు న్నారు. 'సమ్మర్ హాలిడేస్' సినిమాను మన చిన్న నాటి జ్ఞాపకాలను గుర్తుచేసే ఒక అందమైన కథతో దర్శకుడు శ్రీకర్ రూపొందిస్తున్నారు. ఈ చిత్రంలో మాస్టర్ రోహన్, మాస్టర్ అరుణ్, బేబి ఖుషి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. త్వరలోనే "సమ్మర్ హాలిడేస్" సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. 'సమ్మర్ హాలిడేస్' సినిమా మ్యూజిక్ ప్రమోషన్స్ సక్సెస్ ఫుల్ గా జరుగుతున్నాయి. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజ్ చేసిన 'క్రష్ సాంగ్..' 'స్కూల్ సాంగ్' మ్యూజిక్ లవర్స్ నుంచి హ్యూజ్ రెస్పాన్స్ తెచ్చుకున్నాయి. ఈ రోజు ఈ సినిమా నుంచి 'ఫ్రెండ్షిప్ సాంగ్..' రిలీజ్ చేశారు. ఈ పాటను సింజిత్ యెర్రమల్లి బ్యూటిఫుల్ ట్యూన్ తో కంపోజ్ చేశారు. ఈ పాట పల్లవికి పూర్ణాచారి సాహిత్యం అందిం చగా, చరణం, హుక్ లైన్ కిట్టు విస్సాప్రగడ రాశారు. శ్రీ రామ చంద్ర ఆకట్టుకునేలా పాడారు. 'ఫ్రెండ్షిప్ సాంగ్..' ఎలా ఉందో చూస్తే 'ఓ రెండు తోకచుక్కలు తొడిగాయి చిన్ని రెక్కలు, గోదారి దారిపొడవునా ఎగిరాయే, ఆ పాల బోసినవ్వులు, అల్లరి తారా జువ్వలు, ఊరంతా కొత్త సందడే చేశారే, యేటి గట్టులో, మావి చెట్టులో, నీటి తొట్టిలో వీరే, ఒక్క చోటులో కుదురుగుండరు, రోజంతా ఈ కోతిలే, కాగితాల పడవల్లా తేలుతూ దాటుతారు గోదారే...' అంటూ సాగుతుందీ పాట. ఈ పాటలో మ్యూజిక్ డైరెక్టర్ సింజిత్ యెర్రమల్లి, సింగర్ శ్రీరామచంద్ర నటించడం విశేషం.

# 'సరిపోయారు ఇద్దరూ' టీజర్ విడుదల



హ్యాపీ ఆక్స్ ఎంటర్టైన్మెంట్, ఎంఎస్ వారాహి క్రియేషన్స్, శతమానంభవతి ఆర్ట్స్ బ్యానర్ల మీద సాదత్, ముని శివ నిర్మించిన చిత్రం 'సరిపోయారు ఇద్దరూ' సతీష్ వేగేశ్న తెరకెక్కించిన ఈ మూవీలో మేఘాంశ్ శ్రీహరి, యశ్విన్ వేగేశ్న, రాజేంద పసాద్, సీనియర్ నటుడు నరేష్, రిద్ధి కుమార్, మేఘా చౌదరి కీలక పాత్రలను పోషించారు. ఈ మూవీ టీజర్‌ను తాజాగా రిలీజ్ చేశారు. హిట్ మెషీన్, సక్సెస్ ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి ఈ చిత్ర టీజర్‌ను రిలీజ్ చేసి టీం కు అభినందనలు తెలిపారు.టీజర్‌లో పల్లెటూరి వాతావరణం, వైజాగ్ సిటీని అందంగా చూపించారు. టీజర్ ప్రారంభంలో స్నేహితులుగా కలిసి ఉన్న నరేష్, రాజేంద్ర ప్రసాద్.. టీజర్ ఎండింగ్‌కి అలా ఎందుకు మారారు? అన్నదే కథ అన్నట్టు కట్ చేశారు. ఇక యూత్, ఫ్యామిలీ ఆడియెన్స్‌కి ఎక్కువగా కనెక్ట్ అయ్యేలా సినిమాని సతీష్ వేగేశ్న తెరకెక్కించారు. టీజర్‌లో మేఘాంశ్ శ్రీహరి, యశ్విన్ వేగేశ్న స్క్రీన్ ప్రజెన్స్ బాగున్నాయి. హీరో, హీరోయిన్ల లవ్ ట్రాక్.. వైజాగ్ ఎపిసోడ్స్ సినిమాకి కీలకంగా ఉండబోతోన్నాయి. ఈ మూవీకి అనూప్ రూబెన్స్ సంగీతాన్ని అందించారు. సమీర్ రెడ్డి సినిటోగ్రఫీ సినిమాకి ప్రధాన ఆకర్షణ కానున్నాయి. ఈ చిత్రాన్ని త్వరలోనే ఆడియెన్స్ ముందుకు తీసుకు వచ్చేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

## న్యూజిలాండ్‌తో టి20: టీమిండియాలో
# ముగ్గురు కీలక ఆటగాళ్లు గల్లంతు



**న్యూఢిల్లీ:** న్యూజిలాండ్‌తో జరగనున్న ఐదు మ్యాచ్‌ల టీ20ఐ సిరీస్ కోసం భారత్ 16 మంది సభ్యులతో కూడిన జట్టును ప్రకటించింది. ఈ సిరీస్‌లో శ్రేయస్ అయ్యర్ కెప్టెన్‌గా, తిలక్ వర్మ వైస్ కెప్టెన్సీగా కొనసాగనున్నారు. ఈ టీ20 ఐదు మ్యాచ్‌ల సిరీస్ ఈ నెల 22న క్రైస్ట్‌చర్చ్‌లో ప్రారంభమై నవంబర్ 1 వరకు జరుగుతుంది. దాదాపు నాలుగేళ్ల తర్వాత భువనేశ్వర్ కుమార్, రీ ఎంట్రీ ఇవ్వగా, వరుణ్ చక్రవర్తికి స్థానం లభించింది. ప్రస్తుత జట్టులో అయ్యర్‌తో పాటు, అభిషేక్ శర్మ, సంజు సామ్సన్, ఇషాన్ కిషన్, తిలక్ వర్మ, వైభవ్ సూర్యవంశీ, శివమ్ దూబే ఉన్నారు. అయితే జట్టులో రింకు సింగ్, వాషింగ్టన్ సుందర్, కృనాల్ పాండ్యాలకు చోటు దక్కలేదు. రింకు అత్యంత గుర్తింపు పొందిన టీ20 ఫినిషర్లలో ఒకడిగా కొనసాగుతున్నప్పటికీ, ఈ బ్యాటర్ మరోసారి జట్టుకు దూరమయ్యాడు. అతను ఐపీఎల్ 2026లో అద్భుతంగా రాణించి, 14 మ్యాచ్‌లలో రెండు అర్ధశతకాలతో సహా 148.99 స్ట్రైక్ రేట్‌తో 295 పరుగులు చేశాడు. జింబాబ్వేతో జరిగిన భారత టీ20 సిరీస్‌లో కూడా అతను తనదైన ముద్ర వేసి, రెండు ఇన్నింగ్స్‌లలో 168.18 స్ట్రైక్ రేట్‌తో 37 పరుగులు చేశాడు. అతని ఫామ్ లేకపోవడం కంటే, భారత బ్యాటింగ్ ఎంపికలు అధికంగా ఉండటమే అతడిని జట్టులోకి తీసుకోకపోవడానికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. వాషింగ్టన్ సుందర్ గైర్హాజరు విషయం కాస్త భిన్నమైనది. ఈ ఆల్‌రౌండర్‌ను వాస్తవానికి వెస్టిండీస్ టీ20ల కోసం ఎంపిక చేసినప్పటికీ, రెడ్‌బాల్ క్రికెట్‌పై దృష్టి సారించి, న్యూజిలాండ్‌తో జరగబోయే టెస్ట్ సిరీస్‌కు సిద్ధమయ్యేందుకు అతడిని జట్టు నుండి తొలగించారు. న్యూజిలాండ్ పర్యటన కోసం ఇండియా ఎ జట్టులో భాగంగా ఉన్నాడు. సుందర్ మల్టీఫార్మాట్ ఆటగాడిగా 65 టీ20 లు ఆడి, 286 పరుగులు, 52 వికెట్లు సాధించాడు. పొదుపైన ఆఫ్‌స్పిన్ బౌలింగ్ చేయగల అతని సామర్థ్యం, బ్యాట్‌తో రాణించడం అతన్ని ఒక విలువైన ఎంపికగా మార్చాయి, కానీ సెలెక్టర్లు ప్రధాన టీ20 జట్టులో అక్షర్ పటేల్, శివమ్ దూబే, నితీష్ కుమార్‌లను ఎంచుకున్నారు.

# ఉరుగ్వే చేతిలో భారత్ చిత్తు
## 1-6 తేడాతో ఓటమి




**కోల్‌కతా:** అంతర్జాతీయ స్నేహపూర్వక మ్యాచ్‌లో రెండుసార్లు మాజీ ప్రపంచ ఛాంపియన్ అయిన ఉరుగ్వే 6-1 తేడాతో సునాయాసంగా భారత్‌పై గెలుపు సాధించింది. అనిరుధ్ థాపా గోల్ చేసినప్పటికీ ఉరుగ్వే భారత్‌ను చిత్తుగా ఓడించింది. తొలి అర్ధభాగంలో భారత్ ఎంతో ఆశాజనకంగా ఆడింది. 11వ నిమిషంలో డార్విన్ నునెజ్ పెనాల్టీ ద్వారా సాధించిన గోల్‌ను, 22వ నిమిషంలో థాపా చేసిన గోల్ సమం చేయడంతో, 20వ ర్యాంకులో ఉన్న దక్షిణాది జట్టుపై ఆతిథ్య జట్టుకు నమ్మకం కలిగింది. కానీ మెరుపుల కారణంగా 34 నిమిషాల పాటు ఆట నిలిచిపోయిన తర్వాత క్రమంగా వెనుకబడిపోవడంతో, ఉరుగ్వే ఆటపై పట్టు సాధించి, మాక్సిమిలియానో అరౌజో (28వ, 59వ నిమిషాలు), రోడ్రిగో జలజార్ (53వ నిమిషం), ప్రత్యామ్నాయ ఆటగాళ్లు జువాన్ సనబ్రియా (71వ నిమిషం), రోడ్రిగో అగ్యురేల ద్వారా మరో ఐదు గోల్స్ చేసింది. ఖాలిద్ జమీల్ జట్టు పనామాతో 1-1 డ్రాతో అంతర్జాతీయ విండోను ముగించి, ఆ తర్వాత మూడు రోజుల వ్యవధిలో బ్రెజిల్ మరియు ఉరుగ్వేల చేతిలో వరుసగా 0-4 మరియు 1-5 తేడాతో ఓటమి చవిచూసింది. ఉరుగ్వే చేతిలో భారత్ 16 తేడాతో ఓడిపోయింది. విలియమ్స్ మిడ్‌ఫీల్డ్‌లో షాట్ కొట్టగా, కార్డోజో దానిని అడ్డుకున్నా థాపా అత్యంత వేగంగా స్పందించి గోల్ చేశాడు. అరౌజో గోల్ చేసి ఉరుగ్వేను ఆధిక్యంలోకి తీసుకువచ్చాడు. ఆ తర్వాత ప్రత్యామ్నాయ ఆటగాడు సనబ్రియా గోల్ కొట్టగా ఉరుగ్వే విజయం సాధించింది.

## ఆర్కిటిక్ ఓపెన్‌లో మెయిన్ డ్రాకు
# సింధు, తరుణ్, రౌనక్
### ఉన్నతి, అష్మిత ఓటమితో నిష్క్రమణ

**ఫిన్లాండ్:** రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత పివి సింధు మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌కు చేరుకోగా, ఆర్కిటిక్ ఓపెన్ సూపర్ 500 టోర్నమెంట్‌లో భారత్‌కు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. తరుణ్ మన్నేపల్లి, రౌనక్ చౌహాన్ పురుషుల సింగిల్స్ విజయాలతో మెయిన్ డ్రాకు దూసుకెళ్లారు. ఆసియా క్రీడల్లో క్వార్టర్ ఫైనల్స్‌లో ఓడిపోయి పతకం కోల్పోయిన మాజీ ప్రపంచ ఛాంపియన్ సింధు, కెనడాకు చెందిన వెన్ యు జాంగ్‌ను 28 నిమిషాల్లో 21-8, 21-11 తేడాతో ఓడించింది. ఉన్నతి హుడా, చైనాకు చెందిన హాన్ కియాన్ క్సీ చేతిలో 16-21, 21-15, 22-24 తేడాతో ఓడిపోగా, అష్మిత చలిహా డెన్మార్క్‌కు చెందిన ఏడవ సీడ్ లైన్ క్రిస్టోఫర్సెన్ చేతిలో 7-21, 21-14, 24-26 తేడాతో పరాజయం పాలైంది. మరోవైపు, మాల్విక బన్సోద్ తైవాన్‌కు చెందిన సంగ్ షువో యున్‌ను 21-15, 14-21, 21-14 తేడాతో ఓడించి మెయిన్ డ్రాలోకి ప్రవేశించింది, కానీ రౌండ్ ఆఫ్ 32లో అనుభవజ్ఞురాలైన స్కాటిష్ క్రీడాకారిణి కిర్స్టీ గిల్మోర్‌ను అధిగమించలేక, 40 నిమిషాల పోరులో 18-21, 13-21 తేడాతో ఓడిపోయింది. క్వాలిఫికేషన్ రౌండ్‌లో, మన్నేపల్లి బెల్జియంకు చెందిన రెండో సీడ్ జూలియన్ కారగ్గిని 21-12, 19-21, 21-13 తేడాతో ఓడించాడు. చౌహాన్ ఇజ్రాయెల్‌కు చెందిన డానియిల్ డుబోవెంకోను 18-21, 21-17, 21-19 స్కోరుతో ఓడించాడు. అయితే, రక్షిత, శ్రీ సంతోష్ రామ్‌రాజ్ జర్మనీకి చెందిన యవోన్ లీ చేతిలో 11-21, 21-16, 9-21 తేడాతో ఓడిపోయి టోర్నమెంట్ నుండి నిష్క్రమించింది.









**పుదుచ్చేరి:** మొదటి అనధికారిక వన్డేలో ఇండియా ఎ జట్టుకు కోలుకోలేని షాక్ తగిలింది. ఆస్ట్రేలియా ఎ చేతిలో ఏకంగా 125 పరుగుల తేడాతో చిత్తుగా ఓడిపోయింది. 275 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత

# తొలి వన్డేలో ఇండియా ఘోర పరాజయం
## ఆస్ట్రేలియా చేతిలో 125 రన్స్‌తో ఓటమి

యువ జట్టు, ఆసీస్ బౌలర్ల ధాటికి తాళలేక కేవలం 149 పరుగులకే కుప్పకూలిపోయింది. మొదటి ఇన్నింగ్స్ తర్వాత విజయం మనదే అనుకున్న అభిమానులకు ఛేజింగ్‌లో భారత బ్యాటర్లు తీవ్ర నిరాశ మిగిల్చారు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆస్ట్రేలియాకి ప్రారంభంలోనే గట్టి షాక్‌లు తగిలాయి. భారత బౌలర్ సూర్యాంశ్ షెడ్గే ధాటికి కేవలం 87 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి తీవ్ర కష్టాల్లో పడింది. ఆ సమయంలో ఆసీస్ కనీసం 150 పరుగులు కూడా చేయదేమో అనిపించింది. కానీ నాలుగో స్థానంలో వచ్చిన నాథన్ మెక్స్వీనీ అద్భుత సెంచరీ (135 బంతుల్లో 123 పరుగులు, 13 ఫోర్లు)తో జట్టును ఆదుకున్నాడు. కెప్టెన్ విల్ సుదర్‌లాండ్‌తో కలిసి నాథన్ మెక్స్వీనీ ఆరో వికెట్‌కు ఏకంగా 141 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. సుదర్‌లాండ్ కూడా 2 ఫోర్లు, 4 సిక్సర్లతో విరుచుకుపడి 77 పరుగులు సాధించాడు. దీంతో ఆస్ట్రేలియా 48.2 ఓవర్లలో 274 పరుగుల గౌరవప్రదమైన స్కోరుకు చేరుకుని ఆల్‌రౌండ్ ప్రదర్శన చేసింది. భారత్ బౌలర్లలో సూర్యాంశ్ షెడ్గే 4 వికెట్లతో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచాడు. 275 పరుగుల ఛేజింగ్ ప్రారంభించిన ఇండియా ఆదిలోనే తడబడింది. స్కోరు బోర్డుపై కేవలం 12 పరుగులు ఉన్నప్పుడే తొలి వికెట్ కోల్పోగా, 58 రన్స్ అయ్యేసరికి ఏకంగా 4 వికెట్లు నేలకూలాయి. రజత్ పటీదార్ 53 పరుగులతో (5 ఫోర్లు, 1 సిక్సర్) కాస్త పోరాడి జట్టును ఆదుకునే ప్రయత్నం చేసినా, అతనికి సహకరించే బ్యాటర్ కరువయ్యాడు. 105 పరుగుల వద్ద ఐదో వికెట్ పడిన తర్వాత భారత ఇన్నింగ్స్ పడిపోయింది. 118 పరుగులకు ఆరో వికెట్, 138 పరుగులకు ఏడో వికెట్ కోల్పోగా, చివరికి 149 పరుగుల వద్దే మిగిలిన 3 వికెట్లు వరుసగా పడిపోయాయి. దీంతో 31.4 ఓవర్లలోనే భారత్ కథ ముగిసింది. ఆస్ట్రేలియా బౌలర్లలో మహ్లీ బియర్డ్‌మాన్ 4 వికెట్లు తీసి భారత బ్యాటింగ్ వెన్ను విరిచాడు.

# యూత్ టెస్ట్‌లో భారత్ ఘన విజయం
## 2-0తో ఆస్ట్రేలియాపై సిరీస్ క్లీన్ స్వీప్





**అహ్మదాబాద్:** యూత్ టెస్టులో భారత్ అండర్19 జట్టు ఆస్ట్రేలియా అండర్19 జట్టుపై 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఆతిథ్య జట్టు సందర్శక జట్టును 151 పరుగులకే ఆలౌట్ చేయగా, బలోడా 8/41తో తన మ్యాచ్ గణాంకాలను 14/73కి చేర్చుకున్నాడు. కేవలం 11 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన లక్ష్య రైచందాని, ఛేజింగ్‌లోని మొదటి రెండు బంతులను బౌండరీకి తరలించడంతో ఇండియా మొదటి ఓవర్‌లోనే మ్యాచ్‌ను ముగించింది. బ్లేక్ క్యాటిల్, జెడ్ హోలిక్ ఓవర్‌నైట్ బ్యాటర్లుగా ఉండగా, ఆస్ట్రేలియా 55 పరుగుల వెనుకబడి, నాలుగు వికెట్ల నష్టానికి 86 పరుగులతో రోజును ప్రారంభించింది. రెండో రోజు చివరి సెషన్‌లో పిచ్ బాగా దెబ్బతిన్నట్లు కనిపించడంతో, బలోడా మూడో రోజు తన మొదటి బంతికే డిఫెండింగ్‌లో ఉన్న హోలిక్‌ను ఎల్బీడబ్ల్యూగా అవుట్ చేశాడు. తన తర్వాతి ఓవర్‌లో చార్లీ హెండర్సన్ ఆఫ్, మిడిల్ స్టంప్స్‌ను పడగొట్టి క్లీన్ బౌల్డ్ చేశాడు. క్యాటిల్ అపారమైన పరిణితిని ప్రదర్శించి, మరో ఎండ్‌లో ఉన్న 10వ నంబర్ బ్యాట్స్‌మెన్ పాట్రిక్ సుల్లివన్‌తో కలిసి స్ట్రైక్‌ను తన ఆధీనంలో ఉంచుకున్నాడు. కెప్టెన్ యశ్‌బర్ధన్ చౌహాన్, క్యాటిల్ ఫీల్డ్‌ను ఓపెన్‌గా ఉంచి, అతడిని సింగిల్స్ తీసుకునేలా ఒత్తిడి చేశాడు. క్యాటిల్ బంతిని లాంగ్‌ఆఫ్ మీదుగా పంపి తన అర్ధశతకాన్ని పూర్తి చేసుకున్నాడు. ఆ తర్వాత అతను ఆస్ట్రేలియాను భారత్ ఆధిక్యాన్ని అధిగమించేలా చేశాడు. బలోడాను ఎదుర్కొనే ప్రయత్నంలో క్యాటిల్ చివరికి బౌల్డ్ అయ్యాడు. దీంతో భారత్ ఈ సిరీస్‌ను 2-0తో క్లీన్ స్వీప్ చేసింది.

# రూ.4.31 లక్షలకోట్ల ఇన్వెస్టర్ల సంపద ఆవిరి
## రెపోరేట్ ఎఫెక్ట్‌తో నష్టాల్లో సెన్సెక్స్, నిఫ్టీ



**ముంబయి, అక్టోబరు 7:** భారత స్టాక్ మార్కెట్ బుధవారం భారీగా నష్టపోయింది. బిఎస్ఇ సెన్సెక్స్ 429 పాయింట్లు నష్టపోగా, ఎన్ఎస్ఇ నిఫ్టీ 173 పాయింట్లు నష్టపోయింది. రెపో రేట్ పెంచుతూ ఆర్బీఐ తీసుకున్న నిర్ణయం మార్కెట్లపై ప్రతికూల ప్రభావం చూపింది. రెపో రేటును ఆర్బీఐ 25 బేసిస్ పాయింట్లు (0.25 శాతం) పెంచడంతో రెపో రేటు మొత్తం 5.50 శాతానికి పెరిగింది. మూడున్నరేళ్ల తర్వాత రెపో రేటును ఆర్బీఐ పెంచింది. ఈ నిర్ణయం మార్కెట్లపై ప్రతికూల ప్రభావం పడింది. దీంతో స్టాక్ మార్కెట్ నష్టాల్లో కొనసాగింది. సెన్సెక్స్ 429.11 పాయింట్లు నష్టపోయి 72,638.70 వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 173.05 పాయింట్లు నష్టపోయి 22,603.05 వద్ద ముగిసింది. బ్రాడర్ మార్కెట్లు మిశ్రమంగా ముగిశాయి. బిఎస్ఇ మిడ్‌క్యాప్ సెలెక్ట్ ఇండెక్స్ 76.43 పాయింట్లు నష్టపోగా, బిఎస్ఇ స్మాల్‌క్యాప్ సెలెక్ట్ ఇండెక్స్ 15.71 పాయింట్లు లాభపడింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 0.5 శాతం నష్టపోగా, స్మాల్‌క్యాప్ సూచీ 0.4 శాతం వృద్ధితో ముగిసింది. ఈ భారీ పతనం కారణంగా పెట్టుబడిదారుల సంపదగా భావించే బిఎస్ఇ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ. 474.75 లక్షల కోట్ల నుండి రూ. 470.44 లక్షల కోట్లకు పడిపోయింది. సుమారుగా 4.30 లక్షలకోట్ల నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. నిఫ్టీ మెటల్ షేర్లు 2.33 శాతం పడిపోగా, నిఫ్టీ ఆటో 1.58 శాతం నష్టపోయింది. నిఫ్టీ పిఎస్‌యూ బ్యాంక్ మాత్రం ఒక శాతం లాభపడింది. అంతర్జాతీయ మార్కెట్లో రూపాయి విలువ స్వల్పంగా బలహీనపడింది. బిఎస్ఈ సెన్సెక్స్ 30 ఇండెక్స్‌లో కోటక్ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, ఐసిఐసిఐ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు లాభాల్లో ముగిశాయి. అత్యధికంగా కోటక్ బ్యాంక్ షేర్లు 2.21 శాతం లాభపడ్డాయి. మరోవైపు ఏసియన్ పెయింట్స్, ఎల్ అండ్ టీ, ఇన్ఫోసిస్, బిఇఎల్, టైటాన్ షేర్లు నష్టాల్లో ముగిశాయి. అత్యధికంగా నష్టపోయింది టైటాన్ (3.52 శాతం). డాలర్‌తో 45 పైసలు పడిపోయిన రూపాయి 96.77 వద్ద కొనసాగుతోంది. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధర స్వల్పంగా పెరిగింది. 0.98 శాతం పెరిగిన బ్యారెల్ క్రూడాయిల్ ధర 101.5 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

# యుపిఐ లావాదేవీలపై ఎండిఆర్ ఎఫెక్ట్ నిల్

### గవర్నర్ సంజయ్ మల్హోత్రా

**ముంబయి, అక్టోబరు 7:** యుపిఐ ద్వారా జరిపే కొన్ని లావాదేవీలపై స్వల్పంగా విధించనున్న మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) వల్ల లావాదేవీల పరిమాణంపై పెద్దగా ప్రభావం ఉండకపోవచ్చని భారతీయ రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అన్నారు. ఈనెల 15నుంచి రూ. 2 వేలు దాటిన యుపిఐ లావాదేవీలపై 0.4 శాతం యూజర్ ఛార్జీ అమల్లోకి రానున్న నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ కొత్త ఛార్జీల వల్ల యుపిఐ లావాదేవీలు తగ్గుతాయా అని ప్రశ్నించగా, "ప్రస్తుతానికి లావాదేవీల పరిమాణంలో ఎలాంటి తగ్గుదల కనిపించడం లేదు. ఈ స్వల్ప రుసుము వల్ల వాల్యూమ్‌పై పెద్ద ప్రభావం ఉంటుందని నేను వ్యక్తిగతంగా భావించడం లేదు" అని ఆయన స్పష్టం చేశారు. ఎండీఆర్‌పై నిర్ణయం ఇప్పటికే తీసుకున్నామని, ఇది యుపిఐ వినియోగాన్ని దెబ్బతీయదని ఆయన వివరించారు. గత ఆరేళ్లుగా నిర్దిష్ట యుపిఐ లావాదేవీలపై ఎలాంటి ఛార్జీలు లేవు. గత నెలలో కేంద్ర ప్రభుత్వం రూ. 2వేలకు పైబడిన లావాదేవీలపై ఎండిఆర్‌ను ప్రవేశపెడుతున్నట్లు ప్రకటించింది. ఈ ఛార్జీలు కేవలం వ్యాపారులకే వర్తిస్తాయని, కస్టమర్లపై ఎలాంటి భారం ఉండదని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గతంలోనే స్పష్టం చేశారు. ఈ ఛార్జీలకు సంబంధించి కొన్ని మినహాయింపులు కూడా ఉన్నాయి. రైల్వేలు, టెలికాం, బీమా, ఇంధనం, వ్యవసాయ ఉత్పత్తులవంటి రంగాల్లో రూ. 2వేలు దాటిన చెల్లింపులపై ప్రతి లావాదేవీకి రూ. 5 ఫ్లాట్ ఫీజు ఉంటుంది. రూ. 75వేలు అంతకంటే ఎక్కువ మొత్తంలో జరిగే లావాదేవీలపై ఎండిఆర్ గరిష్ఠంగా రూ. 300గా నిర్ణయించారు. వ్యక్తుల మధ్య జరిగే యూపీఐ లావాదేవీలపై ఎంత మొత్తమైనప్పటికీ ఎలాంటి ఛార్జీలు ఉండవని ఆర్థిక మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది.

# రెపోరేట్ 25 బేసిస్ పాయింట్లు పెంచిన ఆర్బీఐ




**ముంబయి, అక్టోబరు 7:** ప్రపంచ ఆర్థిక పరిస్థితులు సవాళ్లుగా మారుతున్న వేళ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక నిర్ణయం తీసుకుంది. రెపోరేటును 25 బేసిస్ పాయింట్లు పెంచింది. దాంతో రెపోరేటు 5.50 శాతానికి చేరింది. ఫ్లోటింగ్ ఇంట్రెస్ట్ రేటుకు హౌసింగ్, వెహికల్ లేదా ఇతర స్థిరాస్తి లోన్ తీసుకున్నవారిపై వడ్డీ భారం పడనుంది. ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా నేతృత్వంలో మూడు రోజులపాటు జరిగిన ద్రవ్య విధాన కమిటీ సమీక్షా సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. రెపో రేటుతోపాటు స్టాండింగ్ డిపాజిట్ ఫెసిలిటీ రేటును 5.25 శాతానికి, మార్జినల్ స్టాండింగ్ ఫెసిలిటీ, బ్యాంక్ రేటును 5.75 శాతానికి పెంచారు. ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణం భారీగా పెరిగే అవకాశం ఉందని మల్హోత్రా తెలిపారు. దాంతో పలు ప్రధాన దేశాల కేంద్ర బ్యాంకులు ద్రవ్య విధానాన్ని కఠినతరం చేసే పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. భారత్‌లోనూ ద్రవ్యోల్బణం పెరుగుతోంది. ఆగస్టులో వినియోగదారుల ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం 4.82 శాతానికి చేరింది. జూలైలో ఇది 4.45 శాతంగా ఉంది. అదేవిధంగా పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా ముడిచమురు ధరలు బ్యారెల్‌కు 100 డాలర్లను దాటాయి. అంతర్జాతీయంగా బాండ్ రాబడులు పెరగడం, క్రూడ్ ధరలు ఎగబాకడం, ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు పెరగడంతో రెపోరేటును యథాతథంగా ఉంచే అవకాశం తగ్గిందని ఆర్థిక నిపుణులు తెలిపారు. ఫిబ్రవరి 2023 తర్వాత తొలిసారి రెపోరేటు పెరగవచ్చని నిపుణులు ముందుగానే అంచనావేశారు. ద్రవ్యోల్బణం దాదాపు 5 శాతానికి చేరుతున్న నేపథ్యంలో రానున్న సమావేశాల్లోనూ కఠిన నిర్ణయాలు ఉండవచ్చని ఎస్‌బిఐ రిసెర్చ్ పేర్కొన్నది. ఫ్లోటింగ్ ఇంట్రెస్ట్ రేటుకు హౌసింగ్, వెహికల్ లేదా ఇతర స్థిరాస్తి లోన్ తీసుకున్నవారిపై వడ్డీ భారం పడనుంది. ఈ వడ్డీ భారాన్ని ఆయా బ్యాంకులు రెండు రకాలుగా వినియోగదారునిపై వేయనున్నాయి. నేరుగా ఇఎంఐపైన వేస్తే మీరు చెల్లించే నెలవారి ఇఎంఐ పెరుగుతుంది. అలాకాకుండా లోన్ కాల వ్యవధి పైన కూడా వేయవచ్చు. ఇఎంఐలో తేడా రాకుండా మొత్తంలోన్ చెల్లించే కాల వ్యవధి పెరుగుతుంది. బ్యాంకును సంప్రదించి ఈ రెండింటిలో ఏది మీకు వర్తించింది అనేది తెలుసుకోవచ్చు. ఇఎంఐ పెంచుకోవడం మంచిదా లేక లోన్ కాలవ్యవధి పెంచుకుంటే మంచిదా అనేది ఆర్థిక నిపుణులను అడిగి తెలుసుకోవాలి.

## ఎగుమతిదారులకు రుణ గడువు
# 450 రోజులకు పెంచాలి: ఎఫ్ఐఇఒ



**న్యూఢిల్లీ, అక్టోబరు 7:** ప్రీ షిప్మెంట్, పోస్ట్‌షిప్మెంట్ ఎగుమతి రుణాల కాల పరిమితిని ప్రస్తుత 270 రోజుల నుంచి 450 రోజులకు పెంచాలని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎక్స్పోర్ట్ ఆర్గనైజేషన్స్ రిజర్వ్ బ్యాంక్‌ను కోరింది. ఆర్బీఐ పాలసీ రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు పెంచి 5.50 శాతానికి చేర్చడంతో పాటు, ద్రవ్య విధాన వైఖరిని క్యాలిబ్రేటెడ్ టైటనింగ్‌గా మార్చిన నేపథ్యంలో ఎఫ్ఐఇవో ఈ విజ్ఞప్తి చేసింది. రుణ వ్యయాలు పెరగడం వల్ల ఎగుమతిదారులపై, ముఖ్యంగా ఎంఎస్ఎంఇలపై ఆర్థిక భారం మరింత పెరిగే అవకాశం ఉందని సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది. ప్రస్తుతం ప్రపంచ వాణిజ్యం అనేక అనిశ్చిత పరిస్థితులను ఎదుర్కొంటున్న సమయంలో అధిక వడ్డీ వ్యయాలు ఎగుమతి రంగంపై ప్రభావం చూపవచ్చని పేర్కొంది. ఎఫ్ఐఇఒ అధ్యక్షుడు ఎస్.సి. రల్హాన్ మాట్లాడుతూ, ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు పెరుగుతున్న నేపథ్యంలో ధరల స్థిరత్వాన్ని కాపాడేందుకు ఆర్బీఐ రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు పెంచడం అర్థవంతమేనని అన్నారు. అయితే ఎగుమతులపై ఆధారపడిన వ్యాపారాలకు, ముఖ్యంగా ఎస్ఎంఇలకు అవసరమైన వర్కింగ్ క్యాపిటల్ అందుబాటును ద్రవ్య విధానం ప్రభావితం చేయకుండా చూడటం కీలకమని పేర్కొన్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో దేశ జిడిపి వృద్ధి 7.8 శాతంగా నమోదైందని, వస్తువులు మరియు సేవల ఎగుమతులు కూడా బలమైన వృద్ధి ధోరణిని కొనసాగిస్తున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వడ్డీ వ్యయాలు పెరగడం ఎగుమతిదారుల ఆర్థిక స్థితిపై ప్రతికూల ప్రభావం చూపవచ్చని రల్హాన్ అన్నారు. ఎక్కువ కాలం పడుతున్న షిప్పింగ్, రవాణా ప్రక్రియలు, లాజిస్టిక్స్ అంతరాయాలు, ఎగుమతి బకాయిల వసూళ్లలో జాప్యాలను దృష్టిలో ఉంచుకుని ప్రీషిప్మెంట్, పోస్ట్‌షిప్మెంట్ ఎగుమతి రుణాల కాలాన్ని 270 రోజుల నుంచి 450 రోజులకు పెంచాలని ఆయన ఆర్బీఐని కోరారు.

# రూపాయికి షాకిచ్చిన ఆర్బీఐ ఎంపిసి నిర్ణయం
## 43 పైసలు క్షీణించి 96.78వద్ద ముగింపు



**ముంబయి, అక్టోబరు 7:** అమెరికా డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి బుధవారం కీలక మద్దతు స్థాయిని కోల్పోయింది. భారతీయ రిజర్వ్ బ్యాంక్ రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు పెంచడంతో రూపాయి ఐదు నెలల కనిష్ఠ స్థాయికి పడిపోయింది. రూపాయి విలువ 43 పైసలు క్షీణించి డాలర్‌కు రూ.96.78 వద్ద ముగిసింది. ఇది ఇప్పటివరకు నమోదైన రెండో అత్యంత బలహీన ముగింపు కావడం గమనార్హం. ముందురోజు రూ.96.35 వద్ద ముగిసిన రూపాయి బుధవారం రూ.96.37 వద్ద ప్రారంభమై, రోజులో రూ.96.34-రూ.96.84 మధ్య కదలాడింది. ద్రవ్యోల్బణం, ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఆర్‌బీఐ రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు పెంచి 5.50 శాతానికి చేర్చింది. అంతేకాకుండా తన విధాన వైఖరిని న్యూట్రల్ నుంచి క్యాలిబ్రేటెడ్ టైటెనింగ్‌కు మార్చింది. దీంతో అవసరమైతే భవిష్యత్తులో మరిన్ని వడ్డీ రేట్ల పెంపులకు అవకాశం ఉందన్న సంకేతాలు వెలువడ్డాయి. ఎల్‌కేపీ సెక్యూరిటీస్‌కు చెందిన కమోడిటీ అండ్ కరెన్సీ విభాగం వైస్ ప్రెసిడెంట్ రీసెర్చ్ అనలిస్ట్ జతీన్ త్రివేది మాట్లాడుతూ, ఆర్‌బిఐ రేటు పెంపు, విధాన వైఖరిలో మార్పు కరెన్సీ మార్కెట్‌లో ఆందోళనను పెంచాయని తెలిపారు. ద్రవ్యోల్బణం, రాబోయే ఆర్థిక గణాంకాలను బట్టి మరిన్ని రేట్ల పెంపులకు అవకాశం ఉండటంతో రూపాయిపై ఒత్తిడి కొనసాగవచ్చన్నారు. రూపాయి రూ.96.45-రూ.97.25 పరిధిలో కదలాడే అవకాశం ఉందని ఆయన అంచనా వేశారు. హెచ్‌డిఎఫ్‌సి సెక్యూరిటీస్ సీనియర్ రీసెర్చ్ అనలిస్ట్ దిలీప్ పర్మార్ మాట్లాడుతూ, ఆర్‌బీఐ కఠిన వైఖరి, ద్రవ్యోల్బణంపై పెరుగుతున్న ఆందోళనలు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయని పేర్కొన్నారు. ముడి చమురు ధరలు పెరగడం, అంతర్జాతీయ మార్కెట్లలో రిస్క్ అవర్షన్ పెరగడం రూపాయిపై మరింత ఒత్తిడి తెచ్చాయని తెలిపారు. సమీప కాలంలో డాలరుతో రూపాయి మారకం రూ.96.97 వద్ద నిరోధం, రూ.96.30 వద్ద మద్దతు ఉండవచ్చని పేర్కొన్నారు. ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా మాట్లాడుతూ, రియల్ ఎఫెక్టివ్ ఎక్స్ఛేంజ్ రేట్ సహా పలు అంచనాల ప్రకారం రూపాయి అధిక విలువలో లేదని, కొంత మేర తక్కువ విలువలో ఉండే అవకాశం ఉందని తెలిపారు. రూపాయి స్థిరపడేలా, సరైన విలువ దిశగా కదిలేలా ఆర్‌బిఐ చర్యలు తీసుకుంటుందని ఆయన పేర్కొన్నారు. అంతర్జాతీయ పరిణామాలు కూడా రూపాయిపై ప్రతికూల ప్రభావం చూపాయి. డాలర్ ఇండెక్స్ 0.45 శాతం పెరిగి 102.28కు చేరగా, బ్రెంట్ క్రూడ్ ధర 1.34 శాతం పెరిగి బ్యారెల్‌కు 101.93 డాలర్లకు చేరింది. రూపాయి బలహీనతతో పాటు భారత ఈక్విటీ మార్కెట్లలోనూ బుధవారం అమ్మకాల ఒత్తిడి కనిపించింది. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారత ఈక్విటీల్లో రూ.2,961.30 కోట్ల విలువైన షేర్లను నికరంగా విక్రయించారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.